గురువారం
13•6•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 8 • సంచిక 349
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

APARNA
Lead the future

అక్షర ఆయుధంతో జనజాగృతికి
స్ఫూర్తినిస్తున్న నమస్తే తెలంగాణ
దినపత్రికకు

8 వ

వార్షికోత్సవ శుభాకాంక్షలు

జగతిని మేల్కొలిపి, ఉత్తేజాన్ని నింపి తెలంగాణ ప్రజలకు
ప్రపంచ వార్తలనందించి, అనుక్షణం స్ఫూర్తిని నింపుతున్న నమస్తే తెలంగాణ దినపత్రిక
ఎనిమిది వసంతాలు పూర్తి చేసుకున్న తరుణాన అపర్ణా గ్రూప్ వారి శుభాకాంక్షలు.

Aparna Group
Gated Communities | Building Materials

బుధవారం కొంపల్లిలోని ఆస్పీషియస్ కన్వెన్షన్ సెంటర్లో కాళేశ్వరం ప్రాజెక్ట్ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు కుమారుడు అనుదీప్ వివాహం సంజనాకృష్ణతో ఘనంగా జరిగింది. వీరి వివాహానికి హాజరై వధూవరులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం

పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ

లోక్‌సభాపక్ష నేత ఎంపికపై నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర సమితి పార్లమెంటరీ పార్టీ సమావేశం గురువారం పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరుగనున్నది. ప్రగతిభవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశంలో ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారిగా జరుగుతున్న ఈ సమావేశంలో పార్టీ లోక్‌సభాపక్ష నేతపైనా నిర్ణయం తీసుకునే అవకాశమున్నది. రాష్ట్రానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలు, విడుదల కావాల్సిన నిధులు, విభజన చట్టంలోని అంశాల అమలులో కేంద్రంపై ఏ విధంగా ఒత్తిడి తీసుకురావాలనే దానిపై చర్చించనున్నారు. సమావేశానికి హాజరుకావాల్సిందిగా పార్టీకి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు సమాచారం అందింది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి 9 మంది గెలువగా.. ఆరుగురు రాజ్యసభ సభ్యులు కలిపి మొత్తం 15 మంది ఎంపీలు సమావేశానికి హాజరుకానున్నారు.

బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్?

రేవంత్, కోమటిరెడ్డితో రాంమాధవ్ మంతనాలు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కాంగ్రెస్ ఎంపీలను కాషాయ నీడకు తీసుకొచ్చేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి రాంమాధవ్.. కాంగ్రెస్ ఎంపీలు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో భేటీ అయినట్టు విశ్వసనీయ సమాచారం. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కుదేలవుతున్న నేపథ్యంలో ఈ ఇద్దరు ఎంపీలతో రాంమాధవ్ భేటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకొన్నది. త్వరలోనే రేవంత్, కోమటిరెడ్డి బీజేపీలో చేరుతారని వస్తున్న ఊహాగానాలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

బుధవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆషాఢ బోనాల జాతర ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఆలయ ఈవో అన్నపూర్ణ, వేదపండితులు

మహంకాళి బోనాలకు పకడ్బందీ ఏర్పాట్లు

దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాన్ని ప్రతిబింబించే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల జాతరను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీగా అన్ని ఏర్పాట్లుచేయాలని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశించారు. మహంకాళి అమ్మవారి బోనాల నిర్వహణకు ఎన్ని నిధులైనా ప్రభుత్వం వెచ్చిస్తుందని, బోనాలకు వచ్చే లక్షలమంది భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. బోనాలను పురస్కరించుకుని దేవాలయ ఈవో అన్నపూర్ణ, వేదపండితులు బుధవారం గచ్చిబౌలిలోని క్యాంపు కార్యాలయంలో ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఏర్పాట్ల గురించి మంత్రికి వివరించారు. జూలై 7 నుంచి 22 వరకు సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి జాతర జరుగనున్నదని, 7న ఘటం, ఎదుర్కోలు, 21న బోనాలు, 22న రంగం ఉంటుందని తెలియజేశారు. భక్తులకు తాగునీటి ప్యాకెట్లను, ప్రసాదాలను అందుబాటులో ఉంచాలని ఇంద్రకరణ్‌రెడ్డి దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వేదపండితులు మంత్రి అల్లోలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అన్నపూర్ణ, వేదపండితులు పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డిప్లామా కోర్సులు

- ఆన్‌లైన్‌లోనే దరఖాస్తుల స్వీకరణ.. జూలై 4 వరకు గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ డిప్లామా కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది.ఆన్‌లైన్ ద్వారా జూలై 4న సాయంత్రం 4 గంటల వరకు స్వీకరించనున్నట్టు విశ్వవిద్యాలయం పేర్కొన్నది. అభ్యర్థులు ప్రాస్పెక్టస్, సూచనలను డౌన్‌లోడ్ చేసికొని పూర్తిగా అర్థంచేసుకున్న తర్వాతే దరఖాస్తు పూరించాలని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో కనీసం నాలుగేండ్లు చదువుకున్నవారు మాత్రమే అర్హులు. పదోతరగతిలో సాధించిన గ్రేడ్‌పాయింట్ ప్రకారం రిజర్వేషన్లకు లోబడి ఎంపిక ఉంటుందని రిజిస్ట్రార్ ఎస్ సుధీర్‌కుమార్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.pjtsau.edu.in చూడాలని సూచించారు.

ముహూర్తం

సూర్యోదయం: 5.46 గంటలకు

సూర్యాస్తమయం: 6.47 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం ఏకాదశి సాయంత్రం 4.51 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: చిత్త ఉదయం 10.56 వరకు, తదుపరి స్వాతి, అమృత ఘడియలు: తె.జా. 4.47 నుంచి ఉదయం 6.23 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.54 నుంచి 3.32 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.19 నుంచి సాయంత్రం 5.03 వరకు, వర్జ్యం: సాయంత్రం 4.23 నుంచి 5.59 వరకు.

లోకం పోకడ

అదిగో స్మార్ట్ ఫోన్.. తిను కన్నా!

రాజ్యాంగం ప్రకారమే విలీనం

నియోజకవర్గ అభివృద్ధి, రాష్ట్ర సంక్షేమం కోసమే టీఆర్ఎస్‌లో చేరిక

- కాంగ్రెస్ నాయకత్వంపై విశ్వాసం లేదు.. అక్కడ గ్రూపులు ఎక్కువ
- అమ్ముడుపోవడానికి గొర్రెలం, బర్రెలం కాదు
- అడ్డగోలు మాటలు ఆపకపోతే పరువునష్టం దావావేస్తాం
- హుజూర్‌నగర్‌లో తేల్చుకుందాం.. రండి
- మీడియాతో టీఆర్ఎస్‌లో విలీనమైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాజ్యాంగం ప్రకారమే టీఆర్ఎస్ శాసనసభా పక్షంలో విలీనమయ్యామని.. ఎమ్మెల్యేలుగా ప్రమాణస్వీకారం సమయంలో చెప్పినట్టుగానే నడుచుకుంటున్నామని టీఆర్ఎస్‌లో విలీనమయిన కాంగ్రెస్ శాసనసభ్యులు స్పష్టంచేశారు. కాంగ్రెస్ నాయకులు తమపట్ల ఇష్టారీతిగా మాట్లాడితే సహించేదిలేదని, వారిపై పరువునష్టం దావావేస్తామని హెచ్చరించారు. విలీనమైన శాసనసభ్యులు బుధవారం అసెంబ్లీ ఆవరణలోని టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఉమ్మడిగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ.. ఒక పార్టీకి చెందిన శాసనసభ్యుల్లో మూడింట రెండొంతుల మంది ఆమోదంతో వేరేపార్టీలో విలీనం కావచ్చని భారత రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో స్పష్టంగా ఉన్నదని.. ఆ ప్రకారమే తాము టీఆర్ఎస్‌లో విలీనమయ్యామని తెలిపారు. 2019 మార్చిలో గోవా అసెంబ్లీలో మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ శాసనసభా పక్షం బీజేపీలో విలీనమైన విషయాన్ని గుర్తుచేశారు. త్రిపుర తదితర రాష్ట్రాల్లోనూ విలీనమైన విషయాలకు సంబంధించిన వార్తలను ఆయన మీడియాకు చూపించారు. కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగాన్ని చదువుకోవాలని హితవుపలికారు. నియోజకవర్గ అభివృద్ధి, రాష్ట్ర సంక్షేమం దృష్ట్యానే టీఆర్ఎస్‌లో చేరామని తెలిపారు. కాంగ్రెస్‌లో అణిచివేత, గ్రూపు రాజకీయాలు.. నాయకత్వంపై నమ్మకం, విశ్వాసం లేకపోవడం, రాజకీయ భవిష్యత్‌పై భరోసాలేకనే పార్టీ మారామని చెప్పారు. సీఎం కేసీఆర్‌ను కలిసినప్పుడు రాతపూర్వకంగానే ప్రకటన చేశామని.. అవసరమైతే రాజీనామా చేస్తామని కూడా ప్రకటించామని గుర్తుచేశారు. గతంలో మంత్రులుగా పనిచేసిన అనేకమంది ఇతర పార్టీల్లో చేరారని తెలిపారు. పొంగులేటి సుధాకర్‌రెడ్డి, డీకే అరుణ, రాపోలు ఆనందభాస్కర్, భిక్షమయ్యగౌడ్, సునీతాలక్ష్మారెడ్డి, ఆరేపల్లి మోహన్ ఇలా అనేకమంది కాంగ్రెస్‌ను వీడారని గుర్తుచేశారు. వాళ్లెందుకు పార్టీ మారారో కాంగ్రెస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. పరిషత్ ఎన్నికల్లో ప్రజలు టీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పట్టారని.. గతంలో ఎన్నడూ లేనివిధంగా 32 జెడ్పీలపై గులాబీ జెండా ఎగిరిందని తెలిపారు.

బుధవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న టీఆర్ఎస్‌లో విలీనమైన కాంగ్రెస్ శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి, ఆతం సక్కు, సబితా ఇంద్రారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, రేగా కాంతారావు, వనమావెంకటేశ్వర్‌రావు, చిరుమర్తి లింగయ్య, జాజుల సురేందర్, హర్షవర్ధన్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి, హరిప్రియానాయక్

మేం గొర్రెలం బర్రెలం కాదు: గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకత్వంపై పలుమార్లు అసంతృప్తి వ్యక్తంచేసినా మార్పు రాలేదని చెప్పారు. ప్రలోభాలకు లోనయ్యామని, అమ్ముడుపోయామని చెప్పడానికి తాము గొర్రెలు, బర్రెలం కాదని హెచ్చరించారు. 2014 తరువాత జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ గెలుస్తూ వస్తున్నదని అన్నారు. డీసీసీ అధ్యక్షులుగా ఉన్న గండ్ర జ్యోతి రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరి జెడ్పీటీసీ స్థానానికి పోటీచేస్తే ప్రజలు 10 వేలకు పైగా భారీ మెజార్టీతో గెలిపించారని చెప్పారు. తమను రాజీనామా చేయాలని అడుగుతున్నారని, కానీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేసి ఖాళీఅయిన హుజూర్‌నగర్ నియోజకవర్గంలో తేల్చుకుందామని గండ్ర సవాల్ విసిరారు. తమ విలీనంపై బీజేపీ నేతలూ మాట్లాడుతున్నారని.. ఆ పార్టీ పలు రాష్ట్రాల్లో ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను విలీనం చేసుకున్నదని.. 40 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ ఏకంగా ప్రధాని మోదీ పేర్కొనడాన్ని గుర్తుంచుకోవాలని మండిపడ్డారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, డీ సుధీర్‌రెడ్డి, వనమా వెంకటేశ్వర్‌రావు, హరిప్రియానాయక్, చిరుమర్తి లింగయ్య, ఆత్రం సక్కు, కందాల ఉపేందర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, జాజుల సురేందర్, పైలట్ రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

బుధవారం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రతిష్ఠాత్మకంగా తెలంగాణ గురుకులాలు

- పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్య ద్వారానే పేద కుటుంబాలు సామాజిక, ఆర్థిక ప్రగతి సాధిస్తాయన్న లక్ష్యంతో ప్రభుత్వం గురుకులాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నదని రాష్ట్ర సంక్షేమశాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల అధికారులతో మంత్రి బుధవారం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా సౌకర్యాలు కల్పిస్తూ మెరుగైన విద్య అందిస్తున్నామని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గురుకులాల్లో ఒక్కో విద్యార్థిపై దాదాపు రూ.1.20 లక్షల వరకు వెచ్చిస్తున్నామని, మెరుగైన బోధన, రుచికరమైన భోజనం, ఆటాపాటలతో ఇంటిని మరిపించేలా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతిలో మొత్తం సీట్లు 14,640 ఉండగా ఇప్పటివరకు 13,444 మంది, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 17,904 సీట్లుండగా 16,347 మంది, గిరిజన గురుకులాల్లో మొత్తం 5,707 సీట్లకు 5,037 మంది చేరారని, అలాగే, బీసీ గురుకులాల్లో 5వ తరగతిలో మొత్తం సీట్లు 19,781 ఉండగా, 16,416 మంది చేరినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వందశాతం విద్యార్థులు ప్రవేశాలు పొందేలా కృషిచేయాలని, ఉత్తమ విద్యాబోధనతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడాలని మంత్రి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మైనార్టీ గురుకులాల కార్యదర్శి షఫియుల్లా, ఎస్సీ, ఎస్టీ గురుకులాల సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో మనమే ఆదర్శం

- ప్రజాపంపిణీలో కూడా మనమే టాప్
- పౌరసరఫరాలశాఖ వార్షిక నివేదికను విడుదలచేసిన మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ధాన్యం సేకరణతోపాటు ప్రజాపంపిణీలో కూడా తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని పౌరసరఫరాలశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు పౌరసరఫరాలశాఖలో తీసుకొచ్చిన సంస్కరణలు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. బుధవారం సివిల్‌సప్లయిస్ భవన్‌లో పౌరసరఫరాలశాఖ 2018-19 వార్షిక నివేదికను మంత్రి విడుదలచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ-పాస్, ఐరిస్, టీ-రేషన్ యాప్, రేషన్ పోర్టబిలిటీ, బియ్యం రవాణా వాహనాలకు జీపీఎస్, కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటి చర్యల ద్వారా ప్రజాపంపిణీ విధానంలో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం పంపిణీలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం కోసం గత ఫిబ్రవరి నుంచి ఈ-పాస్ యంత్రాల ద్వారా బియ్యం పంపిణీ ప్రారంభించినట్టు తెలిపారు. ఇది విజయవంతం కావడంతో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లకు కూడా ఇదే విధానం ద్వారా సన్నబియ్యం సరఫరాకు సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు. పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాలతో ధాన్యం దిగుబడి గణనీయంగా పెరుగుతున్నదని, అందుకనుగుణంగా ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, కనీస మద్దతు ధర లభించేలా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ ఏడాది 14,62,382 మంది రైతుల నుంచి 77.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.13,622 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.



రాష్ట్ర పౌరసరఫరాలశాఖ వార్షిక నివేదికను విడుదలచేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ అకున్ సబర్వాల్ ఉన్నారు.

రువాండ మాజీ మంత్రి టోని సంగనీరాను సత్కరిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

మంత్రి నిరంజన్‌రెడ్డి, రువాండ మాజీ మంత్రి టోనీ భేటీ

ప్రభుత్వ ఉద్యోగాల కోసం యువకులు ఎదురుచూడకుండా వ్యవసాయం వైపు దృష్టిమళ్లేలా తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. గత ఐదేండ్లుగా వ్యవసాయరంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకొన్నదని, నిరాశలో ఉన్న రైతాంగానికి బాసటగా అనేక పథకాలను ప్రవేశపెట్టి వారిలో ఆత్మస్థైర్యం నింపినట్టు వెల్లడించారు. రువాండ దేశ వ్యవసాయశాఖ మాజీ మంత్రి టోని సంగనీరా హైదరాబాద్ పర్యటన సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధికి తీసుకొంటున్న చర్యలను మంత్రి వివరించారు. వ్యవసాయరంగంపట్ల తెలంగాణ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాలను టోని సంగనీరా అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ అకున్‌సబర్వాల్, పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

పచ్చని అడవుల్లో ఎండల మంటలు

17,294 హెక్టార్లలో అటవీ సంపద దగ్ధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో నానాటికి పెరుగుతున్న ఎండలకు అడవులు మండుతున్నాయి. చాలారోజులపాటు వేసవి తీవ్రత కొనసాగడంతో అటవీప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు భారీగా చోటుచేసుకొన్నాయి. ఎండల తీవ్రత ఒకవైపు.. మానవ తప్పిదాలు మరోవైపు అడవుల్లో ఆరని చిచ్చును రగుల్చుతున్నాయి. జనవరి నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 13,890 ప్రాంతాల్లో మంటలు చెలరేగి 17,294 హెక్టార్లలోని అటవీ సంపద దగ్ధమైనట్టు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో అగ్నిప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉన్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 3,700 చోట్ల మంటలు చెలరేగి 42 చదరపు కిలోమీటర్ల పరిధిలో, మహబూబాబాద్ జిల్లాలో 1,300 ప్రాంతాల్లోని 32 చదరపు కిలోమీటర్లు, కొత్తగూడెం సర్కిల్‌లో 2,600 చోట్ల 26 చదరపు కిలోమీటర్ల మేర అటవీ సంపదకు నష్టంవాటిల్లినట్టు ఉపగ్రహచిత్రాలు వెల్లడిస్తున్నాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొని ఘటనాస్థలానికి చేరుకోవడం వల్ల ఎక్కువ మొత్తంలో సంపద నష్టం జరుగకుండా పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జంతు ప్రేమికుల సహకారంతో అటవీశాఖ ప్రత్యేక బృందాలు చర్యలు తీసుకొన్నాయి.

విద్యావాలంటీర్ల కొనసాగింపు

డీఈవోలకు విద్యాశాఖ ఆదేశాలు జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావాలంటీర్లను కొనసాగిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ్‌కుమార్ బుధవారం డీఈవోలకు ఆదేశాలు జారీచేశారు. జిల్లాలవారీగా గత ఏడాదిలో ఉన్న విద్యావాలంటీర్ల పోస్టులన్నీ భర్తీచేయాలని ఆదేశించారు. 15 వేలకుపైగా విద్యావాలంటీర్లను గత ఏడాది మాదిరిగానే కొనసాగిస్తున్నామని తెలిపారు.

19న వికలాంగులకు జాబ్ మేళా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు దివ్యాంగులశాఖ డైరెక్టర్ బీ శైలజ తెలిపారు. మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమభవన్‌లో నిర్వహించే జాబ్‌మేళాకు 18 నుంచి 32 ఏండ్ల మధ్య వయసుగల వైకల్యం ఉన్న వ్యక్తులు హాజరుకావచ్చని చెప్పారు. పదో తరగతి నుంచి పీజీ, బీటెక్ విద్యార్హత గలవారు తమ బయోడాటాను ఈ నెల 18 వరకు మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు 97033 35001 నంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అదృశ్యమైన 85% మందిని కనుగొన్నాం

- తెలంగాణ అదనపు డీజీ స్వాతిలక్రా వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కనిపించకుండాపోయిన ప్రతిఒక్కరి జాడ కనుగొనేందుకు ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి చర్యలు తీసుకుంటున్నామని.. గతేడాది అదృశ్యమైన సుమారు 85 శాతం మంది జాడ కనుగొన్నామని తెలంగాణ అదనపు డీజీ స్వాతిలక్రా తెలిపారు. ఇందులో చిన్నారులు, మహిళలతోపాటు వృద్ధులు కూడా ఉన్నారన్నారు. పరీక్షల్లో ఫెయిల్ కావడం, ప్రేమ వ్యవహారాలు, కుటుంబ తగాదాలు, ఆర్థిక ఇబ్బందులు, వృద్ధాప్యంలో పిల్లలు పట్టించుకోకపోవడం తదితర కారణాల వల్ల అధికశాతం మంది ఇండ్లు వదిలి వెళ్లిపోతున్నారని వివరించారు. ఇలా తప్పిపోయిన ప్రతిఒక్కరి వివరాలను క్రమంతప్పకుండా నమోదు చేసుకుంటున్నామని, ఇతర క్రిమినల్ కేసులతో సమానంగా ప్రాధాన్యమిస్తూ వీటినీ దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల సహకారంతో.. కనిపించకుండాపోయిన వారి జాడను కనుగొంటున్నామని చెప్పారు. ప్రత్యేకంగా ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్‌ను వినియోగిస్తున్నామని తెలిపారు. తప్పిపోయినవారిని స్థానిక పోలీసులు నాలుగునెలల్లో పట్టుకోకపోతే.. అటువంటి కేసులను సీఐడీలోని ప్రత్యేక విభాగం పరిశోధిస్తున్నదని చెప్పారు. చిన్నారుల జాడ తెలుసుకునేందుకు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరిట ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహిస్తున్నామని తెలిపారు.

జాతీయ ఉత్తమ టీచర్ల ఎంపికకు దరఖాస్తులు

15 వరకు గడువు: పాఠశాల విద్యాశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కోసం కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ తెలిపారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు బహుమతులు అందజేస్తారని చెప్పారు. ఆన్‌లైన్లో దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 15వ తేదీతో గడువు ముగియనున్నదని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం www.mhrd.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్‌కావాలని విజయ్ కుమార్ సూచించారు.

గురువారం
13•6•2019
కరీంనగర్

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

జూలై 15న జాబిల్లి యాత్ర

చంద్రయాన్-2 ప్రయోగానికి తేదీ ఖరారుచేసిన ఇస్రో

సెప్టెంబర్ 6 లేదా 7న చంద్రునిపై దిగనున్న ల్యాండర్

9

రూ.2లక్షల కోట్లపైనే!

ఇది 11 ఏండ్లలో బ్యాంకులు మోసపోయిన మొత్తం

ఐసీఐసీఐ, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీల్లోనే కేసులు ఎక్కువ

11

ఎన్నాళ్లో వేచిన ఉదయం

వాయు తుఫాన్ ప్రభావంతో గుజరాత్‌లోని పోర్‌బందర్ తీరంలో ఎగిసిపడుతున్న సముద్ర కెరటాలు

వానలు ఇంకా ఆలస్యం

ఈ నెల 17న తొలకరి.. 16 లేదా 17న రాష్ట్రంలోకి నైరుతి

మరో రెండ్రోజులు వడగాడ్పులు.. హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

పెను తుఫాన్‌గా మారిన 'వాయు'.. నేడు గుజరాత్ తీరం దాటే అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రానికి వరుణదేవుడి కరుణ మరోరోజు ఆలస్యమయ్యేట్టున్నది. నైరుతి రుతుపవనాల విస్తరణకు అరేబియా సముద్రంలో ఏర్పడిన వాయు తుఫాన్ అడ్డంకిగా మారింది. ఫలితంగా రాష్ట్రానికి రుతుపవనాలు ఈ నెల 15 లేదా 16న వస్తాయని తొలుత అంచనావేసినప్పటికీ.. తుఫాన్ కారణంగా మరికొంత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయని వాతావరణ అధికారులు చెప్తున్నారు. అరేబియా సముద్రంలో ఏర్పడిన 'వాయు' పెను తుఫాన్‌గా మారి.. గుజరాత్ తీరం దిశగా కదులుతున్నది. 'వాయు' కొద్దిగా దిశను మార్చుకుని గురువారం మధ్యాహ్నం దక్షిణాన ఉన్న వెరావల్ నుంచి పశ్చిమాన ఉన్న ద్వారక మధ్య ఎక్కడైనా తీరాన్ని దాటవచ్చని భారత వాతావరణ విభాగం పేర్కొన్నది. దీని ప్రభావంతో గాలిలో తేమ తగ్గి నైరుతి రుతుపవనాల కదలిక

అత్యధికంగా మంచిర్యాలలో 44.6° గరిష్ఠ ఉష్ణోగ్రత

మిగతా 5వ పేజీలో

సాకారమవుతున్న అపర భగీరథుడి స్వప్నం

మేడిగడ్డ బరాజ్ (ఫైల్)

- మూడు బరాజ్‌లు, మూడు పంప్‌హౌస్‌లు
- ఆసియాలోనే అతిపెద్ద మోటర్లు
- కిలోమీటర్ల కొద్దీ సొరంగాలు.. కాల్వలు
- 7,152 మెగావాట్ల విద్యుత్ వ్యవస్థ
- దేశంలోనే అసాధారణమైన ఎత్తిపోతల
- అత్యల్పసమయంలో అపూర్వమైన నిర్మాణం
- ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు
- ప్రస్తుత నీటి లభ్యత దృష్ట్యా 6 మోటర్ల వెట్‌రన్
- గోదావరికి ఇన్‌ఫ్లో మొదలుకాగానే రోజుకు రెండు టీఎంసీల ఎత్తిపోత
- పంపింగ్‌కు విద్యుత్ ఏర్పాట్లు సిద్ధం: ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

21న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభం

ముఖ్య అతిథులుగా మహారాష్ట్ర, ఏపీ సీఎంలు

ఫడ్నవీస్, జగన్‌లను స్వయంగా ఆహ్వానించనున్న సీఎం కేసీఆర్

ఒక తపస్సు ఫలించబోతున్నది. అపర భగీరథుడి స్వప్నం సాకారమయ్యే క్షణం రానేవచ్చింది. దశాబ్దాల తరబడి నీటికోసం సాగిన రైతు నిరీక్షణ తీరిపోనున్న సమయం ఆసన్నమైంది. ఇంతకాలం సముద్రంలోకి వృథాగా పోయిన గోదారమ్మ మేడిగడ్డనుంచి వెనుకకు ఉరకలెత్తి వచ్చేందుకు సిద్ధమైంది. తెలంగాణ రైతు ఇంతకాలం పడిన వెతలు ఇక కనిపించవు. తలాపున పారుతున్న గోదారమ్మను మన బీళ్లకు తరలించి.. తెలంగాణను కోటి ఎకరాల మాగాణంచేయాలన్న ఆకాంక్షను.. మన భగీరథుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు కేవలం రెండున్నరేండ్లలో నిజంచేసి చూపించారు. యావత్‌దేశం అబ్బురపడేలా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును సీఎం కేసీఆర్.. తెలంగాణ జాతికి సమర్పణంచేసే ఘట్టం ఆవిష్కారమవుతున్నది. ఈ నెల 21న ఈ మహత్తర ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో పాలుపంచుకోవడానికి ఎగువనున్న మహారాష్ట్ర, దిగువనున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా రావడం దేశ సాగునీటిరంగ చరిత్రలో అపూర్వమైన చారిత్రక సన్నివేశంగా నిలిచిపోనున్నది.

హైదరాబాద్ నమస్తే తెలంగాణ:

ఈ క్షణం కోసం ఎన్నేండ్ల ఎదురుచూపులు! తలాపున గోదారమ్మ పారుతున్నా.. పక్కనే ఉన్న పొలాలకు తడి అందని పరిస్థితి. బోర్లు వేస్తుంటే.. నీళ్లు పడకున్నా.. కనీసం పదును కనిపించినా చాలనుకున్న సందర్భాలు ఎన్నో! బోర్లల్లో ఒక్కచుక్క కూడా అందక.. వానలకోసం మబ్బులవైపు చూస్తూనే ఉసురు పోయిన ఘటనలు ఎన్నో! బోర్లు.. కరంటు.. తెలంగాణ అన్నదాతల పాలిటి యమపాశాలయినాయి. నియతిలేని పాలకులకు ఎన్నడూ కండ్లల్లో తడారిపోయిన తెలంగాణ రైతు కనిపించలేదు. ఉద్యమనాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో మలి దశ ఉద్యమం మొదలైన తర్వాత తప్పదన్నట్టుగా 'ఉమ్మడి' పాలకులు ఉత్తుత్తిగా వేసిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు శంకుస్థాపన రాయి ఎక్కడున్నదో కూడా తెలియదు. కానీ.. తెలంగాణ సాధించిన ఉద్యమనేతే.. రాష్ట్ర పాలకుడై గోదారమ్మను తెలంగాణ పొలాలకు తరలించేందుకు చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు.. అతి తక్కువ సమయంలో నిర్మాణం పూర్తిచేసుకొని.. ప్రారంభానికి సిద్ధమైంది. తెలంగాణ వస్తే ఏమైతది అన్నవాళ్లకు కాళేశ్వరం ప్రాజెక్టు నిటారుగ నిలబడి నిన దిస్తున్నది.. ఇదిగో తెలంగాణమని!

చారిత్రాత్మక సన్నివేశం

రాష్ట్రంలోని దాదాపు 13 జిల్లాల్లో సుమారు 40 లక్షల ఎకరాల ఆయకట్టుకు జీవం పోసేందుకు నిర్మించిన

మిగతా 5వ పేజీలో

నమస్తే తెలంగాణ
ధర్మగంట
మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు
ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.
Whatsapp No.
9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.
స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.
/NTDAILYONLINE

ఎకరం భూమిని కొత్త పాస్‌బుక్‌లో ఎక్కిస్తలేరు

- నల్లగొండ జిల్లా మైలారంవాసి సాదిక్ అలీ ఆవేదన

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తాను కొనుగోలుచేసిన ఎకరం భూమిని కొత్త పాస్‌పుస్తకంలో ఎక్కించడం లేదని నల్లగొండ జిల్లా కనగల్ మండలం లింగోటం పరిధిలోని మైలారంవాసి సాదిక్ అలీ ఆవేదన వ్యక్తంచేశారు. తనకు న్యాయంచేయాలని గ్రామ రెవెన్యూ అధికారి, ఆర్ఐ, తాసిల్దార్, జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌కు మొర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేనదని కన్నీళ్ల పర్యంతమయ్యారు. న్యాయం కోసం 'ధర్మగంట'ను ఆశ్రయించారు. మైలారం శివారులో ఖాతా నంబర్ 466, సర్వే నంబర్ 106లో 20 గుంటలు, సర్వే నంబర్ 107ఏలో ఎకరం భూమి ఉండగా, ఇందులో 20 గుంటల భూమికి కొత్త పాస్‌పుస్తకం ఇచ్చి మిగిలిన ఎకరం భూమి ఎక్కించలేదని వాపోయారు. దీనికి సంబంధించిన కాస్తు, కబ్జా కూడా తనకు అనుకూలంగా ఉన్నదని తెలిపారు. ఈ ఎకరం భూమికి సంబంధించి కొత్త పాస్‌పుస్తకాన్ని తనకు ఆ జాగను అమ్మిన కందికట్టె సైదమ్మకు ఇచ్చారని వాపోయారు. ఈ భూమి తన పేరిట ఏప్రిల్ 19, 2014న రిజిస్ట్రేషన్ అయ్యిందని అన్నారు. గతంలో తన పేరుమీద పట్టాదారు పాస్‌పుస్తకం కూడా ఇచ్చారని చెప్పారు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో కొత్త పాస్‌పుస్తకం ఈ భూమికి సంబంధించి ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ భూమిని కొన్న తర్వాత బ్యాంకు లోను కూడా తీసుకున్నానని తెలిపారు. భూమికి సంబంధించి పత్రాలన్నీ సక్రమంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని తెలిపారు. ఇప్పటికైన అధికారులు తనకు న్యాయంచేయాలని కోరారు.

పదేండ్లైనా పట్టా ఇస్తలేరు..

నా పేరు గోవిందమ్మ. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి గ్రామం మాది. అయిజ మండలం మేడికుండ గ్రామంలో సర్వే నంబర్ 243లోని 13 ఎకరాల 18 గంటలు, 244లోని 15 ఎకరాల 20 గుంటల భూమిలో నాలుగోవంతు భూమిని పుట్టింటివారు పసుపుకుంకుమ కింద ఇచ్చారు. ఆ భూమికి వీఆర్వో పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా ఇబ్బందికి గురిచేస్తున్నారు. పదేండ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయింది. మా అమ్మ తిమ్మక్క పేరుమీదనే ఈసీ కూడా ఉన్నది. నాకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పించండి.

- గోవిందమ్మ, వడ్డేపల్లి, జోగుళాంబ గద్వాల జిల్లా

తప్పును గుర్తించినా సరిచేయరు

- ఒకరి భూమిని మరొకరికి రాసిచ్చిన అధికారులు
- యాదాద్రి భువనగిరి జిల్లా రైతు బైరెడ్డి వెంకటరెడ్డి ఆవేదన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం అంతాఇంతా కాదని తేలిపోయింది. ఏ భూమి ఎవరిదనేది క్షుణ్ణంగా పరిశీలించి రికార్డుల్లో నమోదుచేయాల్సిన అధికారులు ఇందుకు విరుద్ధంగా ఏమాత్రం పాత రికార్డులు పరిశీలించకుండా గుడ్డిగా ఒకరి భూమిని మరొకరికి రాసిచ్చారు. తన భూమిని ఇతరులకు ఎలా రాసిచ్చారని ప్రశ్నిస్తే తప్పు జరిగిందంటారు. ఆ భూమి తమది కాదని పేర్లు వచ్చిన రైతులుచెప్పినా రికార్డులను సరిచేయరు. ఎన్నికల కోడ్ పేరుతో కాలయాపనచేస్తున్నారని యాదాద్రి భువనగిరి జిల్లా రైతు బైరెడ్డి వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని అడ్డగూడూరుకు చెందిన బైరెడ్డి వెంకటరెడ్డికి సర్వే నంబర్ 921లో 1.24 ఎకరాల భూమి ఉన్నది. ఈ మేరకు పాత పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్నది. ఇదే గ్రామంలో బైరెడ్డి వెంకటరెడ్డి పేరుతో మరోవ్యక్తి ఉన్నారు.. ఆయన మరణించడంతో జీవించి ఉన్న వెంకటరెడ్డి భూమిని చనిపోయిన బైరెడ్డి కూతురు పేరిట విరాసత్‌చేశారు. విరాసత్‌చేసే సమయంలో రికార్డులను ఎంతమాత్రం పరిశీలించలేదు. పట్టాదారు పాస్‌పుస్తకం నంబర్‌ను చూడలేదు. రికార్డుల ప్రక్షాళనలో పరిశీలిస్తే బతికి ఉన్న బైరెడ్డి వెంకటరెడ్డి భూమిని చనిపోయిన బైరెడ్డి వెంకటరెడ్డి కూతురు పేరున విరాసత్‌చేసిన విషయం తెలిసింది. ఈ విషయం తెలిసిన వెంటనే బాధిత రైతు తన భూమిని ఇతరులకు ఎలా రాశారని ప్రశ్నించారు. ఈ మేరకు సరిచేయాలని దరఖాస్తులు ఇచ్చారు. రికార్డులు పరిశీలించి తప్పు జరిగిందని గుర్తించారు. అలాగే తనకు విరాసత్‌చేసిన భూమి తన తండ్రిది కాదని.. చనిపోయిన బైరెడ్డి వెంకటరెడ్డి కూతురు కూడా చెప్పారు. తప్పు జరిగినట్టు నిర్ధారణ చేసుకొన్న అధికారులు రికార్డులు సరిచేయకుండా రైతును ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వరుసగా ఎన్నికలు వచ్చాయని, ఎన్నికలు అయిపోయాక చేస్తామని చెప్పారు. అధికారులు చేసిన పొరపాటు కారణంగా తనకు రైతుబంధు రాలేదని బైరెడ్డి వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఎలాగైనా రికార్డులు సరిచేసి తన భూమికి పాస్‌పుస్తకం ఇప్పించాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నారు.

రెవెన్యూశాఖలో మార్పులు అవసరం

రెవెన్యూశాఖలో మార్పులు అవసరం. రెవెన్యూశాఖ ప్రక్షాళనకు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనది. రైతుల కష్టాన్ని సొమ్ముచేసుకుంటూ జలగల్లా పీడిస్తున్న అధికారుల్లో పూర్తిగా మార్పు తీసుకొచ్చేందుకు ఈ నిర్ణయం ఉపయుక్తంగా ఉంటుంది. దీంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

- బన్నె శ్రీశైలం, మేడిపల్లి, యాచారం మండలం, రంగారెడ్డి జిల్లా

రైతుల పాలిట దేవుడు సీఎం కేసీఆర్

సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం రైతులకు మేలుచేస్తుంది. కేసీఆర్ రైతుల పాలిట దేవుడు. ఏండ్ల తరబడి కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినప్పటికీ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించేవారు. సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో అధికారుల్లో మార్పువస్తున్నది.

- నిమ్మల ప్రసాద్‌గౌడ్, నెర్రపల్లి, ఇబ్రహీంపట్నం మండలం, రంగారెడ్డి జిల్లా

పాస్‌పుస్తకం ఇప్పించండి

వ్యవసాయశాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసి రిటైరయ్యాను. ప్రస్తుతం నా వయస్సు 69 ఏండ్లు. నాకు జనగామ జిల్లా, లింగాల ఘనపూర్ మండలం, కల్లెంగ్రామంలోని 382/a/1/1లో.. 2.32 ఎకరాలు, 382/d/1లో.. 2 ఎకరాల పొలం ఉన్నది. ప్రభుత్వం రైతులకు కొత్త పాస్‌పుస్తకాలు పంపిణీచేస్తున్నది. కానీ, నాకు ఇంతవరకూ కొత్త పాస్‌పుస్తకం రాలేదు. వీఆర్వోను ఎన్నిసార్లు అడిగినా సరైన సమాధానం ఇవ్వడంలేదు. రైతుబంధు కింద మొదటి విడుతలో రూ.19,200 అందింది. రెండోవిడుత సాయం ఇంకా రావాల్సి ఉన్నది. ఇప్పటికే తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి విసిగిపోయాను. ఓపిక నశించింది. ధర్మగంట ద్వారానైనా నా ఈ సమస్య పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాను.

- గంగుల సింహారెడ్డి, మలక్‌పేట్, హైదరాబాద్

సగంమందికి పాస్‌పుస్తకాల్లేవ్

పైసలు తీసుకున్నా.. వీఆర్వో పనిచేయడం లేదు
రైతుబంధు పథకానికి దూరమయ్యాం
జయశంకర్ భూపాలపల్లి జిల్లా చింతలపల్లి రైతుల ఆవేదన

మహాముత్తారం: వీఆర్వో నిర్లక్ష్యంతో ఆ గ్రామంలో సగంమందికి పైగా రైతులకు పాస్‌పుస్తకాలు అందలేదు. దీంతో వారు రైతుబంధు సొమ్ము అందక ప్రైవేట్‌గా అప్పులు తెచ్చుకొని సాగుచేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. కొత్త పాస్‌పుస్తకం కోసం వేలకువేలు దండుకున్న వీఆర్వో పనులు మాత్రం చేయడం లేదని రైతులు వాపోతున్నారు. పాస్‌పుస్తకం కోసం నిలదీస్తే దిక్కున్నచోట చెప్పుకోండి అంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అటు పాస్‌పుస్తకం రాక.. ఇటు రైతుబంధు సొమ్ము అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం గండికామారం పంచాయతీ పరిధిలోని చింతలపల్లి రైతులు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

సగం భూమికే పాస్‌పుస్తకం

సర్వేనంబర్ 27/112లో ఎకరం మూడు గుంటలు, 12/2లో ఎకరం ఎనిమిది గుంటల భూమి, 27లో ఎకరం, 15/6లో ఎకరం భూమి ఉంది. భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమంలో ఈ మొత్తం 4.11 ఎకరాలకు 1 బీ ఇచ్చారు. అయితే 2.3 ఎకరాలకే పాస్‌పుస్తకం ఇచ్చారు. మిగతా 2.8 ఎకరాల కోసం ముప్పుతిప్పలు పెడుతున్నారు. పైసలిస్తే పట్టా చేస్తానని వీఆర్వో అంటే ఒకసారి రూ.3 వేలు, మరోసారి రూ.1500, మూడు కిలోల కోడిపుంజు ఇచ్చిన. పట్టా గురించి మాట్లాడితే నీకు పట్టా ఇవ్వాలని ఏమైనా రూల్ ఉన్నదా అంటూ దబాయ్తున్నడు.

- ముకులోత్ వినోద, చింతలపల్లి

లంచమిచ్చినా పని కావడం లేదు

సర్వే నంబర్ 27లో 1.1 ఎకరాల భూమి ఉన్నది. నా పేరిట కొత్త పాస్‌పుస్తకం రాలేదు. పుస్తకం కోసం వీఆర్వో రూ.2 వేలు తీసుకుపోయిండు. బుక్ గురించి అడిగితే మాత్రం రేపు రా.. మాపు రా అని అంటున్నడు. తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి కాళ్లు కాయలు కాస్తున్నాయి తప్ప.. కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం మాత్రం ఇస్తలేరు.

- జాటోత్ విజయ

పట్టించుకోవడం లేదు

నాకు సర్వే నంబర్ 27లో 39 గుంటల భూమి ఉన్నది. దానికి పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వలేదు. పలుమార్లు వీఆర్వోను అడిగినా పట్టించుకోవడం లేదు. దీంతో రైతుబంధు పథకానికి దూరమై, అప్పుల పాలయ్యాను. జిల్లాస్థాయి అధికారులు పట్టించుకొని మా గ్రామంలో భూమిఉన్న ప్రతి ఒక్కరికీ కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వాలని వేడుకుంటున్నా.

- ఉప్పోజు రమణమ్మ

వీఆర్వో రావడం లేదు

సర్వేనంబర్ 132లో 1.20 ఎకరాలు ఉన్నది. దానికి ఇప్పటికీ కొత్త పాస్‌పుస్తకం రాలేదు. కొత్త పుస్తకం కోసం వీఆర్వో రెండువేల రూపాయలు తీసుకున్నారు. పుస్తకం గురించి అడిగితే పట్టించుకోవడం లేదు. అడిగి అడిగి విసుకు చెంది అడగడమే మానేశా. గ్రామంలో చాలా మంది వద్ద వీఆర్వో తీసుకొని ఇప్పుడు ఊరిలో అడుగుపెడుతలేడు.

- ఉల్లేంగుల రాజ్యలక్ష్మి

భూమి లేనివారికి పాస్‌పుస్తకాలు

మా ఊరిలో గుంట భూమిలేని వారికి వీఆర్వో పదుల ఎకరాలకు పాస్ పుస్తకాలు ఇచ్చిండు. భూమి ఉండి పంట తీస్తున్నా రైతులకు పుస్తకాలు ఇవ్వడం మరిచిపోయిండు. సర్వే నంబర్ 27లో 39 గుంటల భూమి ఉన్నా ఇప్పటికీ కొత్త పాస్‌పుస్తకం రాలేదు. గ్రామ వీఆర్వోకు లంచం ఇచ్చినా.. పుస్తకం ఇవ్వలేదు. దీంతో తెలంగాణ ప్రభుత్వ తరుపున వచ్చే రైతుబంధు సాయానికి దూరమయ్యా.

- అజ్జీర రుక్మా

మొహమాటంలేని వీఆర్వో

డబ్బిస్తేనే పనవుతుందని వెల్లడి!
ములుగు జిల్లా కాసీందేవిపేటలో వారసత్వ భూమికి పట్టాఇవ్వని వైనం
పనిఒత్తిడంటూ కుంటిసాకులతో కాలయాపన

ములుగు టౌన్: ములుగు జిల్లా కాసిందేవిపేట శివారులో జక్కరాజు నారాయణరావుకు 383 సర్వే నంబర్‌లో 8 ఎకరాల 31 గుంటల భూమి ఉండేది. రైతు సమన్వయ సభ్యుడైన నారాయణరావుకు, ఆయన సోదరుడు సంపత్‌రావుకు తాత, తండ్రి ద్వారా వారసత్వంగా ఎనిమిది ఎకరాల చొప్పున వచ్చింది. సోదరుడైన సంపత్‌రావుకు ఇదే సర్వే నంబర్ భూమిలో పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వడంతో, రైతుబంధు ఆర్థిక సహాయం చెక్కును కూడా తీసుకున్నారు. తనకు సైతం పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వాలని పలుమార్లు రెవెన్యూ అధికారులను కలిసినా పనికావడం లేదని బాధితుడు నారాయణరావు వాపోతున్నారు. గతంలో 383 సర్వే నంబర్‌లోని తన 8 ఎకరాల 31 గుంటల భూమిపై కోఆపరేటివ్ బ్యాంకులో రుణాలు సైతం తీసుకున్నారు. నారాయణరావు పాత పట్టాదారు పాస్‌పుస్తకం, పహాణీ నకల్‌ను వీఆర్వోకు చూపించి పట్టాచేయాలని కోరారు. ఈ క్రమంలో సదరు వీఆర్వో డబ్బిస్తేనే పనవుతుందని మొహమాటం లేకుండా చెబుతూ, డబ్బివ్వకపోవడంతో పనిచేయకుండా తనను తిప్పించుకుంటున్నారని బాధితుడు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి వీఆర్వోపై చర్యలు తీసుకోవడంతో పాటు తనకు పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వాలని ఆయన కోరారు.

బాధితుడు జక్కరాజు నారాయణరావు

డబ్బు డిమాండ్ చేయలేదు

జక్కరాజు నారాయణరావుకు 383 సర్వే నంబర్‌లో భూమి ఉన్నది వాస్తవమే. గతంలో ఉన్న అధికారుల తప్పిదంతో 383 సర్వే నంబర్‌లోని అతని భూమి ఇతరుల పేరుపై నమోదయింది. వారందరికీ త్వరలో నోటీసులు అందించి ఆ భూమిని నారాయణరావు పేరుమీద నమోదుచేసి పాస్‌పుస్తకాలను అందిస్తాం. నేను డబ్బు అడిగిన మాట అవాస్తవం. పని ఒత్తిడితోనే కొంత ఆలస్యం జరిగింది.

- నాగరాజు, వీఆర్వో, కాసిందేవిపేట

పైసలిస్తే విరాసత్

పెద్ద కొడుకును పక్కనపెట్టి చిన్నోడికి వారసత్వ భూమి
తల్లి బతికుండగానే పేరుమార్పిడి
రంగారెడ్డి జిల్లా తాళ్లపల్లిగూడలో రెవెన్యూ లీలలు

మంచాల: తల్లి బతికుండగానే ఆమె పేరిట ఉన్న భూమి చిన్న కొడుకు పేరు మీదకు మారిపోయింది. కాసులకు కక్కుర్తిపడ్డ రెవెన్యూ అధికారులు.. కనీసం విచారణ జరుపకుండా విరాసత్ ఇచ్చేశారు. పట్టా పాస్‌పుస్తకాలనూ అందజేశారు. అదేమని అధికారులను పెద్ద కొడుకు ప్రశ్నిస్తే.. విచారణ చేపడుతామని, దొంగ పత్రాలు సృష్టించినట్టు తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పున్నారు. ఇదీ రంగారెడ్డి జిల్లా మంచాల మండలం తాళ్లపల్లిగూడలోని రెవెన్యూ గాథ. తాళ్లపల్లిగూడకు చెందిన వీరమల్ల యాదమ్మకు సర్వేనంబర్ 84/96లో నాలుగెకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఆమెకు వీరమల్ల నారాయణగౌడ్, వీరమల్ల శ్రీశైలంగౌడ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. నారాయణగౌడ్ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇదే అదనుగా భావించిన చిన్న కొడుకు శ్రీశైలంగౌడ్ రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయ్యాడు. తల్లి బతికుండగానే.. వారసత్వంగా ఆమె పేరుపై వస్తున్న ప్రభుత్వ భూమిని 2010-11లో భూమార్పిడి చేయించుకున్నాడు. పట్టా పాస్‌పుస్తకాలను కూడా పొందాడు. ప్రభుత్వం చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనలో ఈ విషయాన్ని గుర్తించిన పెద్ద కొడుకు నారాయణగౌడ్.. తల్లి బతికుండగానే ఆమె పేరున ఉన్న భూమిని తమ్ముడు శ్రీశైలం పేరుపైకి ఎలా మార్పిడి చేశారని రెవెన్యూ అధికారులను నిలదీశాడు. అయినా పట్టించుకోకుండా రెవెన్యూ రికార్డుల ప్రకారం శ్రీశైలంగౌడ్‌కు కొత్త పట్టా పాస్‌పుస్తకాలను అందజేశారు. భూ మార్పిడి చేయాలంటే ప్రభుత్వ భూమి అయితే విరాసత్ చేసుకోవాలి. పట్టాభూమి అయితే గిఫ్ట్‌డీడ్ చేయాల్సి ఉంటుంది. వారసత్వం ప్రకారం తల్లి పేరిట ఉన్న భూమిని ఇద్దరు కొడుకులకు సమానంగా పంచాలి. ఇందుకు క్షేత్రస్థాయిలో విచారణ జరుపాలి. కానీ, అవేమీ చేయకుండా ఒక్కడికే పట్టా పాస్‌పుస్తకాలు ఇచ్చేశారు. దొంగదారిన రికార్డుల్లో పేర్లు మార్చి తమ్ముడి పేరున పాస్‌పుస్తకాలు ఇవ్వడం సరికాదని, తనకు న్యాయం చేయాలని నారాయణగౌడ్ విజ్ఞప్తి చేస్తున్నాడు. విషయం ఆర్డీవో పరిధిలో ఉన్నదని, ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి పనిచేస్తామని అధికారులు చెప్తున్నారని పేర్కొన్నాడు. ఆర్డీవో కార్యాలయం చుట్టూ నాలుగునెలలుగా తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు.

తల్లిపేరిట ఉన్న భూమిని తమ్ముడికి విరాసత్ చేశారంటున్న బాధితుడు నారాయణగౌడ్

పత్రాలు తీసుకురావాలని ఆదేశిస్తాం

తాళ్లపల్లిగూడ సర్వేనంబర్ 84/96లో నాలుగెకరాల ప్రభుత్వ భూమి రికార్డుల ప్రకారం శ్రీశైలంగౌడ్ పేరున వస్తున్నది. తల్లి నుంచి ఈ భూమిని ఎలా పొందాడు? భూమికి సంబంధించిన ప్రొసీడింగ్, సంబంధిత పత్రాలు మాకు చూపించాలని శ్రీశైలంగౌడ్‌ను ఎన్నిసార్లు ఫోన్‌లో సంప్రదించినా సమాధానం లేదు. ఆ పత్రాలు తీసుకొని వెంటనే కార్యాలయానికి రావాలని ఆదేశాలు జారీచేస్తాం. దొంగతనంగా పాస్‌బుక్‌లు సృష్టించినట్టు తేలితే ఆ భూమిని స్వాధీనం చేసుకొంటాం.

- ప్రశాంతి, వీఆర్వో తాళ్ల పల్లిగూడ, మంచాల మండలం, రంగారెడ్డి జిల్లా

మా మాట!

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

రెవెన్యూ ఉద్యోగుల ఆగడాల వల్ల ఎంతోమంది భూసమస్యలతో సతమతమవుతున్న తరుణంలో 'నమస్తే తెలంగాణ' చేపట్టిన 'ధర్మగంట' రైతులకు ధైర్యాన్ని తెచ్చిపెట్టింది. రెవెన్యూశాఖలో అక్రమాలను వెలికితీస్తూ కథనాలు వస్తుండటంతో రైతుల భూసమస్యలు త్వరగా పరిష్కారమవుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో రైతుల భూసమస్యలు దాదాపు పరిష్కారం కావడం హర్షించదగ్గ విషయం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.

- ఇస్లావత్ సీత్యానాయక్, సీతల్‌తండా, తిరుమలగిరి (సాగర్) మండలం, నల్లగొండ జిల్లా

ధర్మగంటతోనే సమస్యలు పరిష్కారం

నమస్తే తెలంగాణ చేపట్టిన ధర్మగంటతో రైతు సమస్యలు పరిష్కారమవుతున్నాయి. గ్రామంలో రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహిస్తే సమస్యలు తేలిక అవుతాయి. రెండేండ్ల నుంచి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడులు రాక, కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు అందక రైతులు ఎవరిని సంప్రదించాలో అర్థంకాని పరిస్థితిలో ప్రభుత్వం చొరవతీసుకుంటున్నది. ధర్మగంట గట్టి కృషి చేస్తున్నది.

- నెహ్రూనాయక్, ఎలమలమంద సర్పంచ్, చందంపేట మండలం, నల్లగొండ జిల్లా

సీఎం కేసీఆర్ చొరవతో మార్పు

సీఎం కేసీఆర్ చొరవతో రెవెన్యూ అధికారుల తీరులో మార్పువచ్చింది. గతంలో పనులకోసం తాసిల్దార్ కార్యాలయానికిపోతే ఎన్నిరోజులైనా పనులు కాకపోయేవి. ఇప్పుడు అటువంటి పరిస్థితులు లేవు. కార్యాలయానికిపోగానే పనులను వెంటనే చేస్తున్నారు. దీనికంతటికీ కారణం ముఖ్యమంత్రి కేసీఆర్ రెవెన్యూశాఖపై అనుసరిస్తున్న విధానాలే. రైతులకోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిన కేసీఆర్, భూరికార్డుల్లోని సమస్యలు లేకుండా చేస్తున్నారు. ఇది నిజంగా మనందరి అదృష్టం.

- గుండెబోయిన దేవలింగం, కల్మల్‌చెర్వు, గరిడేపల్లి మండలం, సూర్యాపేట జిల్లా

భూసమస్యల పరిష్కారంతో రైతులకు మేలు

రెవెన్యూశాఖలో జరిగిన అవకతవకలను వివరిస్తూ ఆధారాలతో సహా నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురిస్తుండటంతో, భూ రికార్డుల నిర్వహణలో అధికారులు చేసిన తప్పులతో నష్టపోయిన బాధిత రైతులు ధర్మగంటను ఆశ్రయిస్తున్నారు. ధర్మగంటతో రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. రైతుల సమస్యలకు త్వరగా పరిష్కారం లభిస్తున్నది. భూసమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న నమస్తే తెలంగాణకు ధన్యవాదాలు.

- గాదె వెంకట్‌రెడ్డి, గండ్రవారిగూడెం, మాడ్గులపల్లి మండలం, నల్లగొండ జిల్లా

నూతన చట్టాలతోనే అవినీతి అంతం

రెవెన్యూశాఖలో అవినీతిని తగ్గించేందుకు సీఎం కేసీఆర్ నూతన రెవెన్యూ చట్టాలను తీసుకొస్తాననడం అభినందనీయం. భూరికార్డుల ప్రక్షాళనచేసి అనేక సమస్యలను పరిష్కరించారు. ఎన్నో ఏండ్లుగా ఉన్న రెవెన్యూ రికార్డుల్లో పరిష్కారం కాని సమస్యలు సీఎం కేసీఆర్, నమస్తే తెలంగాణ చేపట్టిన ధర్మగంటతో వెంటనే పరిష్కారమవుతున్నాయి. ఇలాంటి కార్యక్రమం చేపట్టిన 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు. సీఎం కేసీఆర్‌కు రైతులు రుణపడ్డి ఉంటారు.

- కాటసాని వెంకట్‌రెడ్డి, కేటీఅన్నారం, సూర్యాపేట మండలం, జిల్లా

యుద్ధ ప్రాతిపదికన యాదాద్రి పనులు

- మూడునెలల్లోగా పూర్తిచేసేలా ప్రణాళిక
- యాదాద్రిపై ఉన్నతాధికారుల సమీక్షలో సీఎస్ జోషి

బుధవారం సచివాలయంలో యాదాద్రి ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యాదాద్రి పట్టణాన్ని స్మార్ట్ విలేజిగా తీర్చిదిద్దేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి అధికారులను ఆదేశించారు. మూడు నెలల్లోగా పనులు పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. యాదాద్రి ఆలయ అభివృద్ధి మండలి సమీక్ష సమావేశం బుధవారం సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ జోషి మాట్లాడుతూ.. యాదాద్రి పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కేబుల్, సెంట్రల్ లైటింగ్, వరదనీటి కాలువలు, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పార్కులు.. తదితర పనులన్నీ త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. వేద పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం 16 ఎకరాల భూమి కేటాయించిందని, అక్కడ పాఠశాల నిర్మాణానికి సంబంధించి నివేదిక సమర్పించాలని సూచించారు. బస్వాపూర్ ట్యాంక్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాయగిరి, గండిచెరువు, పెద్దచెరువు, మల్లాపూర్ చెరువు, సైదాపూర్ చెరువు పనుల్లో వృద్ధిని అడిగి తెలుసుకొన్నారు. శిల్పకళా సంస్థలో చదువుతున్న స్థపతుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే టెంపుల్ ఆర్కిటెక్చర్ కళాశాలను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రాజేశ్వర్‌తివారీ, నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్, మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, యాదాద్రి ఆలయ అభివృద్ధి మండలి వైస్‌చైర్మన్ కిషన్‌రావు, రోడ్లు, భవనాలశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి శివశంకర్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, యాదాద్రి ఆలయ ఎగ్జిక్యూటీవ్ అధికారి గీత తదితరులు పాల్గొన్నారు.

బర్కత్‌పురలో కొత్తగా నిర్మించిన యాదాద్రి భవనం

బర్కత్‌పురలో యాదాద్రి భవనం

- రేపు ప్రారంభించనున్న సీఎం కేసీఆర్

అంబర్‌పేట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి సేవలు హైదరాబాద్ నగర ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. బర్కత్‌పురలో చేపట్టిన యాదాద్రి భవన నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే యాదాద్రి లోగో, యాప్‌ను కూడా ఆవిష్కరించనున్నట్టు ఆలయ ఈవో గీత తెలిపారు. బర్కత్‌పురలోని పాత భవనం శిథిలావస్థకు చేరడంతో దానిస్థానంలో రూ.8.50 కోట్లతో కొత్త భవనాన్ని నిర్మించారు. 1600 చదరపు గజాల విస్తీర్ణంలో సెల్లార్, జీ ప్లస్ టూ నిర్మించారు. మొదటి అంతస్తులో కల్యాణ మండపం, రెండో అంతస్తులో 500 మంది సరిపడే భోజనశాలను ఏర్పాటుచేశారు. యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆర్జిత సేవలు, కల్యాణం, గదుల బుకింగ్ వంటివి ఇక్కడినుంచే బుకింగ్ చేసుకొనే సదుపాయం కల్పిస్తున్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

మూడోపేజీ తరువాయి...

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభానికి సిద్ధమైంది. జూన్ 21న ముఖ్యమంత్రి కల్వకుట్ల చంద్రశేఖర్‌రావు ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. కన్నెపల్లి పంపుహౌస్‌లో నీటి ఎత్తిపోతలకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణకు ఎగువన ఉన్న మహారాష్ట్ర, దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ మహత్తర కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రానుండటం అద్భుతమైన చారిత్రక ఘట్టంగా చెప్పుకోవచ్చు. గోదావరి బేసిన్‌లోని కీలక పొరుగు రాష్ట్రాలైన ఏపీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులను సీఎం కేసీఆర్ ఆహ్వానిస్తున్నారు. బుధవారం మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో ముఖ్యమంత్రి కేసీఆర్ ఫోన్‌లో మాట్లాడి.. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభానికి రావాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. దీంతో త్వరలోనే ముంబై వెళ్లి ఫడ్నవీస్‌ను స్వయంగా ఆహ్వానించాలని, అదేవిధంగా విజయవాడ వెళ్లి ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఆహ్వానించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. రాజకీయాలకు అతీతంగా ఒక నదీ బేసిన్‌లోని ఎగువ, దిగువ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒక ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి రావడమనేది బహుశా దేశచరిత్రలో ఇదే తొలిసారి అని సాగునీటిరంగ నిపుణులు అంటున్నారు.

ప్రారంభోత్సవానికి భారీ ఏర్పాట్లు

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ప్రభుత్వం భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిస్థాయిలో రీడిజైన్ చేసి, రెండున్నరేండ్ల రికార్డు సమయంలోనే ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదలచేస్తున్న దరిమిలా కార్యక్రమాన్ని పండుగలా జరిపేందుకు కసరత్తు మొదలైంది. ఈ నెల 21న అధికారికంగా కన్నెపల్లి పంపుహౌస్‌లోని మోటర్ల వెట్‌రన్ ప్రారంభం కానున్నది. ప్రస్తుతం ఎగువ నుంచి ఇన్‌ఫ్లోలు లేకపోవడంతో ఒకేసారి మోటర్లను నడిపేందుకు ఆస్కారం లేకుండాపోయింది. గోదావరికి ఇన్‌ఫ్లోలు మొదలైన తర్వాత జూలైలో అన్ని మోటర్లు నడుస్తాయి. ప్రస్తుతం కన్నెపల్లి పంపుహౌస్ వద్ద గోదావరిలోకి 500 క్యూసెక్కులలోపు మాత్రమే వరద వస్తున్నట్లుగా ఇంజినీర్లు తెలిపారు. ఈ క్రమంలో రోజుకు రెండు మోటర్లను అరగంట చొప్పున నడిపేందుకు సాంకేతికంగా వీలుపడుతుందని చెప్తున్నారు. ఈ నెల 21న రెండు మోటర్లకు వెట్‌రన్ నిర్వహిస్తారని, ఒక్క మోటర్‌ను అరగంట పరీక్షించే క్రమంలో 0.004 టీఎంసీలు అంటే 10.80 కోట్ల లీటర్ల గోదావరిజలాల్ని ఎత్తిపోయవచ్చని ఇంజినీర్లు తెలిపారు.

జూలైలో రోజుకు రెండు టీఎంసీలు

గోదావరికి పూర్తిస్థాయి వరద మొదలైన తర్వాత జూలైలో రోజుకు రెండు టీఎంసీల చొప్పున గోదావరిజలాల్ని ఎత్తిపోసేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఈలోగా ప్రాణహిత నుంచి వరద కూడా పెద్దఎత్తున మొదలయ్యే అవకాశమున్నది. కన్నెపల్లి పంపుహౌస్‌లో 11 మోటర్లు కూడా సిద్ధంకానున్నాయి. ఈ నేపథ్యంలో కన్నెపల్లి నుంచి రోజుకు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసి.. ఆపై అన్నారం, సుందిల్ల పంపుహౌస్‌ల్లోని మోటర్ల ద్వారా కూడా జలాల ఎత్తిపోత మొదలుపెట్టేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. సుందిల్ల నుంచి ఎల్లంపల్లి జలాశయంలోకి నీటిని ఎత్తిపోసి.. ఆపై నందిమేడారం, కీలకమైన రామడుగు పంపుహౌస్‌లోని 139 మెగావాట్ల సామర్థ్యమున్న బాహుబలి మోటరు ద్వారా జలాల తరలింపును చేపడ్తారు. అక్కడినుంచి గోదావరి జలాల్ని ఒక టీఎంసీని మిడ్‌మానేరు.. మరో టీఎంసీని పునర్జీవ పథకం ద్వారా శ్రీరాంసాగర్ జలాశయంలోకి తరలించాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే నీటిపారుదలశాఖకు దిశానిర్దేశంచేశారు.

2016 మే 2న మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, ఇంద్రకరణ్‌రెడ్డి, అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, అప్పటి స్పీకర్ మధుసూదనాచారి తదితరులు ఉన్నారు. (ఫైల్)

గోదావరి తీరాన ఎత్తిపోత..

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన నందిమేడారం పంపుహౌస్‌లో ఇప్పటికే పలు మోటర్ల వెట్‌రన్‌ను అధికారులు విజయవంతంగా పూర్తిచేశారు. 124.4 మెగావాట్ల సామర్థ్యమున్న మూడు మోటర్ల ద్వారా నీరు విడుదలచేసి పరీక్షించారు. ఇదే క్రమంలో తాజాగా గోదావరితీరాన.. కాళేశ్వరం ప్రాజెక్టుకు ముఖద్వారమైన మేడిగడ్డ బరాజ్ ఫోర్‌షోర్ నుంచి అధికారికంగా నీటివిడుదల ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. 16.17 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో నిర్మించిన మేడిగడ్డ బరాజ్ ఫోర్‌షోర్ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు కన్నెపల్లి పంపుహౌస్‌ను నిర్మించారు. ఇందులో పదకొండు మోటర్ల ద్వారా రోజుకు రెండు టీఎంసీల గోదావరిజలాల్ని ఎత్తిపోయనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు తొమ్మిది మోటర్లు సిద్ధమవగా.. మరో రెండింటి పనులు పురోగతిలో ఉన్నాయి. నెలాఖరుకు ఇవికూడా పూర్తికానున్నట్లు అధికారులు తెలిపారు. గోదావరికి ఇంకా ఇన్‌ఫ్లోలు మొదలు కాకపోవడంతో ప్రస్తుతం కన్నెపల్లి వద్ద నీటి లభ్యత తక్కువగా ఉన్నది. దీంతో 21న జరగనున్న ప్రారంభోత్సవంలో భాగంగా ఆరు మోటర్ల నుంచి నీటిని ఎత్తిపోస్తారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కన్నెపల్లిలోని పంపుహౌస్ (ఫైల్)

విద్యుత్ వ్యవస్థ సిద్ధం: ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు

హైదరాబాద్ నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి ఈ నెల 21న ప్రారంభోత్సవం చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినందున, నీటిని ఎత్తిపోయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లుచేసినట్లు ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు ప్రకటించారు. గోదావరినుంచి 2 టీఎంసీల నీటిని ఎత్తి జలాశయాలకు తరలించడానికి 4,992.47 మెగావాట్ల విద్యుత్తు అవసరం అవుతుందని అంచనావేసినట్లు వివరించారు. కొన్ని రిజర్వాయర్ల పనులు, లిఫ్టుల పనులింకా జరుగుతున్నందున ఈ ఏడాది నికరంగా 4,700 మెగావాట్ల డిమాండ్ వచ్చే అవకాశం ఉన్నదని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. వచ్చేఏడాది నుంచి మూడు టీఎంసీల నీరు ఎత్తిపోయాలని నిర్ణయించినందున మరో 2,160 మెగావాట్లు అదనంగా అవసరమని చెప్పారు. మొత్తంగా 7,152 మెగావాట్ల విద్యుత్తును అందించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. రూ.2,890 కోట్ల వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టు కోసం విద్యుత్ వ్యవస్థను ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. 15 డెడికేటెడ్ సబ్‌స్టేషన్లను నిర్మించి, వివిధ క్యాటగిరీల్లో 80 పంపులు బిగించామని తెలిపారు. గతంలో కేవలం 30 మెగావాట్ల విద్యుత్ పంపులు వాడిన చరిత్ర మాత్రమే తెలంగాణలో ఉన్నదని, కానీ సముద్రమట్టానికి 618 మీటర్లకు పైగా ఎత్తుకు పంపింగ్‌చేసి, తెలంగాణ బీళ్లకు నదీజలాలను మళ్లించే బృహత్కార్యానికి విద్యుత్ సంస్థలు పూనుకొన్నాయని ప్రభాకర్‌రావు చెప్పారు. రైతులకు సాగునీరు అందించే అతిపెద్ద క్రతువులో విద్యుత్‌శాఖది కీలకపాత్ర అని, దీన్ని విజయవంతం చేయడానికి ఉద్యోగులు శక్తివంచన లేకుండా కృషిచేయాలన్నారు. కోటికి పైగా ఎకరాలకు సాగునీరు అందించాలనే గొప్ప లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారని, వీటి ద్వారా అనుకున్న విధంగా నీటిని ఎత్తిపోసే బాధ్యత విద్యుత్ ఉద్యోగులపై ఉందన్నారు. నిర్ణీత గడువులోగా విద్యుత్ వ్యవస్థను ఏర్పాటుచేసిన స్ఫూర్తితోనే, లిఫ్టులను కూడా ఎలాంటి ఆటంకాల్లేకుండా నిర్వహించి సమర్థతను చాటుకోవాలని ఉద్యోగులను కోరారు.

విద్యుత్ శాఖ చేసిన పనులు

మొత్తం లోడ్	: 4,992.47
పంపులు	: 100
400 కేవీ సబ్‌స్టేషన్లు	: 6
220 కేవీ సబ్‌స్టేషన్లు	: 9
132 కేవీ సబ్‌స్టేషన్లు	: 2
మొత్తం సబ్‌స్టేషన్లు	: 17
400 కేవీ లైన్ పొడవు	: 521.08 కి.మీ.
220 కేవీ లైన్ పొడవు	: 461.05 కి.మీ.
132 కేవీ లైన్ పొడవు	: 43.2 కి.మీ.
మొత్తం లైన్ పొడవు	: 1025.33 కి.మీ.

40 లక్షల ఎకరాల ఆయకట్టుకు జీవం

కిలోమీటర్లకొద్దీ పొడవైన సొరంగాలు.. ఆసియాలోనే అతిపెద్దవైన మోటర్లు.. లోతైన సర్జ్‌పూల్స్.. మూడు బరాజ్‌లు.. మూడు పంప్‌హౌస్‌లు.. వీటన్నింటితో నదీగర్భంలోనే రివర్స్ పంపింగ్ విధానం! ఒకటా రెండా.. కాళేశ్వరం ప్రత్యేకతలు అన్నీఇన్నీ కావు. పదమూడు జిల్లాలు.. దాదాపు 40 లక్షల ఎకరాల ఆయకట్టు.. సమృద్ధిగా నీరు.. ఇప్పుడు తడారిపోయిన రైతు కండ్లల్లో మళ్లీ నీరు ఉబికివస్తున్నది.. ఆనందబాష్పమై! సాగునీటి ప్రాజెక్టుల రీడిజైనింగ్‌లో భాగంగా సీఎం కేసీఆర్ ఈ పథకానికి రూపకల్పన చేయగా.. 2016 జూన్‌లో నిర్మాణపనులు మొదలయ్యాయి. అదేసమయంలో మహారాష్ట్రతో అంతర్రాష్ట్ర ఒప్పందం కూడా పూర్తవడంతో పనులు శరవేగంగా ముందుకుసాగాయి. ముఖ్యంగా దేశంలో ఏ సాగునీటి ప్రాజెక్టు కూడా సాధించనిరీతిలో.. కేంద్ర జలసంఘం నుంచి ఏకంగా పది కీలకమైన అనుమతుల్ని ఏడాదిలోపే సాధించడం ఈ ప్రాజెక్టు విశిష్టత. సాధారణంగా ఒక ప్రాజెక్టు రూపకల్పన నుంచి నీటి విడుదల వరకు కనీసంగా దశాబ్దం వరకు సమయం పడుతుంది. కానీ అందుకు భిన్నంగా కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం రెండున్నరేండ్లలోనే సాకారం చేయడమనేది దేశ సాగునీటిరంగ చరిత్రలోనే ఒక రికార్డు. ప్రధానంగా ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ బరాజ్ నిర్మాణంలో భాగంగా జరిగిన కాంక్రీట్ పనులు సరికొత్త రికార్డులను నెలకొల్పాయి. మూడు షిఫ్టుల్లో రేయింబవళ్లు సిబ్బంది పనిచేయడం.. సెలవులు, పండుగలంటూ లేకుండా ఇంజినీర్లు పర్యవేక్షించడం.. సీఎం కేసీఆర్ సైతం ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు పనులను పరిశీలించడంతోపాటు నిధులలేమి లేకుండా ఆర్థికసంస్థల ద్వారా అవసరమైన రుణాలు సాధించి కనీసం ఒక్కనిమిషం కూడా పనులు ఆగకుండా నిర్మాణానికి అడ్డంకులు లేకుండాచేశారు.

ప్రతి నియోజకవర్గంలో బీసీ గురుకుల పాఠశాలలు

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొత్తం 119 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బీ వెంకటేశం బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత (2019-20) విద్యా సంవత్సరం అన్ని నియోజకవర్గాల పరిధిలో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల, బాలుర గురుకుల విద్యాలయాలను నిర్వహించాలని అధికారికంగా అనుమతించారు.

మైనార్టీ స్టడీ సర్కిల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైనార్టీస్ స్టడీసర్కిల్‌లో ప్రవేశాల కోసం ఈనెల 14 (శుక్రవారం) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్టడీసర్కిల్ డైరెక్టర్ బీ షఫీఉల్లా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థులు మైనార్టీ స్టడీసర్కిల్‌లో ప్రవేశానికి అర్హులని, జూలై 5లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జూలై 8 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఖమ్మం దవాఖానను పరిశీలించిన పువ్వాడ

మయూరిసెంటర్: ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ బుధవారం నగరంలోని ప్రభుత్వ దవాఖానను, మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ నెల తొమ్మిదిన ఓ సెక్యూరిటీ గార్డు వైద్యుడిగా అవతారం ఎత్తిన ఘటన నేపథ్యంలో ఎమ్మెల్యే పర్యటన ప్రాధాన్యం సంతరించుకున్నది. వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి దవాఖానకు మంచిపేరు తీసుకురావాలని ఆయన సూచించారు. ఆయనతోపాటు డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, ఇంచార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రామునాయక్, ఆర్ఎంవో డాక్టర్ కృపా ఉషశ్రీ, కార్పొరేటర్ పగడాల నాగరాజు, టీఆర్ఎస్ నాయకులు బుర్రి వినయ్, హెచ్చు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బుధవారం సాయంత్రం హుస్సేన్‌సాగర్ వద్ద కమ్ముకొన్న మబ్బులు

వానలు ఇంకా ఆలస్యం

మూడోపేజీ తరువాయి...

మందగమనంలో సాగుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వై కరుణాకర్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం కేరళ నుంచి తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు విస్తరించిన రుతుపవనాలు ఈ నెల 16 లేదా 17న తెలంగాణలో విస్తరించవచ్చని తెలిపారు. రాష్ట్రంలో ఈ నెల 17న తొలకరి వానలు కురిసే అవకాశం ఉన్నదని చెప్పారు.

పెరిగిన ఎండల తీవ్రత

రాష్ట్రంలో ఎండల తీవ్రత మళ్లీ పెరిగింది. 'వాయు' తుఫాన్ కారణంగా గాలిలో తేమశాతం తగ్గి రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో మరో రెండ్రోజులపాటు వడగాడ్పుల తీవ్రత కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వై కరుణాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం పొడివాతావరణం ఉంటుందని చెప్పారు. ఈశాన్య బంగాళాఖాతం, దానిని అనుకుని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని, దీని ప్రభావంతో శుక్రవారం కొన్నిచోట్ల తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. బుధవారం రాష్ట్రంలో అత్యధికంగా మంచిర్యాల జిల్లాలో 44.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, కరీంనగర్‌లో 44 డిగ్రీలు, మహబూబాబాద్‌లో 43.7 డిగ్రీలు, హైదరాబాద్‌లో 39 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది.

గ్రేటర్ హైదరాబాద్‌కు వర్షసూచన

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టినప్పటికీ గాలిలో తేమ తగ్గడంతో ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. మరో మూడ్రోజుల వరకు ఇవే పరిస్థితులు ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. బుధవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 39 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 28.2 డిగ్రీలు, గాలిలో తేమ 39 శాతంగా నమోదైందని వెల్లడించారు. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో రాగల 24 గంటల్లో గ్రేటర్‌లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు.

24 నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఇంటర్వ్యూలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈనెల 24నుంచి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ల (క్లినికల్ డిపార్ట్‌మెంట్) భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో 24 నుంచి 26వరకు నిర్వహించే ఈ ప్రక్రియకు సంబంధించి అర్హులైన వారి జాబితాను తమ వెబ్‌సైట్లో పొందుపరిచామని వివరించింది.

ఉర్దూ అకాడమీ ఇంచార్జి కార్యదర్శిగా షఫిఉల్లా

- మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇంచార్జి వైస్‌చైర్మన్, ఎండీగా కాంతివెస్లీ
- ఉత్తర్వులు జారీచేసిన మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి బెన్‌హర్ మహేశ్‌దత్ ఎక్కా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉర్దూ అకాడమీ ఇంచార్జి కార్యదర్శి, హజ్ కమిటీ ఇంచార్జి కార్యనిర్వాహక అధికారిగా బీ షఫిఉల్లాను, మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇంచార్జి వైస్‌చైర్మన్ అండ్ ఎండీగా ఏహెచ్‌ఎన్ కాంతివెస్లీని నియమించారు. ఈ మేరకు మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి బెన్‌హర్ మహేశ్‌దత్ ఎక్కా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్‌చైర్మన్ అండ్ ఎండీ, ఉర్దూ అకాడమీ అదనపు కార్యదర్శి, హజ్ కమిటీ కార్యనిర్వాహక అధికారి విధులు నిర్వర్తిస్తున్న ఎంఏ వహీద్ పదవీకాలం బుధవారంతో ముగిసిన కారణంగా కొత్త అధికారులను నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గద్వాల మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు మృతి

మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు(ఫైల్)

- హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ కన్నుమూత
- సంతాపం తెలిపిన సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం, కేటీఆర్
- నేటి అంత్యక్రియల్లో పాల్గొననున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

గట్టు/హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని గద్వాల మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు(67) కన్నుమూశారు. కొంతకాలంగా మధుమేహం, రక్తపోటు, మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్సపొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. గద్వాల మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు మృతిపట్ల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంతాపం ప్రకటించారు. గద్వాల ఎమ్మెల్యేగా ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 1999 నుంచి 2004 వరకు గట్టు భీముడు గద్వాల ఎమ్మెల్యేగా పనిచేశారు. బీసీ నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఆయనకు భార్య భువనేశ్వరి, నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం గద్వాల నియోజకవర్గం గట్టు మండలంలోని బలిగెర గ్రామంలో గట్టు భీముడు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. భీముడు అంత్యక్రియల్లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పాల్గొంటారు.

ప్రముఖుల సంతాపం

మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు మృతిపట్ల శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతి వ్యక్తంచేశారు. మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, అబ్రహం సైతం సంతాపం ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు పార్థివదేహాన్ని గద్వాలలోని ఆయన సోదరుడు, రాష్ట్ర కన్స్యూమర్ ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప నివాసంలో బుధవారం సందర్శార్థం ఉంచగా, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ బండారి భాస్కర్, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి మంద జగన్నాథం తదితరులు సందర్శించి సంతాపం తెలిపారు. అంతకుముందు నిమ్స్ దవాఖానలో గట్టు భీముడు పార్థివదేహాన్ని బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయగౌడ్ సందర్శించారు.

కిటకిటలాడిన బాసర

బాసర క్షేత్రం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో భక్తులు తమ చిన్నారులకు సరస్వతి అమ్మవారి సన్నిధిలో అక్షర శ్రీకారాలు జరిపించారు. సుమారు 25 వేల మంది దర్శించుకోగా, రూ.8లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. -బాసర

విద్యుదాఘాతంతో రైతు మృతి

దుగ్గొండి: వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలంలోని మర్రిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి విద్యుదాఘాతంతో రైతు ప్రాణాలు వదిలాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిపల్లికి చెందిన అంబీరు వీరన్న (48) మంగళవ

రాహుల్ విషయంలో ఎవరికీ ఏ అనుమానాలు ఉండక్కరలేదు. రానున్న రోజుల్లో వివిధ రాష్ట్రాల్లో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించబోయే వ్యూహ రచన చేస్తున్నాం. ఇప్పుడు ఇక ముందు కూడా రాహుల్‌గాంధీయే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఉంటారు.

రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి

మా నుంచి మీకేం కావాలో తీసుకోండి. మేం మా ప్రాణాలైనా ఇస్తాం. అయితే మీరు కోరుకునేదేదైనా చర్చల ద్వారానే సాధ్యం. ప్రజాస్వామ్యబద్ధంగానే సాధించుకోండి. తుపాకులను వదలండి. రాజ్‌భవన్‌కు విందుకు రండి. చర్చించుకుందాం.

సత్యపాల్ మాలిక్, జమ్మూకశ్మీర్ గవర్నర్

చరిత్రలో నేడు

1920

పిల్లలను 'పోస్టు'లో పంపరాదని అమెరికా పోస్టు ఆఫీస్ అధికారుల ప్రకటన. వాహనమో ఇతర మార్గాల ద్వారా పంపటం కంటే పోస్టులో పంపటమే సులువని అమెరికన్లు భావించేవారు.

1933

జర్మనీ రహస్య పోలీస్ యంత్రాంగాన్ని ప్రారంభించిన షెర్మన్ గోరింగ్

1960

కాంబోడియా దేశాధినేతగా ప్రిన్స్ నారోడొమ్ సిహనౌక్.

బంగ్లాదేశ్‌లో రవాణా రంగంలోని అవ్యవస్థ గురించి చెప్పడానికి మాటలు చాలవు. ఈద్ సెలవుల సందర్భంగానైతే ప్రమాదాలు మరింత ఎక్కువ జరుగుతాయి. ఒక అధ్యయనం ప్రకారం- పదకొండు రోజులలో 142 మంది మరణించారు, 324 మంది గాయపడ్డారు. 2018 నాటి రవాణా చట్టం అమలు చేసినట్టయితే పరిస్థితి మెరుగుపడుతుంది. అయితే ఈ చట్టంలోని కొన్ని నిబంధనలను రవాణా కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. కఠిన శిక్షలు ఉండవద్దని, విద్యార్హతను పెంచవద్దని వారు కోరుతున్నారు. ప్రభుత్వం అందరితో చర్చించి చట్టాన్ని అమలు చేయాలె.

ది డైలీ స్టార్

ఆస్ట్రేలియాలో సార్వత్రిక ఆరోగ్య విధానం ఉందనే అభిప్రాయం ఉన్నది. కానీ ధనిక దేశాల కన్నా ఎక్కువగా రోగి 20 శాతం వైద్య వ్యయం భరించాల్సి వస్తున్నది. ప్రైవేట్ ఆరోగ్య బీమా గల వారు కూడా స్పెషలిస్టులు, సర్జన్లు, పాథాలజిస్టులు బీమాను మించి వసూలు చేస్తున్న బిల్లులను భరించలేకపోతున్నారు. ఇందుకు ఏ ఒక్కరో బాధ్యులు కారు. ప్రభుత్వ విధానంలో లోపం ఉన్నది. ప్రైవేట్ పాలసీలు కూడా తమ పరిధి నుంచి కొన్ని వ్యాధులను మినహాయిస్తున్నాయి. వైద్యులు కొన్ని నైతిక సూత్రాలను పాటించాలె. రోగులకు తగిన సమాచారం అందించాలె.

ది సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్

హాంకాంగ్ నిరసనలు

చైనా ఉక్కుపాదం మోపడానికి తెరవెనుక పావులు కదుపుతుంటే, తమ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం హాంకాంగ్ ప్రజలు ప్రతిఘటిస్తున్నారు. బుధవారం నుంచి హాంకాంగ్ ప్రజలు నిరసన ప్రదర్శనలు సాగిస్తూనే ఉన్నారు. 1997 నుంచి రెండు దశాబ్దాలకు పైగా హాంకాంగ్ ప్రజలు చైనా ఆధిపత్యాన్ని వీలైనంత అడ్డుకుంటూనే ఉన్నారు. ఒక్కోసారి ఈ నిరసన తీవ్రస్థాయిలో వ్యక్తమవుతున్నది. తాజాగా హాంకాంగ్ ప్రభుత్వం చైనాకు 'అనుమానితులను అప్పగించే చట్టం' చేయబోవడంతో నిరసనలు భగ్గుమన్నాయి. ఆదివారం దాదాపు పది లక్షల మంది నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఈ నిరసనలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ చట్టాన్ని అడ్డుకోవడానికి మార్చి 31వ తేదీన్నే హాంకాంగ్ ప్రజలు నిరసన ప్రదర్శనలు జరిపారు. ఏప్రిల్ 28న మరో ప్రదర్శన సాగింది. ఈ నెల ఆరవ తేదీన న్యాయవాదులు ప్రభుత్వ ప్రధాన కార్యాలయానికి ఎదురుగా మౌన ప్రదర్శన చేశారు. తొమ్మిదవ తేదీన లక్షలాదిమంది తరలిరావడంతో ఈ ప్రదర్శన ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఇప్పటికే హాంకాంగ్‌లో పరోక్షంగా చైనా శాసనం అమలవుతున్నది. ఈ చట్టం అమలులోకి వస్తే హాంకాంగ్‌లోని ఎవరినైనా చైనా అప్పగించమని కోరవచ్చు. నేరస్థులను అప్పగించడానికే ఈ చట్టం చేస్తున్నట్టు పైకి చెబుతున్నా, రాజకీయ అసమ్మతిని అణిచివేయడమే అసలు ఉద్దేశమని హాంకాంగ్ ప్రజలు అంటున్నారు. హాంకాంగ్ ప్రజల పోరాటం ఈ ఒక్క చట్టానికి సంబంధించినది కాదు. తమ అస్తిత్వ పరిరక్షణ, హక్కులకు సంబంధించినది. ఈ బిల్లుపై చర్చను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు హాంకాంగ్ ప్రభుత్వం ప్రకటించింది. అయినప్పటికీ హాంకాంగ్ ప్రజలు నమ్మడం లేదు. తమ హక్కుల పోరాటానికి ఇది ఆరంభం మాత్రమేనని అంటున్నారు.

19వ శతాబ్దంలో రాచరికం ఉన్నప్పుడు చైనా నుంచి బ్రిటన్ హాంకాంగ్‌ను 99 ఏండ్ల లీజుకు తీసుకున్నది. ఆ లీజు గడువు 1997లో ముగియడంతో బ్రిటన్ హాంకాంగ్‌ను చైనాకు అప్పగించింది. అయితే చైనాలో ఉన్న వ్యవస్థకు, హాంకాంగ్ రాజకీయ, ఆర్థిక, పరిపాలనావ్యవస్థ భిన్నమైనది. అప్పటికే హాంకాంగ్‌లో ప్రజాస్వామ్య సంస్కృతి పాతుకుపోయింది. మరోవైపు ప్రపంచంలోని వ్యాపార దిగ్గజాలకు అడ్డాగా మారింది. ఈ నేపథ్యంలో హాంకాంగ్‌లోను తమ దేశంలో కలుపుకున్నప్పటికీ, అక్కడి వ్యవస్థలకు ముప్పు ఉండదని చైనా హామీ ఇచ్చింది. 'ఒకే దేశం రెండు వ్యవస్థలు' అనే విధానాన్ని అమలుచేస్తామన్నది. కానీ క్రమేణా హాంకాంగ్ ప్రత్యేక అస్తిత్వాన్ని హరిస్తున్నది. హాంకాంగ్ శాసనసభ చైనా అనుకూలురతో నిండిపోయి ఉంటుంది. చైనా వ్యతిరేకులు చట్టసభలోకి అడుగుపెడితే, వారిని ఏదో కారణంగా బహిష్కరిస్తారు. హాంకాంగ్ ప్రభుత్వం చైనా చెప్పుచేతల్లో ఉంటుంది. చైనాలో రాజకీయ అసమ్మతికి తావు లేదు. కానీ చైనా ప్రభుత్వంతో ఏకీభవించని వారు హాంకాంగ్‌లో ఉంటారు. వారిని హాంకాంగ్ ప్రభుత్వం ద్వారా అణిచివేయడానికి చైనా ప్రయత్నిస్తుంటుంది. కొద్దికాలం కిందట హాంకాంగ్‌లోని ఐదుగురు పుస్తక ప్రచురణకర్తలు–విక్రేతలు అదృశ్యమయ్యారు. అదృశ్యమైన కొంతకాలానికి వారు చైనా టీవీలో మాట్లాడుతూ, తాము తప్పుచేశామని అంగీకార ప్రకటన చేశారు. వీరు చైనా పాలక వర్గాల వ్యతిరేక సాహిత్యం అమ్మేవారు. హాంకాంగ్‌లోని ఒక వ్యాపారి కూడా ఇదేవిధంగా అదృశ్యమయ్యాడు. చైనా వంటి పెద్ద దేశంలో భాగంగా ఉంటూ, ఆ దేశ నిరంకుశ వ్యవస్థ నుంచి తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం హాంకాంగ్ ప్రజాస్వామ్య ప్రియులు చేస్తున్న పోరాటం ఆశ్చర్యకరమైనది. ప్రజాస్వామ్యహక్కులు, అస్తిత్వం కోసం పడే తపన నుంచి ఆ ఆత్మ స్థైర్యం లభిస్తున్నది.

అమెరికాకు చైనాకు వాణిజ్య యుద్ధం సాగుతున్నది. సాంకేతికరంగంలో చైనా ఎదుగుదలను అమెరికా జీర్ణించుకోలేక పోతున్నదనే విమర్శలున్నాయి. చైనాకు చెందిన హువావెయి కంపెనీ అధికారిని అమెరికా కెనెడాలో అరెస్టు చేయించింది. దీంతో చైనా కెనెడాకు చెందిన ఒక వ్యాపారవేత్తను, మరో ప్రముఖుడిని అరెస్టు చేసింది. అమెరికా, చైనా వైషమ్యాలు హాంకాంగ్‌పై ప్రభావం చూపడం సాధారణమే. అయితే ఈ వివాదంలో ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అనే చర్చ వేరు. కానీ హాంకాంగ్ ప్రజల హక్కుల విషయంలో మాత్రం చైనాను కట్టడి చేయవలసిందే.

చైనా పక్కనే ఉన్న హాంకాంగ్‌ను బ్రిటన్ అధీనంలో పెట్టుకోవడాన్ని ఎవరూ సమర్థించరు. ఇదే రీతిలో హాంకాంగ్‌లోని 'వ్యాపార ప్రపంచం'తో చైనాకు విభేదాలు ఉంటే ఉండవచ్చు. అమెరికాకు చైనాకు వాణిజ్యయుద్ధం సాగుతున్నది. సాంకేతికరంగంలో చైనా ఎదుగుదలను అమెరికా జీర్ణించుకోలేక పోతున్నదనే విమర్శలున్నాయి. చైనాకు చెందిన హువావెయి కంపెనీ అధికారిని అమెరికా కెనెడాలో అరెస్టు చేయించింది. దీంతో చైనా కెనెడాకు చెందిన ఒక వ్యాపారవేత్తను, మరో ప్రముఖుడిని అరెస్టు చేసింది. అమెరికా, చైనా వైషమ్యాలు హాంకాంగ్‌పై ప్రభావం చూపడం సాధారణమే. అయితే ఈ వివాదంలో ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అనే చర్చ వేరు. కానీ హాంకాంగ్ ప్రజల హక్కుల విషయంలో మాత్రం చైనాను కట్టడి చేయవలసిందే. చైనాలో రాజకీయ అసమ్మతికి స్థానం లేదు. పార్టీ పెద్దలు, వ్యాపార కుటుంబాలు, పాత రాచరిక వ్యవస్థ వారసులు పెత్తనం చెలాయిస్తున్నారు. పార్టీలు లేవు, హక్కులు లేవు, స్వతంత్ర న్యాయవ్యవస్థ లేదు. అటువంటి వ్యవస్థ నీడలో హాంగ్‌కాంగ్ ప్రజలు స్వేచ్ఛగా జీవించడం సాధ్యం కాదు. హాంకాంగ్ ప్రజలు అనుమానితుల అప్పగింత చట్టాన్ని చేయడాన్ని అడ్డుకోవలసిందే. తమ ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకోవలసిందే. హాంకాంగ్ ప్రజల పోరాటం చైనా ప్రజల్లో చైతన్యాన్ని రగిలింది అక్కడ రాజకీయ సంస్కరణలకు దారితీస్తే మరీ మంచిది.

జనగళం

తీరు మార్చుకోవాలె

మొన్న జరిగిన ఎన్నికల్లో కేంద్రంతో పాటు రాష్ట్రంలో కూడా అధికారంలోకి వస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పగటి కలలు కన్నారు. కానీ ప్రజలు ఊహించని రీతిలో తీర్పునిచ్చారు. కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో, కేంద్రంలో చిత్తుగా ఓడించారు. ఈ తీర్పు కాంగ్రెస్ నాయకులకు రుచించడం లేదు. ఏం చేయాలో పాలుపోక అటు ప్రధాని మోదీని, ఇటు సీఎం కేసీఆర్‌పై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకుల తీరును ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. వారిలో మార్పు రాకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు. 1969లో తెలంగాణ ఉద్యమంలో 369 మందిని చంపినప్పుడు కాంగ్రెస్ పార్టీకి ప్రజాస్వామ్యం ఎందుకు గుర్తుకురాలేదని వారు ప్రశ్నిస్తున్నారు.

- బైరి జనార్దన్, ప్రగతినగర్, హైదరాబాద్

వదంతులు నమ్మవద్దు

వాట్సప్, ఫేస్‌బుక్, ట్విటర్ లాంటి సామాజిక మాధ్యమాల్లో రోజురోజుకు వదంతులు ఎక్కువవుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకులు, ప్రతిపక్షాలు కలిసే ఈ వదంతులకు జీవం పోస్తున్నట్లు అనుమానం కలుగుతున్నది. నిత్యం ఏదో ఒక అంశంలో ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నం కొనసాగుతున్నది. ఏటా 4 వందలకు పైగా యువతులు మిస్సింగ్ అవుతున్నారంటూ ఒక వదంతు వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఇలాంటి అవాస్తవాలను ప్రజలు పరిగణనలోకి తీసుకోవద్దు. అట్లాగే వదంతులను ప్రచారం చేస్తున్నవారిని పోలీసు అధికారులు గుర్తించి వారిపై కఠినచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- కొలిపాక లాస్య, పెద్ద సముద్రాల, హుస్నాబాద్

హర్షణీయం

రాష్ట్రవ్యాప్తంగా వానకాలం ప్రారంభ సమయానికే రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం అభినందనీయం. గత రెండు, మూడు రోజులుగా రైతు ఖాతాల్లో రైతుబంధు నగదు జమవుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- బండెల శ్రీనివాస్, కమాన్ చౌరస్తా, కరీంనగర్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన

టంకశాల అశోక్

కాంగ్రెస్ ఖాళీలోకి వచ్చేదెవరు?

తెలంగాణలో ఒకవేళ కాంగ్రెస్ ఖాళీ అయితే ఆ చోటులోకి వచ్చేది ఎవరనే ప్రశ్న ఇటీవల తరచుగా వినవస్తున్నది. ఈ ప్రశ్న వేస్తున్న వారిలో స్వయంగా కాంగ్రెస్‌తో పాటు వివిధ పార్టీల వారు, ఆలోచనాపరులు, సాధారణ పౌరులు ఉన్నారు. ఈ ప్రశ్న ఎంత ముఖ్యమైనదో అందుకు సమాధానం చెప్పటం అంత కష్టమైన పని. అది మునుముందు పరిస్థితులపై ఆధారపడి ఉంటుందన్నది మాత్రమే ఇప్పటికి అనగలమాట. అదే సమయంలో ఆ విషయమై ఆలోచించటం, సమాధానాన్ని కనుగొనే ప్రయత్నం చేయటం చైతన్యవంతమైన సమాజం చేయవలసిన పని.

కాంగ్రెస్ ఖాళీ కావటమనే ప్రస్తావన ఎందుకు వస్తున్నదో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఆ పార్టీ వరుసగా ఎన్నికల్లో ఓడిపోతున్నది. అది కూడా మామూలుగా కాదు. సీట్లు తగ్గినా ఓట్లు ఇంచుమించు అదేస్థాయిలో ఉండే స్థితి ఒకటి ఉంటుంది. కానీ కాంగ్రెస్‌కు ఓట్లు కూడా పడిపోతున్నాయి. అంతే ముఖ్యంగా పార్టీ యంత్రాంగం, వనరులు బలహీనపడుతున్నాయి. మనోస్థైర్యం దెబ్బతింటున్నది. కేంద్ర నాయకత్వాన్ని చూసి అయినా గుండె నిబ్బరం తెచ్చుకోగల పరిస్థితి లేదు. పోతే, అధికారపక్షమైన టీఆర్ఎస్ వైఫల్యాల వల్ల శూన్యం ఏర్పడి ఆ శూన్యంలోకి ప్రవేశించగల అవకాశం లభిస్తుందనుకుంటే, టీఆర్ఎస్ ప్రభుత్వం మొత్తమ్మీద అటువంటి అవకాశం ఇవ్వటం లేదు. ఈ పరిణామ క్రమంలో తాజాగా కన్పిస్తున్నవి పంచాయతీ పరిషత్ ఎన్నికలలో కాంగ్రెస్‌కు గతంలో ఎప్పుడూ లేనంతటి తీవ్ర పరాజయం, ఆ పార్టీ శాసనసభాపక్షం టీఆర్ఎస్‌లో విలీనం కావటం.

కాంగ్రెస్ ఖాళీ అయితే ఆ శూన్యంలోకి ఎవరు అనే ప్రశ్న ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి 19 సీట్లు వచ్చినప్పటి నుంచి మొదలైంది. అధికారానికి వచ్చితీరుతామనే ఆర్భాటంతో సాగినవారు అంతకుముందటి (2014లో 23) బలాన్ని అయినా నిలబెట్టుకోలేకపోవటం మొదటిస్థితి. గెలిచినవారిలో ఒక్కొక్కరు టీఆర్ఎస్ వైపు చూడటం రెండవ స్థితి. కనీసం లోక్‌సభ ఎన్నికలలో ఘన విసయం సాధించి కేంద్రంలో అధికారానికి రాగలమని ఆ ప్రభావంతో పరిస్థితి తెలంగాణలోనూ చక్కబడగలదనుకున్న ఆశలు భంగపడటం మూడవస్థితి. ఇక్కడ తమ లోక్‌సభ స్థానాలు మూడు కాగా బీజేపీకి నాలుగు రావటం నాలుగవ స్థితి. ఇక ఆ ఎన్నికల అనంతర పరిణామాలు పైన పేర్కొన్నవే. పార్టీ నాయకులు ఎక్కువమంది టీఆర్ఎస్ వైపు వెళ్తుండగా, తాము కూడా తగినంత మందిని ఆకర్షించగలమని, అది తమకు ఒక మిషన్ అని, ఆ విధంగా కాంగ్రెస్‌ను మూడవ స్థానంలోకి తోసి టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాగలమని బీజేపీ ధీమాగా ప్రకటిస్తున్నది. కాంగ్రెస్ ఖాళీ అయితే ఆ శూన్యంలోకి ఎవరనే ప్రశ్న ఆ విధంగా ఇటీవలి వారాలలో మరింత బలపడింది.

సూటిగా మాట్లాడాలంటే, కాంగ్రెస్ ఖాళీ అయిన పక్షంలో ఆ చోటులోకి బీజేపీ రాగలదా? యథాతథంగా రంగంలో ఉన్న శక్తి బీజేపీ అయినందున, ప్రత్యామ్నాయం అయ్యేందుకు వారు గట్టిగా ప్రయత్నిస్తుండటాన్ని బట్టి, పశ్న ఈ విధంగా ఉండటం సహజం. టీడీపీ, వామపక్షాలు అంటూ ఇతర శక్తులు ఉన్నాయిగాని నామమాత్రంగా మారాయి. మరి కొద్దికాలం తర్వాత అసలు టీడీపీ ఉనికి ఉండకపోవచ్చు. వామపక్షాల తీరును చూడగా అవి పుంజుకొనగల సూచనలు ఎంతమాత్రం కనిపించటం లేదు. అటువంటప్పుడు మిగిలింది బీజేపీ ఒక్కటే. అందువల్ల కాంగ్రెస్ శూన్యంలోకి బీజేపీ రాగలదా అనే ప్రశ్న, రావచ్చును అనే అంచనాలు ఏర్పడం సహజం. అదే జరుగుతున్నది కూడా.

అయినప్పుడు, కాంగ్రెస్ ఖాళీలోకి బీజేపీ రాగలదని నిర్ధారణగా చెప్పకోవచ్చు గదా. కాంగ్రెస్ నిజంగానే ఖాళీ అవుతుందని, అందులోకి ఎవరు రావచ్చునని ఆలోచించటం ఎందుకు? జాగ్రత్తగా ఆలోచించవలసిన విషయాలు ఇవే. చరిత్ర ఒక్కోసారి అనూహ్యమైన మలుపులు తిరుగుతుంటుంది. పరిణామాలు ఒక కాల బిందువు (పాయింట్ ఆఫ్ టైమ్) వద్ద తోచిన విధంగానే ముమ్ముందు కూడా సాగుతాయనేమీ లేదు. సాగవచ్చు, సాగకపోవనూవచ్చు. అది తిరిగి వివిధ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. ఆ పరిణామాలు ముందుగా ఊహించగలవి కావచ్చు, ఊహించలేనివి కావచ్చు. అందువల్లనే పైన అనుకున్న ప్రశ్నలు ఈ దశలో తెలంగాణలో తలెత్తుతున్నాయి. కాంగ్రెస్ నిజంగానే ఖాళీ అవుతుందా అన్నది మొదటి ముఖ్యమైన ప్రశ్న కాగా, ఒక వేళ ఆ పని జరిగితే అందులోకి రాగలది బీజేపేయేనా అన్నది రెండవ ముఖ్యమైన ప్రశ్న. ఇక్కడ ఒక వివరణ అవసరం. ఖాళీ అనే మాటకు అర్థం సీట్లు అని మాత్రమే కాదు. అంతకన్న ముఖ్యంగా భావజాల విస్తృతి, సామాజిక పునాది అనే అర్థంలో తీసుకోవాలి. ఇక్కడ ఒక మాట గుర్తుచేయటం అసందర్భం కాబోదు.

> కాంగ్రెస్ ఒకప్పుడు బలంగా ఉన్న కాలంతో పోల్చితే, మారింది కాంగ్రెస్ తప్ప తెలంగాణ సమాజం కాదు. ఇదేమాట దేశానికంతా వర్తిస్తుంది గాని అది ఇక్కడ చర్చనీయం కాదు గనుక పక్కన ఉంచుదాం. ఆ విధంగా తేలుతున్నదేమంటే, తెలంగాణలో కాంగ్రెస్ తన వైఫల్యాల వల్ల తనను తాను ఖాళీ చేసుకుంటున్నదే గాని, తెలంగాణ సమాజం స్వభావం గాని, భావజాలంగాని కాంగ్రెస్‌ను ఖాళీ చేయించేవి కావు. దీనిని బట్టి, రాగలకాలంలో మరింత బలహీనపడుతారా, మరింత ఖాళీ సృష్టిస్తారా, బీజేపీ లేదా మరొకరికి అవకాశం ఇస్తారా అన్నది తేల్చుకోవలసింది, అందుకు అనుగుణంగా వ్యవహరించవలసింది కాంగ్రెస్ మాత్రమే.

బీజేపీకి 1984లో రెండు లోక్‌సభ సీట్లు మాత్రమే వచ్చినప్పుడు అద్వానీ మాట్లాడుతూ, తాము అందుకు ఆందోళన చెందటం లేదని, తమ భావజాల విస్తృతి, సామాజిక పునాది చెక్కుచెదరలేదనే అర్థంలో చెప్పారు. ఆ తర్వాతి ఎన్నికలలో ఏం జరిగిందో తెలిసిందే.

తిరిగి ప్రస్తుతానికి వస్తే, కాంగ్రెస్‌కు తెలంగాణలో మొదటినుంచి ఒక సామాజిక పునాది ఉంది. ఒకానొక భావజాలానికి అది ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఆ రెండింటి ఆధారంగా రాజ్యం చేస్తూ వచ్చింది. తర్వాత క్రమంగా రాజ్యాన్ని కోల్పోవటానికి కారణం ఏమిటి? అందుకు మూడు కారణాలున్నాయి. తన సంప్రదాయిక భావజాలానికి కట్టుబడటం పూర్తిగా అంతర్ధానం లేదు గానీ బలహీనపడింది. తన ఆచరణ మొత్తంగా ముగియలేదు గాని గణనీయంగా తగ్గింది. ఈ రెండింటి వల్ల సామాజిక పునాదిని పూర్తిగా కాకున్నా తగినంత కోల్పోయింది. మొత్తమ్మీద గతంతో పోల్చితే, కాంగ్రెస్ ఒకప్పుడు బలంగా ఉన్న కాలంతో పోల్చితే, మారింది కాంగ్రెస్ తప్ప తెలంగాణ సమాజం కాదు. ఇదేమాట దేశానికంతా వర్తిస్తుంది గాని అది ఇక్కడ చర్చనీయం కాదు గనుక పక్కన ఉంచుదాం. ఆ విధంగా తేలుతున్నదేమంటే, తెలంగాణలో కాంగ్రెస్ తన వైఫల్యాల వల్ల తనను తాను ఖాళీ చేసుకుంటున్నదే గాని, తెలంగాణ సమాజం స్వభావం గాని, భావజాలంగాని కాంగ్రెస్‌ను ఖాళీ చేయించేవి కావు. దీనిని బట్టి, రాగలకాలంలో మరింత బలహీనపడుతారా, మరింత ఖాళీ సృష్టిస్తారా, బీజేపీ లేదా మరొకరికి అవకాశం ఇస్తారా అన్నది తేల్చుకోవలసింది, అందుకు అనుగుణంగా వ్యవహరించవలసింది కాంగ్రెస్ మాత్రమే. యథాతథంగా చూస్తే, తెలంగాణలో కాంగ్రెస్ రాజకీయంగా గణనీయంగా బలహీనపడింది, ఇంకా పడుతున్నది గాని, భావజాల పరంగా, పునాది పరంగా ఖాళీ అయిపోతున్నదని ఇప్పటికైతే అనలేము.

మరొకవైపు బీజేపీ, ఇతరుల రాజకీయ బలహీనతలోకి స్వల్పస్థాయిలో ప్రవేశించటమైతే చేసింది గాని, తెలంగాణ సమాజంలో భావజాల పరమైన, పునాదిపరమైన ఖాళీ అంటూ ఏర్పడటం, అందులోకి తాను ప్రవేశించటం ఇప్పటికైతే జరుగలేదు. నిజమైన అర్థంలో ఆ పని ఇంకా మొదలు కూడా కాలేదు. ఒకవేళ ఆ పార్టీ జాతీయస్థాయి బలం వల్ల కొంత ప్రభావం పడినా అది స్థూలంగా, ఉపరితల స్థాయిలో, తాత్కాలికంగా తప్ప, తెలంగాణ మూలాలలోకి వెళ్లగల అవకాశం సుదీర్ఘకాలం పాటు ఉండదు. ఈ లోగా అధికారపక్షమైన టీఆర్ఎస్‌తో సహా ఇతరులంతా విఫలమై శూన్యాన్ని సృష్టిస్తే తప్ప.

చివరగా కీలకమైన విషయం ఒకటి చెప్పుకోవాలి. తెలంగాణ సమాజపు సంప్రదాయక స్వభావానికి, పునాదికి ఈ రోజున వారసత్వం టీఆర్ఎస్‌ది. కాంగ్రెస్ బలహీనపడుతున్నంత మేర ఆ స్వభావానికి, పునాదికి టీఆర్ఎస్ మరింత వారసత్వ పార్టీగా మారుతున్నది. అందుకు టీఆర్ఎస్ కట్టుబడినంత కాలం సఫలమైనంతకాలం, ఈ సమాజంలో మౌలిక శూన్యాలు ఏర్పడవు. సమాజం ప్రధానం, కాంగ్రెస్ ద్వితీయం. కాంగ్రెస్ రాజకీయంగా బలహీనపడవచ్చు. కాని సమాజాన్ని టీఆర్ఎస్ బలంగానే ఉంచగల ఆస్కారం ఉంది. దీని మధ్య బీజేపీ తన చోటును వెతుక్కొనగలదా?

గబ్బిలాల గాంధర్వగీతాలాపాన

విశ్లేషణ

కర్నె ప్రభాకర్

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు.. అన్న నానుడిని కాంగ్రెస్ నేతలు మరిచిపోయి ఉంటారు, కాదు కాదు ప్రజలు మరిచిపోయి ఉంటారని కాంగ్రెస్ నాయకులు భ్రమపడి ఉంటారు. కానీ ప్రజలు ఏ విషయాన్ని అంత తొందరగా మరిచిపోరు. సందర్భానుసారంగా తమ అభిప్రాయాన్ని తెలియజేస్తూనే ఉంటరు. 1971లో తెలంగాణ కావాలనే బలమైన కాంక్షతో ఏర్పడ్డ టీపీఎస్ పార్టీకి చెందిన 11 మంది ఎంపీలను నాడు కాంగ్రెస్ పార్టీయే నిర్వీర్యం చేసి, తద్వారా ప్రజల ఆకాంక్షలపై నీళ్లు చల్లిందనే విషయం మసకమసకగా కదలాడుతుందనే విషయం కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలి. ఒక్క తెలంగాణ ఉద్యమ సందర్భమే కాదు.. 70 ఏండ్ల స్వాతంత్ర్య రాజకీయ చరిత్రలో లెక్కలేని చీకటి అధ్యాయాలకు నిలువెత్తు ఆకారం కాంగ్రెస్. ప్రజాస్వామిక విలువలకు తిలోదకాలిచ్చే వికృత చేష్టలకు కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ అడ్రస్ అన్న సంగతిని ప్రజలకు కొత్తగా పరిచయం చేయాల్సిన పనిలేదని నా భావన. అమ్మడం, కొనడం, బెదిరించడం, తొక్కేయడం, నొక్కేయడమే కాంగ్రెస్ భావజాలం.. అలాంటి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇయ్యాల ఇందిరా పార్క్ దగ్గర ప్రజలకు ఈస్ట్‌మన్ కలర్ సినీమా చూపించే ప్రయత్నం చేస్తున్నరు. రెండు రోజులు కాంగ్రెస్ పార్టీ నాయకుల హడావుడిని చూసి ప్రజలు ముక్కున వేలేసుకున్నారనే విషయం కాంగ్రెస్ పార్టీ నాయకులకు అర్థం కాకపోవచ్చు. కానీ ప్రజలకు మాత్రం స్పష్టంగా అర్థమైంది. అందుకే వారి చేష్టలను చూసి ఛీత్కరించుకుంటున్నారు.

అయితే ఆ విషయం ఆ పార్టీ నాయకులకు అర్థం కాక కాదు, అర్థమైనా అర్థం కానట్టు నటించి అమాయకులను నమ్మించాలనే కుట్రలో భాగం. అరువడం, పెడబొబ్బలు పెట్టి చివరికి అభాసుపాలు కావడం వారికి అలవాటున్నదే కదా. విచిత్రమేమంటే ఇందిరాగాంధీ పేరుపై ఏర్పాటుచేసిన ఇందిరా పార్కు దగ్గర హడావుడి చేస్తున్న వీరు 1971లో తెలంగాణ ప్రజా సమితి ఎంపీలను కొన్న ఇందిరాగాంధీ ప్రభుత్వ నీచ రాజకీయ స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకుంటే బాగుండేది. నాడు ఇందిరాగాంధీ తెరలేపిన పార్టీ ఫిరాయింపుల నుంచి మొన్నటికి మొన్న టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను, ఎంపీలను, ఎమ్మెల్యేలను అడ్డంగా కొనేదాక అప్రతిహతంగా సాగిన విషయం నేను కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజల ఆకాంక్షలు అవసరం లేదు. ప్రజల బలమైన కోరికలు గౌరవించడం ఆ పార్టీ భావజాలంలోనే లేదు. వారెన్నడూ దానికి అనుగుణంగా పనిచేసిన పాపానపోలేదు. అందుకే ఇయ్యాల ఆ పార్టీ శంకరగిరి మాన్యాల గడపలో ఉన్నది.

కాంగ్రెస్ పార్టీ గురించి చెప్పడం అంటే మోసం గురించి గ్రంథావిష్కరణ చేయడం లాంటిదే. వారు ఉనికి కోసం, అధికార పీఠం ఎక్కడం కోసం దేశంలో వారి వెన్నుపోటు పొడిచిన పార్టీలను లెక్కిస్తే.. వారి నుంచి బయటపడిన పార్టీలను వేళ్లమీద లెక్కించవచ్చునంటే అతిశయోక్తి కాదు. అసలు విలువల వలువలూడదీసే దుశ్చర్యలకు, పార్టీలను కూలదోసే కుట్రలకు ఈ దేశంలో ఉన్న ఏకైక శిక్షణాలయం 10 జన్‌పథ్ అన్నది కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. తమకు ఎదరుచెప్పిన, తమ అదుపాజ్ఞలో లేని అనేకమంది సొంత పార్టీ నేతలను వదిలిపెట్టని కుసంస్కారం, తమ చెప్పుచేతల్లోకి తీసుకురావడానికి వారు చేసిన దుర్మార్గ రాజకీయ దౌర్భాగ్యం గురించి చెప్పడం అంటే కొత్తతరాన్ని చెడగొట్టడమే అవుతుంది. అంత కుసంస్కృతి కలిగిన పార్టీని ప్రపంచంలో మరే దేశంలోనూ చూడటం సాధ్యమైతదా అనిపిస్తది ఒక్కోసారి.

ఇదంతా సరే, అసలు విషయానికి వద్దాం. ప్రజాస్వామ్యం, నీతి, నిజాయితీ అంటూ పెద్దపెద్ద పదాలతో మీడియా ముందుకువస్తున్న పెద్దమనుషులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, షబ్బీర్ అలీ, రేవంత్‌రెడ్డిలకు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, నీతీనియమాలు అనే పదాలు ఉచ్చరించే కనీస అర్హత ఉందా? అనే విషయాన్ని ఆలోచించు

సిద్దిపేట పట్టణం నర్సాపురం డబుల్ బెడ్‌రూం ఇండ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

త్వరలో డబుల్ బెడ్రూంల ప్రారంభోత్సవం

సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: సిద్దిపేట పట్టణ శివారులో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్లను అర్హులకు కేటాయించి త్వరలో సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభించనున్నట్టు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణాలను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం సిద్దిపేటలో రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకా లు, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. రై తు బజారు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పంక్షన్ హాల్ నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు. సిద్దిపేటలో ప్రారంభించిన సఖి సెంటర్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలువాలని చెప్పారు. అన్నార్థులకు ఆపదలో ఉన్నవారికి ఈ కేంద్రం అండగా నిలువాలని చెప్పారు. మహిళ హక్కుల కోసం విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. త్వరలో రూ. 50 లక్షలతో శాశ్వత భవనం నిర్మిస్తామన్నారు.

కేటీఆర్ చొరవతో యువతికి విముక్తి

- గల్ఫ్‌లో షేక్ చరలో చిక్కుకుని నరకయాతన
- రామన్న జోక్యంతో క్షేమంగా స్వదేశానికి
- కృతజ్ఞతలు తెలిపిన బాధితురాలు, కుటుంబసభ్యులు

స్వదేశానికి చేరుకున్న లావణ్య

వీర్నపల్లి: షేక్ చెరలో చిక్కుకొని సౌదీలో నరకయాతన అనుభవిస్తున్న ఓ యువతికి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో విముక్తి లభించింది. సిరిసిల్ల ఎమ్మెల్యే రామన్న జోక్యంతో రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామానికి చెందిన రెడ్డిపల్లి లావణ్య స్వదేశానికి చేరుకుంది. వివరాల్లోకి వెళితే.. లావణ్య హైదరాబాద్‌లో నర్సింగ్ కోర్సును పూర్తిచేసింది. అనంతరం 2015లో సౌదీకి వెళ్లి కొద్దికాలం అక్కడ పనిచేసి 2016లో భారత్‌కు తిరిగివచ్చింది. ఆరు నెలల క్రితం మరోసారి విజిట్ వీసాపై సౌదీకి చేరుకొని ఓ షేక్ ఇంట్లో పనికి కుదిరింది. వీసా గడువు ముగియడంతో స్వదేశానికి రావాల్సి ఉంది. అయితే సదరు యాజమాని నిర్బంధించి రోజుకు 18 గంటలు పని చేయించారనీ, ఆయన బంధువుల ఇండ్ల లోనూ పని చేయించి చిత్ర హింసలకు గురిచేశాడు. ఎడారి దేశంలో తాను పడుతున్న అవస్థను వాట్సాప్ ద్వారా సదరు యువతి ఎమ్మెల్యే కేటీఆర్‌కు వివరించింది. వెంటనే స్పందించిన కేటీఆర్ ఈ విషయాన్ని ఏప్రిల్ 17న సౌదీ రాయబార కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. లావణ్యను చిత్రహింసలకు గురిచేస్తున్న సదరు యాజమానిపై అక్కడి రాయబార అధికారులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కేసు పూర్తికాకుండానే యువతిని స్వదేశానికి పంపించాలంటే రూ.35 వేలు చెల్లించాల్సి ఉండగా, సౌదీలోని సామాజిక కార్యకర్త శివాజీ అధికారులతో చర్చలు జరిపారు. ఖతార్‌లోని తెలంగాణ జాగృతి సభ్యుడు వికృతి రాజుగౌడ్ ఆర్థిక సహాయంతో లావణ్య క్షేమంగా ఇంటికి చేరుకుంది. కేటీఆర్ చొరవతో తమ కుమార్తె స్వదేశానికి తిరిగివచ్చిందనీ, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గురుకులానికి కలెక్టర్ కూతురు

- ఆదర్శంగా నిలిచిన వికారాబాద్ కలెక్టర్ అయేషామస్రత్‌ఖానం
- ప్రశంసించిన టెమ్రీస్ కార్యదర్శి షఫిఉల్లా
- కలెక్టర్ నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు

కలెక్టర్ అయేషా మస్రత్‌ఖానం

కూతురు తబిష్ రైనా

వికారాబాద్ జిల్లా ప్రతినిధి /హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సర్కారు విద్యపై ప్రజలతోపాటు ప్రభుత్వోద్యోగులకు స్ఫూర్తినిచ్చే నిర్ణయం తీసుకున్నారు వికారాబాద్ కలెక్టర్ అయేషా మస్రత్ ఖానం. అయిదో తరగతి చదువుతున్న తన కూతురు తబిష్ రైనాను వికారాబాద్ పట్టణ శివారు శివారెడ్డిపేట్‌లోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు స్టేటస్ అంటూ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో రూ.లక్షలు ఖర్చు చేసి చదివిస్తున్న ప్రస్తుత రోజుల్లో కలెక్టర్ తీసుకున్న నిర్ణయం అందరిలో మార్పు కలిగించేలా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నారు కాబట్టి తన కూతురును మైనార్టీ గురుకుల పాఠశాలలో చేర్పించానని కలెక్టర్ మస్రత్ ఖానం తెలిపారు. కలెక్టర్ నిర్ణయంతో మైనార్టీ గురుకులాలపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగిందని టెమ్రీస్ కార్యదర్శి బీ షఫిఉల్లా ప్రశంసించారు.

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల, టీఆర్ఎస్ నేత సైదిరెడ్డి

ఉత్తమ్ నిర్లక్ష్యంతోనే

హుజూర్‌నగర్ అభివృద్ధికి దూరం

విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

నేరేడుచర్ల: ఎమ్మెల్యేగా ఉండి అభివృద్ధి కోసం ఒక్క ప్రతిపాదన కూడా ఇవ్వకుండా ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన నిర్లక్ష్యంతోనే హుజూర్‌నగర్‌లోఅభివృద్ధి కుంటుపడిందని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. బుధవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కల్లూరులో చిల్లేపల్లి సహకార సంఘం చైర్మన్ చలసాని శ్రీనివాస్ తండ్రి చలసాని అప్పారావు సంతాప సభలో పాల్గొని, మాట్లాడారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించినప్పటికీ నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సమస్యలను పట్టించుకోలేదన్నారు. రానున్న ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. నియోజకవర్గాన్ని నాలుగు నెలల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని స్పష్టంచేశారు. రాజ్యసభ సభ్యుడు లింగయ్యయాదవ్, పార్టీ ఇంచార్జి శానంపూడి సైదిరెడ్డి, నాయకులు జిన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ నర్సయ్య, ఎంపీపీ జ్యోతి పాల్గొన్నారు.

'పంచాయతీరాజ్' పటిష్టం

సర్వాధికారాలు స్థానిక సంస్థలకే ఇస్తున్నాం ▪ కరీంనగర్ జెడ్పీ సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ :

కరీంనగర్ జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి, చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్

పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టపరిచేందుకు సీఎం కేసీఆర్ ఆలోచన చేస్తున్నారనీ, స్థానిక సంస్థలకే సర్వాధికారాలు ఇచ్చే ప్రయత్నంలో ఉన్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. కరీంనగర్ జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశంలో మంత్రి ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ పరిధిలోని విద్యా వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయనీ, వీటిని బలోపేతం చేసేందుకు జెడ్పీలు, పంచాయతీలకు సర్వాధికారాలు ఇవ్వాలనే ఆలోచన చేస్తున్నామని స్పష్టంచేశారు. ప్రైవేట్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తున్నదనీ, మెరిట్ ఉపాధ్యాయులు ఉన్నా పరిస్థితి అధ్వానంగా మారడం దురదృష్టకమన్నారు. సర్పంచులకు మరిన్ని అధికారాలు కట్టబెట్టిన తర్వాతే చెక్‌పవర్ ఇవ్వాలని ఆలోచిస్తున్నామన్నారు. అయితే సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీ అధ్యక్షుల పని తీరు సంతృప్తికరంగా లేకపోతే చర్యలు తీసుకునేలా చట్టాలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. రూ.45 వేల కోట్లు ఖర్చుతో కృష్ణా, గోదావరి నీళ్లను ముందుకు తెస్తున్నామనీ, ఇంకో రూ.10 వేల కోట్లు కూడా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కొందరి మూలంగా రెవెన్యూ వ్యవస్థకు చెడ్డ పేరు వస్తున్నదని, రెవెన్యూశాఖ ప్రక్షాళన కావాలన్నారు. ధాన్యం కొనుగోలు డబ్బులు త్వరలో విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. ప్రజాప్రతినిధులుగా ఉంటేనే ప్రజా సేవ చేయాలనుకోవడం తప్పనీ, రాజకీయ నాయకుడిగా కూడా ప్రజా క్షేత్రంలో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించాలని మంత్రి ఈటల రాజేందర్ ప్రస్తుత జెడ్పీటీసీ సభ్యులకు సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుంకె రవిశంకర్, డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, రఘోత్తంరెడ్డి, కరీంనగర్ ఇన్‌చార్జి కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్, పెద్దపల్లి కలెక్టర్ దేవసేన, జడ్పీ సీఈవో డీ వెంకటమాధవరావు, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఈటల రాజేందర్ జడ్పీ క్వార్టర్స్ ఆవరణలో రూ. 2 కోట్లతో నిర్మించిన నాలుగు జిల్లాల శిక్షణా కేంద్రాన్ని, జడ్పీ కార్యాలయం ఆవరణలో రూ. 5 కోట్లతో నిర్మించిన జడ్పీ నూతన భవనాన్ని ప్రారం భించారు.

రాముని హుండీ ఆదాయం

రూ.1.07 కోట్లు

భద్రాచలం, నమస్తే తెలంగాణ: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామికి హుండీ ద్వారా రూ.1.07 కోట్ల ఆదాయం వచ్చిందని ఈవోరమేశ్‌బాబు తెలిపారు.12 హుండీలకుఆరింటిని లెక్కించగా నగదుతోపాటు 65 గ్రాముల బంగారం, 1.25 కిలోల వెండితోపాటు మిగతా విదేశీ కరెన్సీ రూపంలో వచ్చిందన్నారు.

'ఉద్యోగాల కల్పనే లక్ష్యం'

ఖమ్మం ఎడ్యుకేషన్ : గ్రామీణ యువత ఉపాధికి ప్రభుత్వం 'టాస్క్'తో భరోసా కల్పిస్తున్నదని టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా అన్నారు. టాస్క్ నూతన సీఈఓగా బాధ్యతలు చేపట్టిన ఆయన బుధవారం ఖమ్మంలోని 'టాస్క్' కార్యాలయాన్ని సందర్శించి, నిర్వహిస్తున్న ప్రోగ్రాంలను పరిశీలించారు. గడిచిన సంవత్సరాల్లో ఏఏ కళాశాలలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి, ముందుకు రాని కళాశాలలను ఎలా ప్రోత్సహించాలనే అనే అంశాలపై టాస్క్ సిబ్బందికి సూచనలు చేశారు.

త్వరలో తండాలకు మహర్దశ

'పాలమూరు' ముంపు బాధితులకు మల్లన్నసాగర్ మాదిరి పరిహారం

వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి జిల్లా తల్పునూర్‌లో మాట్లాడుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

రేవల్లి: త్వరలో తండాలకు మహర్దశ పట్టనున్నదని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి జిల్లా రేవల్లి మండలం తల్పునూర్ తండాకు గిరిజన సంక్షేమశాఖ ద్వారా మంజూరైన రూ. 2 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు. గతంలో పల్లెనిద్రలు చేపట్టి గ్రామాల్లో సమస్యలుపరిష్కరించామని మంత్రి చెప్పారు. వచ్చేవారం తల్పునూర్‌తండాలో బస చేయనున్నట్టు తెలిపారు. త్వరలో 'ప్రతి గ్రామం శుభ్రం-ప్రతి ఊరు శుభ్రం' అనే కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. 'పాలమూరు-రంగారెడ్డి' ముంపు గ్రామాల నిర్వాసితులకు మల్లన్నసాగర్ మాదిరి పరిహారం అందించనున్నట్టు చెప్పారు.

బాధితుల ఇంటికెళ్లి చెక్కులిచ్చి..

సీఎమ్మార్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న బాధితులకు విడుదలైన చెక్కులను మంత్రి స్వయంగా వారి ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. వనపర్తి టీచర్స్ కాలనీకి చెందిన సువర్ణకు రూ.30వేలు, పాతబజార్‌కు చెందిన మొగిలమ్మకు రూ.30వేలు, వల్లభ్‌నగర్‌కు చెందిన శ్రీలతకు రూ.60 వేలు, రాజపేట గ్రామానికి చెందిన వడ్డె బాలచంద్రమ్మకు రూ. 35 వేల చెక్కులు మంజూరు కావడంతో మంత్రి వారికి అందజేసి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు.

సిద్దిపేట జిల్లా ములుగులో నకిలీ విత్తనాలు, నిందితులను మీడియాకు చూపుతున్న పోలీసులు, వ్యవసాయాధికారులు

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

గజ్వేల్, నమస్తే తెలంగాణ / మల్దకల్: నకిలీ విత్తనాలపై పోలీసులు, వ్యవసాయాధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. సిద్దిపేట జిల్లా ములుగు, వర్గల్ మండలాల్లో బుధవారం ప్రత్యేక విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు దాడులు చేసి, సుమారు రూ.34 లక్షల విలువైన 1365 కిలోల పత్తివిత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. మాదారం గ్రామానికి చెందిన షేక్‌ఖాదర్‌వలీ, అంబర్‌పేటకు చెందిన కృష్ణ, గిర్మాపూర్‌కు చెందిన మహేశ్, దండుపల్లికి చెందిన రవీందర్, చందాపూర్‌కు చెందిన శౌరీ, శాఖారం గ్రామానికి చెందిన కృష్ణ, ఏపీలోని గుంటూరు జిల్లా దామరపల్లికి చెందిన శ్రీనివాసరావుతో కలిసి నకలీ విత్తనాలు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. శ్రీనివాసరావు నకిలీ విత్తనాలను జిల్లాలోని ఈ వ్యక్తులకు సరఫరా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు వర్గల్ మండలం మాదారం, శాఖారం కేంద్రంగా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టి పత్తివిత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఉల్గెపల్లిలో బుధవారం పోలీసులు, వ్యవసాయాధికారులు దాడుల్లో 160 కిలోల నాసిరకం పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. ఉల్గెపల్లికి చెందిన కుర్వ తిమ్మప్ప నకిలీ పత్తివిత్తనాలు అమ్ముతున్నట్టు సమాచారం అందటంతో ఏవో రాజశేఖర్, ఏఈవో ఖాజాబాషా సోదాలు నిర్వహించగా పత్తివిత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. సోదాలో దొరికిన నాసిరకం పత్తి విత్తనాలు మల్దకల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి రైతుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శరణప్ప తెలిపారు. తనిఖీల్లో ట్రాస్క్ ఫోర్స్ సిబ్బంది వెంకటేశ్, పెద్దస్వాములు, నజీర్ పాల్గొన్నారు.

జగిత్యాలలో మాట్లాడుతున్న సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్. చిత్రంలో ఎమ్మెల్యే సంజయ్

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ : దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం ఎంతో కృషిచేస్తున్నదని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం జగిత్యాలలోని ఐఎం హాలులో దివ్యాంగులను ఆదర్శవివాహం చేసుకున్న సకలాంగులకు ప్రోత్సాహక, స్వయంఉపాధి రుణాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. 13 మంది జంటలకు రూ. 50వేల చొప్పున, మరో నాలుగు జంటలకు రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దివ్యాంగులను వివాహం చేసుకున్న సకలాంగులను అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ శరత్, జాయింట్ కలెక్టర్ రాజేశం, ఆర్డీవో నరేందర్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మ్యూజియంలోని శిల్పసంపదను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ రొనాల్డ్‌రోస్

పురాతన వస్తువులు

భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం

- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ: భవిష్యత్ తరాలకు పురాతన వస్తువులు మార్గదర్శకం కానున్నాయని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా పిల్లలమర్రి వద్ద సైన్స్ మ్యూజియాన్ని పురావస్తు శాఖ డైరెక్టర్ దినకర్‌బాబు, కలెక్టర్ రొనాల్డ్‌రోస్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. పాలమూరు జిల్లాకు పదివేల సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. మహబూబ్‌నగర్ అంటేనే ముందుగా గుర్తుకు వచ్చేది పిల్లలమర్రి అన్నారు. ఇక్కడ పురావస్తు శాఖ ప్రదర్శనశాలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. జిల్లాలో పిల్లలమర్రితోపాటు మయూరీ పార్కు, మన్యం కొండను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

మేడారం జాతర ప్రతిపాదనలు పంపించాలి

ములుగు జిల్లా ప్రతినిధి / నమస్తేతెలంగాణ: మేడారం సమ్మక్క - సారక్క జాతర ఏర్పాట్లకు అవసరమయ్యే నిధుల కోసం ఈ నెల 15లోగా ప్రతిపాదనలు పంపించాలని ములుగు కలెక్టర్ చింతకుంట నారాయణరెడ్డి కోరారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు జరిగే జాతర ఏర్పాట్లపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చక్రధర్‌రావు, ఎస్పీ సంగ్రామ్ సింగ్‌జీపాటిల్ కలిసి సమీక్షించారు. భక్తులకు వసతి, రక్షణ చర్యలు కల్పించేందుకు అధికారులు దృష్టి సారించాలని సూచించారు. గత జాతరకు రూ. 80.55కోట్లు ప్రభుత్వం కేటాయించిందనీ, ఈసారి జాతరకు అవసరమయ్యే నిధులను మన ప్రతిపాదనలను బట్టి ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. మేడారం జాతర నిర్వహణ అత్యంత చాలెంజ్‌గా భావిస్తున్నామని ఎస్పీ అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 11 వేలమంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వ బడుల్లో చదివితే బంగారు భవిష్యత్తు

బాన్సువాడలోని సీయూపీస్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని శాసన సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ సీయూపీస్, ఉర్దూ పాఠశాలను సందర్శించారు. బెంచీలపై దుమ్ము ధూళి ఉండడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17తేదీన మరో 119 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభిస్తున్నామని చెప్పారు.

ప్రైవేట్ బడి బస్సులకు నో ఎంట్రీ

గొల్లపల్లి: జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చెందోలిలోకి ప్రైవేట్ బస్సులు రానివ్వద్దని బుధవారం తీర్మానించుకున్నారు. సర్పంచి అలిశెట్టి రవీందర్ సమక్షంలో సమావేశమై నిర్ణయం తీసుకున్నారు.

ఫలితాలు రాలేదని పాఠశాలకు తాళం

వర్ధన్నపేట, నమస్తే తెలంగాణ: పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత తక్కువ వచ్చిందంటూ పాఠశాల గేటుకు తాళం వేసి నిరసన తెలిపిన ఘటన వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందలో బుధవారం చోటుచేసుకుంది. పాఠశాలల పునఃప్రారంభం కావడంతో ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను గ్రామస్థులు నిలదీశారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు 65 మంది హాజరుకాగా, 19 మంది అనుత్తీర్ణులు కావడంతో ఉపాధ్యాయుల పని తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామానికి చేరుకొన్న ఎంఈవో సోమయ్య గ్రామస్థులను సముదాయించారు.

మెదక్ జిల్లా కూచన్‌పల్లి జెడ్పీ పాఠశాలలో గంట కొడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

ప్రణయ్ హత్య కేసులో చార్జిషీటు దాఖలు

న్యాయస్థానానికి నివేదిక అందజేత

మిర్యాలగూడటౌన్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసుకు సంబంధించిన చార్జిషీటును మిర్యాలగూడ డీఎస్పీ శ్రీనివాస్ బుధవారం నల్లగొండ కోర్టులో దాఖలు చేశారు. మిర్యాలగూడకు చెందిన ప్రణయ్ గతేడాది సెప్టెంబర్ 14న మిర్యాలగూడలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో సమగ్ర విచారణ జరిపిన పోలీసులు సుమారు 16 వందల పేజీలతో నివేదికను కోర్టుకు అప్పగించారు. చార్జిషీటు ప్రతులతో పాటు కేసులో కీలకమైన సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టును కూడా జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానానికి అందించారు. ఈ కేసులో మారుతీరావు, శ్రవణ్‌కుమార్, ఎంఏ కరీం, అస్గర్‌అలీ, మ హ్మద్‌బారి, సుభాష్‌శర్మను నిందితులుగా గుర్తించి అరెస్టుచేశారు. ఆరుగురిపై పీడీయాక్ట్ నమోదు చేసి వరంగల్ జైలుకు తరలించగా ఏప్రిల్ 28న మారుతీరావు, శ్రవణ్‌కుమార్, కరీం బెయిల్‌పై విడుదలయ్యారు.

గేదెను చంపిన చిరుతలు

మూసాపేట: మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం దాసరిపల్లి శివారులో చిరుతపులుల దాడిలో ఓ గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన వెంకటయ్య తన పొలంలో 12 పశువులను మంగళవారం సాయంత్రం కొట్టంలో కట్టేసి ఇంటికి వెళ్లాడు.అర్ధరాత్రి తర్వాత చిరుత పులులు కొట్టంపై దాడి చేసి ఒక గేదెను చంపి తిన్నాయి. ఉదయం చూసిన వెంకటయ్య అటవీ శాఖాధికారులకు సమాచారం అందించాడు

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వెంకటేశ్వర ఆలయంలో విగ్రహ పూజ చేస్తున్న చినజీయర్ స్వామి, చిత్రంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

వైభవంగా ఆలయ ప్రతిష్ఠాపనోత్సవం

మారుతీనగర్ : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని ఖాదీ ఆవరణలో వేంకటేశ్వర ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు త్రిదండి చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో బుధవారం వైభవంగా సాగాయి. మంగళవారం రాత్రి 11 తర్వాత చిన జీయర్‌స్వామి ఆలయానికి విచ్చేయగా ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు- సరోజన దంపతులు, ఆలయ ధర్మకర్త మహాజన్ నర్సింహులు దంపతులు స్వాగతం పలికారు. బుధవారం ఉదయం నుంచి స్వామిజీ శిష్యులు, వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు.

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కోనాపూర్ గ్రామంలో 53 మంది బీడీ కార్మికుల ఇండ్లకు బుధవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ భూమి పూజచేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో నరేందర్, ఎంపీపీ మేన్నేని స్వర్ణలత, జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, తాసిల్దార్ పద్మావతి, సర్పంచ్ చెక్కపల్లి స్వామిరెడ్డి పాల్గొన్నారు. - కొడిమ్యాల

రైతుల సంక్షేమం, నీటి సంరక్షణే నాబార్డు లక్ష్యం

నాబార్డు సీజీఎం విజయ్‌కుమార్

గుండాల: గ్రామీణ ప్రాంతాల రైతుల ఆర్థిక అభ్యున్నతి, నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టడమే నాబార్డు ఉద్దేశమని నాబార్డు సీజీఎం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారంలో వాతావరణ నిర్ధారణ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమితేమ, నీటి సంరక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాదుల కింద రుణ సౌకర్యాల వంటివి ప్రజలకు అందిస్తామన్నారు. అనంతరం సోమయ్య అనే రైతు చేనులో బోర్‌వెల్ రీఛార్జి కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు.

రాయ్‌బరేలీలో పర్యటించిన సోనియా, ప్రియాంక

ఓటర్లకు కృతజ్ఞతలు చెప్పిన యూపీఏ చైర్‌పర్సన్

రాయ్‌బరేలీ, జూన్ 12: ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి తనను తిరిగి ఎన్నుకున్నందుకు యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఓటర్లకు కృతజ్ఞతలు చెప్పారు. ఒక్కరోజు పర్యటన నిమిత్తం కుమార్తె ప్రియాంకగాంధీతో కలిసి రాయ్‌బరేలీ వచ్చిన ఆమె పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రతిసారీ రాయ్‌బరేలీతోపాటు అమేథీలో కూడా పర్యటించే సోనియా ఈసారి అక్కడికి వెళ్లలేదు. అమేథీలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఓడించిన విషయం తెలిసిందే. అందుకే సోనియా అమేథీలో పర్యటించనట్లు తెలుస్తున్నది. రాయ్‌బరేలీ నుంచి ఎంపీగా తిరిగి ఎన్నికైన తర్వాత సోనియా తన నియోజకవర్గంలో పర్యటించడం ఇదే తొలిసారి.

2050 నాటికి కార్బన్ న్యూట్రాలిటీ!

లక్ష్యంగా నిర్దేశించుకున్న బ్రిటన్

లండన్, జూన్ 12: కర్బన ఉద్గారాలను 2050 నాటికి 'నెట్ జీరో' స్థాయికి తగ్గించాలని (కార్బన్ న్యూట్రాలిటీ) బ్రిటన్ ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ మేరకు ముసాయిదా బిల్లును బుధవారం ఆ దేశ పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ప్రభుత్వ నిర్ణయాన్ని రాజకీయ పక్షాలు స్వాగతించాయి. అయితే ఈ లక్ష్యాన్ని సాధించేందుకు కఠినచర్యలు అవసరమని పర్యావరణ సంస్థలు సూచించాయి. ఇదే కాల వ్యవధిలో 80 శాతం మేర కర్బన ఉద్గారాలు తగ్గించాలన్న బ్రిటన్ ప్రస్తుత విధానం కంటే తాజా గడువు ఎంతో ప్రతిష్ఠాత్మకమైనది. అయితే ఇందుకోసం ట్రిలియన్ పౌండ్లు వ్యయం చేయాల్సి ఉంటుందని ఆర్థిక మంత్రి ఫిలిప్ హ్యామండ్ పేర్కొన్నారు. తాజా బిల్లు ద్వారా ప్రస్తుత పర్యావరణ చట్టాల్లో '2050' గడువును చేర్చనున్నారు.

జ్ఞానపీఠ్‌ను స్వీకరించిన అమితవ్‌ఘోష్

న్యూఢిల్లీ: ప్రముఖ రచయిత అమితవ్‌ఘోష్ ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ్ పురస్కారాన్ని బుధవారం స్వీకరించారు. ఈ అవార్డును తీసుకున్న తొలి ఆంగ్ల రచయితగా రికార్డు నెలకొల్పారు. '2018-జ్ఞానపీఠ్ అవార్డు'కు అమితవ్‌ఘోష్‌ను ఎంపిక చేసినట్టు జ్ఞానపీఠ్ బోర్డు గతేడాది డిసెంబర్‌లో ప్రకటించింది. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో పశ్చిమబెంగాల్ మాజీ గవర్నర్ గోపాల్‌కృష్ణగాంధీ చేతుల మీదుగా అవార్డును అమితవ్‌ఘోష్ తీసుకున్నారు.

అట్టుడుకుతున్న హాంకాంగ్

చైనాకు నిందితుల అప్పగింత బిల్లును వ్యతిరేకిస్తూ రోడ్లపైకి వచ్చిన ప్రజలు
పార్లమెంట్ ముట్టడికి యత్నం.. బాష్పవాయువు ప్రయోగించిన పోలీసులు

హాంకాంగ్‌లో ఆందోళనకారులపైకి భాష్పవాయు గోళాలు, పెప్పర్ స్ప్రేతో విరుచుకుపడుతున్న పోలీసులు

హాంకాంగ్, జూన్ 12: నిందితులను చైనాకు అప్పగించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన వివాదాస్పద బిల్లును వ్యతిరేకిస్తూ బుధవారం హాంకాంగ్‌లో నిరసనకారులు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. పార్లమెంట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ఆందోళనకారులు యత్నించడంతో వారిని అడ్డుకునేందుకు పోలీసులు బాష్పవాయువు, పెప్పర్ స్ప్రేను ప్రయోగించారు. లాఠీలను ఝుళిపించారు. వివాదాస్పద బిల్లును రద్దుచేసేందుకు ప్రభుత్వానికి ఇచ్చిన గడువు బుధవారం ముగియడంతో వేలాది మంది నిరసనకారులు రోడ్ల మీదకు వచ్చారు. ప్రధాన రహదారులను దిగ్బంధించారు. ఆందోళనకారుల్లో ఎక్కువమంది విద్యార్థులు, యువతే ఉన్నారు. మాస్క్‌లు, హెల్మెట్లు ధరించి, గొడుగులను చేతబట్టి నిరసనల్లో పాల్గొన్నారు. 2014లో జరిగిన గొడుగుల ఉద్యమాన్ని ఇది తలపించింది. హాంకాంగ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ వద్దకు పెద్ద ఎత్తున నిరసనకారులు చేరుకుని పోలీసులపై రాళ్లను విసిరారు. దీంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జీ జరిపారు. భాష్పవాయువును ప్రయోగించారు. చైనాతో సహా ఇతర దేశాలకు నిందితులను అప్పగించే వివాదస్పద బిల్లుకు వ్యతిరేకంగా సుమారు పది లక్షల మంది ఆదివారం జరిగిన నిరసన ర్యాలీలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. అయితే ఆ బిల్లును ఉపసంహరించుకునేందుకు చైనా అనుకూల హాంకాంగ్ అధినేత్రి కారీ లామ్ నిరాకరించారు. నగర ప్రధాన కార్యదర్శి అయిన మాథ్యూ చెంగ్ బుధవారం మాట్లాడుతూ.. ఆందోళనను విరమించాలని నిరసనకారులను కోరారు. నిరసనల నేపథ్యంలో లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో బిల్లుపై బుధవారం జరుగాల్సిన చర్చను వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. చైనా కమ్యూనిస్టు పార్టీ కనుసన్నల్లో నడిచే న్యాయస్థానాల్లో ప్రజలకు న్యాయం దక్కదని ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరసనకారులకు మద్దతుగా హాంగాంగ్‌లోని 100కు పైగా వ్యాపార సంస్థలు బుధవారం తమ కార్యాలయాలను మూసివేశాయి. తరగతులను బహిష్కరించి నిరసనల్లో పాల్గొననున్నట్లు విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. బిల్లుపై చర్చను వాయిదా వేసినట్లు ప్రకటించినప్పటికీ ఆందోళనకారులు శాంతించలేదు. బిల్లును నిలుపుదల చేయడం తమ లక్ష్యం కాదని, రద్దు చేయడమే తమ లక్ష్యమని నిరసనకారులు పేర్కొన్నారు. 'ప్రస్తుతం కారీ లామ్ చేయాల్సిన బాధ్యతాయుతమైన పని.. వివాదస్పద బిల్లును రద్దు చేయడమే. లేదంటే క నీసం దాన్ని పక్కనపెట్టాలి' అని ఫెర్నాండో చెంగ్ అనే చట్టసభ సభ్యుడు వ్యాఖ్యానించారు.

స్వేచ్ఛ కోసం హాంకాంగ్ పోరాటం..

హాంకాంగ్ మళ్లీ నిరసనలతో అట్టుడుకున్నది. కొన్నేండ్లుగా ఊపిరి సలపకుండా చేస్తున్న చైనా నుంచి నగరాన్ని రక్షించుకునేందుకు ఇది తమకు చివరి అవకాశమని నిరసనకారులు చెబుతున్నారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌తో నాలుగేండ్ల కిందట ఉధృతంగా సాగిన 'అంబ్రెల్లా (గొడుగుల) ఉద్యమం'.. ప్రభుత్వం ఎలాంటి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోకుండానే ముగిసిపోయింది. నిందితులను చైనాకు అప్పగించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం తాజాగా వివాదస్పద బిల్లును తీసుకురావడంతో ప్రజలు మళ్లీ ఆందోళనబాటపట్టారు. ఆదివారం నిర్వహించిన ర్యాలీలో సుమారు 10 లక్షల మంది పాల్గొన్నారు. అయితే 2.4 లక్షల మందే పాల్గొన్నారని ప్రభుత్వం చెబుతున్నది. బిల్లును ఉపసంహరించుకునేందుకు చైనా అనుకూల హాంకాంగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కారీ లామ్ నిరాకరిస్తున్నారు. దీనిపై ఏకాభిప్రాయం సాధించినట్లు ఆమె చెబుతున్నారు. అయితే ప్రజలు దీనిపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. 'ప్రభుత్వం ప్రజల ద్వారా ఎన్నిక కాలేదు. అలాంటప్పుడు వారు ఇలాంటి చట్టాలు తీసుకురావడానికి వీల్లేదు' అని ఓ కార్మికుడు వ్యాఖ్యానించారు. 'హాంకాంగ్ ప్రజలకు ఊపిరితీసుకునే సమయం కూడా దొరకడం లేదు. నాగరిక సమాజాన్ని నిర్మించేందుకు మేం ఎంతో శ్రమించాల్సి వస్తున్నది' అని సామాజిక కార్యకర్త జేసన్ వ్యాఖ్యానించారు. అంబ్రెల్లా ఉద్యమంపై ఆయన పుస్తకం రాశారు. ఈ ఉద్యమం తర్వాత హాంకాంగ్‌పై పట్టు పెంచుకునేందుకు చైనా ప్రయత్నాలు ముమ్మరం చేసిందని ఆయన పేర్కొన్నారు.

అమ్మానాన్నల కోసం ఏడ్చి.. ఏడ్చి..

ప్రాణాలు కోల్పోయిన పాలస్తీనా బాలిక ఆయేషా
గాజాలో నానాటికీ దిగజారుతున్న పరిస్థితులు
రోగులపై కనీస మానవత్వం చూపని ఇజ్రాయెల్
చికిత్స అందించేందుకు సవాలక్ష ఆంక్షలు

దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయేషా (ఫైల్)

జెరుసలేం: అది.. ఇజ్రాయెల్‌లోని ఓ దవాఖాన.. పాలస్తీనాలోని గాజా బాలిక ఆయేషా (5) బ్రెయిన్ సర్జరీ కోసం అందులో చేరినప్పటి 'అమ్మా.. నాన్నా' అని ఏడుస్తూనే ఉన్నది. కానీ ఎవరూ దగ్గరికి రాలేదు. అధికారులు పంపిన ఓ అజ్ఞాత వ్యక్తి వచ్చి ఆమెను బుజ్జగించేందుకు ప్రయత్నించారు. అయినా ఆయేషా ఏడుపు ఆపలేదు. దిగులుతో ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఇజ్రాయెల్ అధికారులు ఆ పాపను తిరిగి గాజాలోని తల్లిదండ్రుల దగ్గరికి పంపించేశారు. మృత్యువుతో పోరాడుతూ వారం తర్వాత ఆ చిన్నారి కన్నుమూసింది. ఒక్క ఆయేషా మాత్రమే కాదు.. పాలస్తీనా తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉన్న గాజాలోని వేల మంది రోగుల పరిస్థితి ఇది. చికిత్స కోసం ఒంటరిగానే సరిహద్దు దాటి దవాఖానలో చేరాలి.. మళ్లీ ఒంటరిగా ఇంటికి తిరిగి వెళ్లాలి. వారిని వ్యాధి శారీరకంగా ఇబ్బంది పెడుతుంటే.. తోడెవరూ లేరనే బాధ మానసికంగా కృంగదీస్తున్నది. మరోవైపు దవాఖానలో ఏం జరుగుతున్నదో.. రోగి పరిస్థితేమిటో తెలియక కుటుంబసభ్యులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. చిన్నారి ఆయేషా ఉదంతం గాజాలోని హృదయవిదారక పరిస్థితులకు అద్దం పడుతున్నది. 'వ్యాధితో బాధపడుతున్న బిడ్డను మనకు దూరంగా, ఒంటరిగా వదిలేయాల్సి రావడం ఎంత నరకయాతనో మిగతావారికి అర్థం కాదు. గాజా నుంచి ఇజ్రాయెల్‌కు గంట ప్రయాణమే. కానీ మాకు పక్క గ్రహంలా కనిపిస్తున్నది' అని ఆయేషా తండ్రి వసీమ్ కన్నీరుమున్నీరయ్యారు. ఆయేషా ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. బాలిక దవాఖానలో చికిత్స పొందు తూ నవ్వుతున్న ఫొటోలు, మరణించాక తల్లిదండ్రుల రోదనల ఫొటోలను నెటిజన్లు షేర్ చేస్తూ.. ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్నారు.

దశాబ్దకాలంగా ఇదే దుస్థితి..

2007లో పాలస్తీనాలోని గాజాను ఆక్రమించుకున్న హమాస్ తీవ్రవాద సంస్థ దాన్ని ప్రభుత్వానికి అప్పగించడం లేదు. దీంతో గాజా చుట్టూ ఉన్న పాలస్తీనా, ఇజ్రాయెల్, ఈజిప్ట్ దేశాలు ఆంక్షలు విధించాయి. సరిహద్దుల్లో చెక్‌పోస్ట్‌లు ఏర్పాటుచేసి.. ఆర్థిక మూలాలను దెబ్బతీస్తున్నాయి. దీంతో గాజా పరిధిలోని 20 లక్షల మంది ప్రజలకు కనీస వసతుల్లేవు. అక్కడి ప్రజలు ఏదైనా తీవ్రమైన వ్యాధి వస్తే వైద్యం కోసం ఇజ్రాయెల్, పాలస్తీనాలకు వెళ్లాలంటే ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. రోగులనే తమ దేశంలోకి అనుమతిస్తున్న ఆయా దేశాల అధికారులు వారికి సహాయం గా తల్లిదండ్రులు/సంరక్షకులు రావడానికి అడ్డుచెప్తున్నారు. దీంతో వేల మంది రోగులు ఒంటరిగా సరిహద్దు దాటి.. చికిత్స పొంది తిరిగి రావాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తెలిపిన వివరాల ప్రకారం ఈ ఏడాది ఇప్పటివరకు దాదాపు 600 మంది రోగులకు సహాయకులను పంపేందుకు అనుమతి లభించలేదు. గతంలో రోగుల పట్ల ఉదారత చూపినా.. రానురాను వారినీ అనుమతించడం లేదు. 2012లో ఇజ్రాయెల్ 93% మంది రోగులకు, 83% మంది సహాయకులకు అనుమతి ఇవ్వగా.. ఈ ఏడాది 65% మంది రోగులనే చికిత్సకు అనుమతించింది. సహాయకుల్లో 52% దరఖాస్తులకు మాత్రమే అనుమతి వచ్చింది. మిగతా 13% మంది రోగులు ఒంటరిగానే చికిత్స చేయించుకోవాల్సిన దుస్థితి.

బీజేపీ లోక్‌సభా పక్ష నేతగా ప్రధాని మోదీ

- ఉప నేతగా రాజ్‌నాథ్ సింగ్
- బీజేపీ పార్లమెంటరీ పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ నియామకం

న్యూఢిల్లీ, జూన్ 12: బీజేపీ లోక్‌సభా పక్ష నేతగా ప్రధాని మోదీ, ఉప నేతగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యవహరించనున్నారు. ఈ మేరకు బీజేపీ పార్లమెంటరీ పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ బుధవారం నియామకం అయింది. రాజ్యసభలో బీజేపీ పక్ష నేతగా కేంద్రమంత్రి థావర్ చంద్ గెహ్లోట్, ఉప నేతగా రైల్వేమంత్రి పీయూష్ గోయల్ నియమితులయ్యారు. అమేథీలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని ఓడించిన కేంద్రమంత్రి స్మృతి ఇరానీ బీజేపీ పార్లమెంటరీ పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితురాలిగా నియమితులయ్యారు. ఇలా ప్రత్యేక ఆహ్వానితులుగా నితిన్ గడ్కరీ, రవిశంకర్ ప్రసాద్, అర్జున్ ముండా, నరేంద్రసింగ్ తోమర్, జువాల్ ఓరం కూడా నియమితులయ్యారు. ఇక రాజ్యసభ నుంచి ప్రత్యేక ఆహ్వానితులుగా జేపీ నడ్డా, ఓం ప్రకాశ్ మాథూర్, నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్, ప్రకాశ్ జవదేకర్ నియమితులయ్యారు. సంజయ్ జైస్వాల్‌ను లోక్‌సభ చీఫ్ విప్‌గా బీజేపీ నియమించింది.

యూపీలో జర్నలిస్టుపై దారుణంగా దాడి

- **దుస్తులు ఊడదీసి మూత్రం పోసి తాగాలని రైల్వే పోలీసుల బలవంతం**

మీరట్/లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లోని రైల్వే పోలీసులు ఓ టీవీ జర్నలిస్టును దారుణంగా కొట్టి, చిత్రహింసల పాల్జేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌కావడంతో ఇద్దరు పోలీసులను అధికారులు సస్పెండ్ చేశారు. షామ్లి ప్రాంతం దిమాన్‌పూర్ సమీపాన మంగళవారం రాత్రి 9 గంటలకు గూడ్స్ రైలుకు చెందిన 5 బోగీలు పట్టాలు తప్పిన ఘటన సమాచార సేకరణకు జర్నలిస్టులు అక్కడి కెళ్లారు. అప్పుడే అక్కడికి వచ్చిన షామ్లి రైల్వే పోలీసులకు, జర్నలిస్టులకు మధ్య వాగ్వాదం జరిగింది. జర్నలిస్టు అమిత్ శర్మను స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) రాకేశ్ కుమార్, మరో కానిస్టేబుల్ కొట్టారు. అంతటితో ఆగక అమిత్ శర్మను స్టేషన్‌కు తీసుకెళ్లి దుస్తులు ఊడదీసి, లాకప్‌లో వేసి మళ్లీ కొట్టిన పోలీసులు ఆయనపై మూత్రం పోసి తాగాలని బలవంతం చేశారు. విషయం తెలియగానే స్థానిక జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు ఎస్‌హెచ్‌వో రాకేశ్‌కుమార్‌ను, కానిస్టేబుల్ సంజయ్ పవార్‌ను సస్పెండ్ చేశారు. అమిత్ శర్మను బుధవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ నుంచి విడిచిపెట్టారు. మరో వైపు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై సోషల్ మీడియాలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి జైలుపాలైన జర్నలిస్టు ప్రశాంత్ కనోజియా బుధవారం విడుదలయ్యారు.

భారీ రుణాల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ అధ్వానం

- పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ వెల్లడి

ఇస్లామాబాద్, జూన్ 12: పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ దెబ్బ తినడానికి భారీగా అప్పులు తీసుకుని వాటిని చెల్లించకుండా దేశాన్ని వీడిన మోసగాళ్లదే బాధ్యత అని ఆ దేశ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పేర్కొన్నారు. పదేండ్లుగా భారీగా రుణాలు జారీ చేయడానికి దారి తీసిన పరిస్థితులపై ఉన్నతస్థాయి విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాక్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత మంగళవారం అర్ధరాత్రి జాతినుద్దేశించి ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడారు. పదేండ్ల క్రితం రూ.6 లక్షల కోట్లుగా ఉన్న రుణాలు ఇప్పుడు రూ.30 లక్షల కోట్లకు చేరుకున్నాయని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, బాలసముద్రం హన్మకొండ - 506 001, వరంగల్. ఫోన్: 0870-2577269

పర్యావరణ అనుమతికై ప్రజా విచారణ నోటిఫికేషన్

భారత ప్రభుత్వ పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ వారి ప్రకటన నంబరు ఎస్.ఓ 1533 తేది: 14-9-2006, అనుసరించి ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, కొత్తగూడెం వారు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘన్ పూర్ మండలం లోని బస్వరాజు పల్లి గ్రామ సమీపంలో ఉన్న కాకతీయ ఖని లాంగ్ వాల్ ప్రాజెక్టు భూగర్భగని లోని కొంత భాగం బొగ్గు నిల్వలను వెలికితీయుటకు కాకతీయ ఖని ఓపెన్ కాస్ట్ -3 గని (కాకతీయ ఖని ఓ.సి – III ప్రాజెక్టు ద్వారా ఓపెన్ కాస్ట్ త్రవ్వకాల నుంచి గరిష్టంగా 3.75 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో, భూగర్భ గని త్రవ్వకాల నుండి 0.48 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో 1336.64 హెక్టార్ల ప్రాజెక్టు ప్రాంతంలోని బొగ్గును వెలికి తీయుట) గా మార్చుటకు ప్రతిపాదించడమైనది. కావున ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు కొరకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ఈ ప్రకటన జారీ చేయడమైనది. ప్రతిపాదిత కాకతీయ ఖని ఓపెన్ కాస్ట్-3 (ఉపరితల బొగ్గు గని) ప్రాజెక్టు కార్యకలాపాలు మరియు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ వివరములు ఈ క్రింద పొందుపరచడమైనది.

1) కంపెనీ పేరు, చిరునామా మరియు ఫోన్ నంబర్	:	సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ప్రభుత్వ రంగ సంస్థ) కొత్తగూడెం – 507 101, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం, పి.బి.ఎక్స్ .ఫోన్ నంబర్లు. 08744 – 242301, 302, 303, 304
2) ప్రతిపాదిత ప్రాజెక్టు పేరు మరియు ప్రాజెక్టు స్థల వివరాలు	:	కాకతీయ ఖని ఓపెన్ కాస్ట్ సెక్టార్ -3(ఉపరితల బొగ్గు గని) ఘన్ పూర్ మండలం లోని భూపాలపల్లి సమీపములో ప్రాజెక్ట్ కు కావలసిన భూమి వివరాలు: ప్రభుత్వ భూమి : 599.36 హెక్టార్లు ప్రైవేట్ భూమి : 737.28 హెక్టార్లు. మొత్తం భూమి : 1336.64 హెక్టార్లు. ఈ ప్రాజెక్ట్ కు అటవీభూమి అవసరం లేదు. ప్రస్తుతం సింగరేణి సంస్థ ఆధీనంలో ఉన్న భూమి : 179.69 హెక్టార్లు మరియు సేకరించవలసిన భూమి : **1147.27** హెక్టార్లు. సింగరేణి సంస్థ ఆధీనంలో ఉన్న భూమి : 179.69 హెక్టార్లు. ధర్మారావు పేట (గ్రా), ఘన్ పూర్ (మం) లోని సర్వే నంబర్లు: 63, 64, 89, 90,91, 92, 702, 703,318/71 నుండి 318/76, 318/84 నుండి 318/88, 87, 92,94,95,96,106/13 నుండి 106/18, 106/20, 106/50, 106/52,163, 164, 167, 318/67 నుండి 318/70, 318/92, 318/120 నుండి 318/123, 318/134 నుండి 318/136, 395, 704, 705, 97, 99, 100, 103, 104, 106/2, 106/3, 106/5, 106/6, 107, 687, 688, 689, 694, 695, 706, 131 నుండి 134, 106/2/1,120, 121, 318/127 నుండి 318/129, 318/133, 87/3, 87/4, 91/1, 91/3, 92/1, 93/1, 94/3, 95/1, 96/1, 97/1, 98, 99/1, 99/3, 100/1, 100/3, 101, 102, 103/1, 103/4, 104/1, 104/4, 107/4, 107/1, 106/3/1, 106/4, 106/5/1, 106/6/1, 106/7, 106/8, 106/9, 106/10, 106/11, 106/12, 106/13/1, 106/14/2, 106/15/2, 106/16/1, 106/17/1, 106/18/3, 167/3, 159 నుండి 162, 163/1, 106/2/1, 106/2/3, 106//1/6, 106/1/8, 106/1/9, 106/1/11 నుండి 106/1/14, 106/1/16 నుండి 106/1/21, 106/1, 200, 318/1, 674 నుండి 677, 696, 699, 700,
		134/122/3, 134/123/2, 134/121/3, 134/120/3, 134/119/3, 134/118/2, 134/116/3, 134/115/2, 134/91/2, 134/93/2, 134/94/3, 134/95/2, 134/85/3, 134/86/3, 134/82/3, 134/83/2, 134/75/3, 134/74/2, 134/76/2, 134/289/2, 134/290/2, 134/330/2, 134/331/2, 134/332/2, 134/333/2, 134/334/2, 134/335/2, 134/336/2, 134/337/3, 134/338/3, 134/339/3, 134/340/3, 134/341/3, 134/342/3, 134/1/3, 134/1/4, 134/1/5, 134/55/3, 134/68/2, 134/69/2, 134/182/2, 106/1, 701. సింగరేణి సంస్థ సేకరించవలసిన భూమి : **1147.27** హెక్టార్లు. ధర్మారావు పేట (గ్రా), ఘన్ పూర్ (మం) లోని సర్వే నంబర్లు: 62 నుండి 66, 77 నుండి 83, 86, 87, 89,94 నుండి 96, 106/1, 106/14 నుండి 106/16, 106/18 నుండి 106/24, 108/25, 106/42, 108/43, 106/44 నుండి 106/53, 106/55, 106/56, 106/76 నుండి 106/79, 106/81 నుండి 106/86,106/88 నుండి 106/95, 108, 110, 117, 118, 119, 164 నుండి 199, 200/1, 203 నుండి 213, 216 నుండి 221, 318/1 నుండి 318/4, 318/7,318/9 నుండి 318/73, 318/86 నుండి 318/92, 318/94 నుండి 318/96, 318/137 నుండి 318/141, 318/141/1 నుండి 318/141/68, 318/141/88 నుండి 318/141/93, 318/142, 318/143, 318/144, 668, 673 నుండి 700, 703 నుండి 706. పెద్దాపూర్ (గ్రా), ఘన్ పూర్ (మం) లోని సర్వే నంబర్లు: 200, 727, 728, 567 నుండి 570, 573 కొండాపూర్ (గ్రా), ఘన్ పూర్ (మం) లోని సర్వే నంబర్లు: 61,488 నుండి 491, 494 నుండి 501, 501/7 నుండి 501/10,502.
3) ప్రాజెక్ట్ వివరములు తెలుసుకొనుటకు సంప్రదించవలసిన కంపెనీ అధికారి పేరు మరియు చిరునామా	:	శ్రీ. బి. భాస్కర్ రావు, డైరెక్టర్ (ప్లానింగ్ మరియు ప్రాజెక్ట్స్) సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, కొత్తగూడెం – 507 101, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం. ఫోన్ నెంబర్. 08744 – 242602
4) ప్రాజెక్టు కొరకు చేయు వ్యయం	:	రూ. 413.84 కోట్లు
5) కార్యకలాపాల స్వభావం మరియు ఉత్పత్తి.	:	ప్రతిపాదిత మిశ్రమ/సమీకృత ప్రాజక్టుగా , కాకతీయ ఖని ఓ.సి ప్రాజెక్టు ద్వారా ఓపెన్ కాస్ట్ త్రవ్వకాల నుంచి 3 మిలియన్ టన్నుల నిర్దేశిత వార్షిక సామర్థ్యంతో , గరిష్టంగా 3.75 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో కూడుకొని , భూగర్భ గని త్రవ్వకాల నుండి 0.48 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో మొత్తం 75.89 మిలియన్ టన్నుల బొగ్గును 1336.64 హెక్టార్ల ప్రాజక్టు ప్రాంతంలో వెలికి తీయాలని ప్రతిపాదించటం జరిగింది.
6) పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరుగు స్థలం , తేదీ మరియు సమయం	:	జిల్లా పరిషత్ హైస్కూల్, కొండాపూర్ (గ్రా), ఘన్ పూర్ (మం), భూపాలపల్లి జిల్లా , తెలంగాణ రాష్ట్రం 14-జూలై-2019 సమయం 11.00 గంటలకు
7) ప్రజల పరిశీలన నిమిత్తం ప్రాజెక్టు యొక్క సంగ్రహ నివేదిక మరియు ప్రాజెక్టు వలన పర్యావరణం పై ప్రభావం మరియు పరిరక్షణ ప్రణాళిక లభ్యమగు కార్యాలయములు	:	1. జిల్లా కలెక్టర్ కార్యాలయం, భూపాలపల్లి 2. జిల్లా పరిశ్రమల కేంద్రం, భూపాలపల్లి 3. ముఖ్య కార్య నిర్వహణాధికారి, జిల్లా పరిషత్ కార్యాలయం, వరంగల్. 4. పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ, ప్రాంతీయ కార్యాలయం, చెన్నై . 5. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయం ఎ-3, ఇండస్ట్రియల్ ఎస్టేట్, సనత్ నగర్, హైదరాబాద్. 6. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, జోనల్ కార్యాలయం, బేగంపేట్, హైదరాబాద్. 7. తెలంగాణ రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మరియు సాంకేతికత విభాగము సచివాలయం , హైదరాబాద్. 8. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, బాలసముద్రం, హన్మకొండ. 9. తహసీల్దార్ కార్యాలయం, భూపాలపల్లి 10. తహసీల్దార్ కార్యాలయం, ఘన్ పూర్ 11. గ్రామ పంచాయితి కార్యాలయం, కొండాపూర్(గ్రా), ఘన్ పూర్(మం) 12. గ్రామ పంచాయితి కార్యాలయం, ధర్మారావు పేట (గ్రా) , ఘన్ పూర్ (మం) 13. గ్రామ పంచాయితి కార్యాలయం, గుర్రంపేట (గ్రా), ఘన్ పూర్ (మం) 14. గ్రామ పంచాయితి కార్యాలయం, పరశురాంపల్లి (గ్రా), ఘన్ పూర్ (మం) 15. గ్రామ పంచాయితి కార్యాలయం, బస్వరాజుపల్లి (గ్రా), ఘన్ పూర్ (మం) 16. గ్రామ పంచాయితి కార్యాలయం, నగరంపల్లి (గ్రా), ఘన్ పూర్(మం) 17. గ్రామ పంచాయితి కార్యాలయం, పెద్దాపూర్(గ్రా), ఘన్ పూర్(మం) 18. గ్రామ పంచాయితి కార్యాలయం, గొల్లపల్లి(గ్రా), ఘన్ పూర్(మం) 19. గ్రామ పంచాయితి కార్యాలయం, మాదవరావుపల్లి (గ్రా), ఘన్పూర్(మం) 20. గ్రామ పంచాయితి కార్యాలయం, జంగుపల్లి (గ్రా), ఘన్ పూర్ (మం)

కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ ప్రకటనలోని నెం. ఎస్.ఓ 1533, తేది: 14.09.2006 వరుస క్రమ సంఖ్య 3 (3.1) లో ఎపెండిక్స్ IV అనుసరించి, ప్రాజెక్టు నిర్దేశిత ప్రాంతములోని ప్రజలు, పర్యావరణమును సంరక్షించు బృందాలు మరియు ఇతరులు, తమ అభిప్రాయములు, సూచనలు, వివరణలు, అభ్యంతరములను ఏమైనా ఉన్నయెడల ప్రకటన ప్రచురించిన తేది నుంచి 30 రోజులలోగా లిఖిత పూర్వకముగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి చెందిన దిగువ సంతకందారు అయిన అధికారికి తెలియజేయవచ్చును. మరియు అట్టివారు పైన తెలిపిన తేదీ , స్థలములో జరుగు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో కూడా పాల్గొనవచ్చును.

ప్రదేశము: వరంగల్ తేది: 10.06.2019

సం/- పర్యావరణ

హ్యాపీ మ్యారీడ్ లైఫ్ అమ్మా!

తల్లికి దగ్గరుండి రెండో పెండ్లి జరిపించిన కుమారుడు

గోకుల్ శ్రీధర్, పక్కన రెండోభర్తతో అతడి తల్లి

తిరువనంతపురం: తన తల్లికి రెండో పెండ్లి జరిపించిన ఆనందంలో ఓ కుమారుడు.. ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ ఫేస్‌బుక్‌లో పెట్టిన ఓ పోస్టు నెటిజన్ల హృదయాలను గెల్చుకుంటున్నది. కేరళలోని కొల్లమ్‌కు చెందిన గోకుల్ శ్రీధర్ అనే ఇంజనీర్ మంగళవారం పెట్టిన ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. 'ఈరోజు మా అమ్మ పెండ్లిరోజు' అని మలయాళంలో పేర్కొంటూ తన తల్లి రెండో భర్తతో కలిసి ఉన్న ఫొటోను శ్రీధర్ షేర్ చేశాడు. రెండో పెండ్లిని ఇప్పటికీ చాలామంది నేరంగా పరిగణిస్తున్న నేపథ్యంలో ఈ పోస్ట్ పెట్టేందుకు ఎంతో ఆలోచించినట్లు చెప్పాడు. ' ఓసారి మా నాన్న తీవ్రంగా కొట్టడంతో అమ్మ నుదుటిపై నుంచి రక్తం కారడం చూశా. ఎందుకు భరిస్తున్నావమ్మా అని అడిగితే.. నీకోసమే జీవిస్తున్నా.. ఎంతటి బాధనైనా భరిస్తా అని ఆమె చెప్పిన సమాధానం నాకు ఇప్పటికీ గుర్తుంది' అని శ్రీధర్ తన పోస్టులో వివరించాడు. 'మా అమ్మ చేయి పట్టుకుని ఆ ఇంట్లో నుంచి బయటకు వచ్చిన తరువాత, ఎప్పటికైనా ఆమెకు మళ్లీ వివాహం చేయాలని నిర్ణయించుకున్నా. నా కోసం ఆమె జీవితాన్ని ధారబోసింది. ఇంతకంటే నేను చెప్పేదేమీ లేదు. ఈ విషయాన్ని రహస్యంగా ఉంచదలచుకోలేదు' అని పేర్కొన్నాడు. హ్యాపీ మ్యారీడ్ లైఫ్ అమ్మా అంటూ ముగించాడు. ఈ పోస్ట్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నది.

జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడి

సీఆర్పీఎఫ్ పెట్రోలింగ్ పార్టీపై కాల్పులు

ఐదుగురు జవాన్లు మృతి.. ఒక ఉగ్రవాది హతం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో నిషేధిత జైషే మహమ్మద్ సంస్థకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు బుధవారం చెలరేగిపోయారు. మోటార్‌బైక్‌పై వచ్చి అనంతనాగ్ జిల్లాలో కేపీ మార్గంగా పేరొందిన ఖానాబాల్-పహల్గామ్ మార్గంలోని సీఆర్పీఎఫ్ పెట్రోలింగ్ పార్టీపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఆటోమేటిక్ రైఫిళ్లతో కాల్పులు జరుపుతూ హ్యాండ్ గ్రనేడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఐదుగురు సీఆర్పీఎఫ్ జవాన్లు మృత్యువాత పడగా, ఒక ఉగ్రవాది హతమయ్యాడు. మరో ఉగ్రవాది పరారయ్యాడు. ఉగ్రదాడి సమాచారం తెలుసుకున్న సద్దార్ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) అశ్రద్ అహ్మద్ సారథ్యంలో అదనపు బలగాలు ఘటనా స్థలానికి చేరుకుని ఉగ్రవాదులను ఎదుర్కొన్నాయి. ఉగ్రదాడిలో గాయపడిన ఎస్‌హెచ్‌వో అశ్రద్‌ను చికిత్స కోసం శ్రీనగర్‌కు తరలించారు. మరో పౌరుడు కూడా గాయపడ్డారు. అమర్‌నాథ్ యాత్ర ప్రారంభానికి మూడు వారాల ముందు ఉగ్రవాదులు దాడికి తెగబడటం గమనార్హం.

మాజీ సీజేఐని మోసగించిన కేసులో

నిందితుడికి కస్టడీ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీపీసింగ్ ఈ-మెయిల్ ఖాతాను హ్యాక్ చేసి, సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ (సీజేఐ) ఆర్ఎం లోధా ఖాతా నుంచి రూ.లక్ష తస్కరించిన ఘటనలో నిందితుడు దినేశ్ మాలికి రెండు రోజుల పోలీసు కస్టడీ విధిస్తూ ఢిల్లీ కోర్టు ఆదేశాలు జారీచేసింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో దినేష్ మాలిని ఈ నెల ప్రారంభంలో పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని మంగళవారం ఢిల్లీకి తీసుకొచ్చిన పోలీసులు బుధవారం ఢిల్లీ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. వాటర్ ప్యూరిఫయర్ల విక్రయాలు, మరమ్మతు పనులు చేసే దినేష్ మాలి.. ముకేశ్ అనే వ్యక్తి కోసం ఈ పని చేసినట్లు చెప్పాడు. ముకేశ్ తరపున చేసే ప్రతి పనికీ రూ.1000 తన ఖాతాలో జమ అవుతాయని తెలిపాడు.

బార్ కౌన్సిల్ అధ్యక్షురాలి దారుణ హత్య

ఉత్తర్ ప్రదేశ్‌లో కోర్టు ఆవరణలో కాల్చిచంపిన సహచర న్యాయవాది

అనంతరం తానూ కాల్చుకుని ఆత్మహత్యాయత్నం

దార్వేశ్ సింగ్

ఆగ్రా: ఉత్తర్‌ప్రదేశ్ బార్ కౌన్సిల్ (న్యాయవాదుల సంఘం) అధ్యక్షురాలు దార్వేశ్ సింగ్‌ను సహచర న్యాయవాది మనీశ్ శర్మ బుధవారం కోర్టు పరిసరాల్లోనే దారుణంగా కాల్చి చంపాడు. అనంతరం తానూ కాల్చుకుని ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. రెండ్రోజుల క్రితం బార్ కౌన్సిల్ అధ్యక్షురాలిగా ఎన్నికైన దార్వేశ్ సింగ్ బుధవారం తొలిసారిగా ఆగ్రాలోని సివిల్ కోర్టుకు వచ్చారని, మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఆమెపై దాడి జరిగిందని ఆగ్రా నగర ఏసీపీ ప్రవీణ్ వర్మ తెలిపారు. ఆమెను సన్మానించేందుకు నిర్వహించిన కార్యక్రమంలో మనీశ్ శర్మ అకస్మాత్తుగా ఆమెపై మూడుసార్లు కాల్పులు జరిపాడని చెప్పారు. పక్కనున్న వారు ప్రతిఘటించేలోపే తానూ కాల్చుకున్నాడని తెలిపారు. ప్రస్తుతం అతడు దవాఖానలో చికిత్స పొందుతున్నాడని, అతడి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. నిందితుడు వాడిన లైసెన్స్‌డ్ తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. హత్య వెనుక కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఇరువురు న్యాయవాదులు దశాబ్దకాలంగా కలిసి పని చేస్తున్నట్లు సహచర లాయర్లు చెప్పారు.

చంద్రయాన్-2

యూపీఏ వల్లే జాప్యం

మంగళ్‌యాన్ కోసం ఆలస్యం చేశారు

ఇస్రో మాజీ చైర్మన్ మాధవన్ నాయర్ ఆరోపణ

హైదరాబాద్: చంద్రయాన్-2ను ఎప్పుడో ప్రయోగించాల్సిందని ఇస్రో మాజీ చైర్మన్ జీ మాధవన్ నాయర్ పేర్కొన్నారు. కానీ 2014 లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి వీలుగా 'మంగళ్‌యాన్' ఉపగ్రహ ప్రయోగాన్ని చేపట్టాలని నాటి యూపీఏ సర్కార్ రాజకీయ నిర్ణయం తీసుకోవడం వల్లే చంద్రయాన్-2 జాప్యమైందని పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ చెప్పారు. 2014 ఎన్నికలకు ముందు బుధగ్రహంపైకి 'మంగళ్‌యాన్' ప్రయోగాన్ని జరుపడం ద్వారా లబ్ధి పొందాలని నాటి యూపీఏ సర్కార్ భావించిందన్నారు. 2013 నవంబర్‌లో యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రయోగించిన మంగళ్‌యాన్.. మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో 2014 సెప్టెంబర్‌లో లక్ష్యాన్ని చేరుకున్నది. కానీ తిరిగి అధికారంలోకి రావాలన్న నాటి యూపీఏ ప్రభుత్వ ఉద్దేశాలు నెరవేరలేదని మాధవన్ నాయర్ చెప్పారు. ఆయన గతేడాది అక్టోబర్‌లో బీజేపీలో చేరారు. ఆయన హయాంలోనే 2008 అక్టోబర్ 22న చంద్రయాన్-1ను ప్రయోగించారు. 2012 ఏడాది చివరికల్లా చంద్రయాన్-2 ప్రయోగిస్తామని 2009 ఆగస్టులోనే నాయర్ చెప్పారు. అయితే, నాటి యూపీఏ సర్కార్ కారణంగానే జాప్యం చోటు చేసుకున్నదని తాజాగా వెల్లడించారు. చంద్రయాన్-2 పనులు సగం పూర్తయిన తర్వాత ఆ వనరులను మంగళ్‌యాన్ ప్రయోగానికి మళ్లించామని నాయర్ తెలిపారు. మోదీ సర్కార్ 2014లో అధికారంలోకి వచ్చాకే చంద్రయాన్-2 పనులు మొదలయ్యాయని నాయర్ తెలిపారు. వచ్చేనెల 15న చంద్రయాన్-2ను ప్రయోగించనున్నట్లు ఇస్రో చైర్మన్ కే శివన్ బుధవారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో నాయర్ స్పందిస్తూ.. అతి తక్కువ సమయంలో చంద్రయాన్-2ను ప్రయోగించేందుకు సిద్ధమైన ఇస్రోను అభినందించారు. దీని ప్రయోగం సంక్లిష్టమైందని, సురక్షితంగా చంద్రుడి కక్ష్యలో చేరడమే ప్రధాన సవాల్ అని తెలిపారు.

స్క్రామ్‌జెట్ ఎయిర్‌క్రాఫ్ట్ పరీక్ష సక్సెస్

బాలాసోర్: పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన హైపర్‌సోనిక్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్ వెహికల్ (హెచ్ఎస్‌టీడీవీ)ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. బుధవారం ఉదయం 11.25 గంటలకు బంగాళాఖాతంలోని డాక్టర్ అబ్దుల్ కలామ్ ఐలాండ్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నాలుగో ప్రయోగ వేదిక నుంచి దీన్ని ప్రయోగించినట్లు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అధికార వర్గాలు తెలిపాయి. హెచ్ఎస్‌టీడీవీ అనేది మానవ రహిత స్క్రామ్‌జెట్ డెమాన్‌స్ట్రేషన్ ఎయిర్‌క్రాఫ్ట్. ఇది మాక్ 6 (ధ్వని వేగం కంటే ఆరు రెట్లు ఎక్కువ) వేగంతో దూసుకెళ్తుందని, కేవలం 20 సెకన్లలో 32.5 కి.మీ ఎత్తుకు చేరుకుంటుందని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో దీర్ఘశ్రేణి క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించేందుకు ఉపయోగపడడమే కాకుండా, తక్కువ ఖర్చుతో ఉపగ్రహాలను నింగిలోకి పంపేందుకు కూడా ఇది దోహపడుతుందని వివరించారు. డీఆర్‌డీవో సీనియర్ శాస్త్రవేత్తలు, రక్షణ శాఖ అధికారుల సమక్షంలో తాజా ప్రయోగాన్ని చేపట్టారు.

జూలై 15న జాబిల్లి యాత్ర

చంద్రయాన్-2 ప్రయోగానికి తేదీ ఖరారు చేసిన ఇస్రో

సెప్టెంబర్ 6 లేదా 7న చంద్రునిపై దిగనున్న ల్యాండర్

చంద్రుడిపై ఎవరూ దిగని ప్రాంతంలో పరిశోధనలు

ఖనిజాలు, నీటి కణాల కోసం అన్వేషణ ▪ మొత్తం వ్యయం రూ.1000కోట్లు


బెంగళూరులోని ఇస్రో పరిశోధన కేంద్రంలో చంద్రయాన్-2ను అభివృద్ధి చేస్తున్న శాస్త్రవేత్తలు

బెంగళూరు, జూన్ 12: చంద్రుడిపైకి భారత్ రెండోసారి జరుపనున్న యాత్రకు తేదీ ఖరారైంది. చంద్రయాన్-2ను వచ్చే నెల 15న చేపట్టనున్నట్టు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ కే శివన్ బుధవారం ప్రకటించారు. చంద్రుడిపై ఇంతవరకు ఎవరూ పరిశోధించని ప్రాంతంలో ల్యాండర్‌ను దించాలన్నది తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 6 లేదా 7న ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగుతుందని చెప్పారు. జూలై 15న తెల్లవారుజామున 2.51 గంటలకు శ్రీహరికోట నుంచి ఈ ప్రయోగం నిర్వహించనున్నామని తెలిపారు. అత్యంత శక్తిమంతమైన రాకెట్.. జీఎస్ఎల్‌వీ మార్క్-3 సాయంతో ఈ మిషన్‌ను చేపట్టనున్నామన్నారు. జూలై 9-16 మధ్య చంద్రయాన్-2ను ప్రయోగించనున్నామని ఇస్రో ఇంతకుముందు ప్రకటించిన సంగతి తెలిసిందే. 3.8 టన్నుల బరువుండే అంతరిక్ష నౌకలో ఆర్బిటార్, ల్యాండర్, రోవర్ ఉంటాయి. ల్యాండర్‌కు విక్రమ్ అని, రోవర్‌కు ప్రజ్ఞ అని పేర్లు పెట్టారు. ఆర్బిటార్‌లో 8 పేలోడ్స్, ల్యాండర్‌లో మూడు, రోవర్‌లో రెండు పేలోడ్స్ ఉంటాయని శివన్ తెలిపారు. ఈ ప్రాజెక్టుకయ్యే మొత్తం వ్యయం దాదాపు రూ.1000 కోట్లు. ఇందులో ఉపగ్రహ సంబంధిత వ్యయం, విదేశీ సాయానికయ్యే ఖర్చు రూ.603 కోట్లు కాగా, జీఎస్ఎల్‌వీ మార్క్-3 రాకెట్‌తోపాటు ప్రయోగానికయ్యే వ్యయం రూ.375 కోట్లు. శాస్త్రీయ పరికరాలు అమర్చిన ఆర్బిటార్ చంద్రుని చుట్టూ పరిభ్రమిస్తుందని ఇస్రో తెలిపింది. ముందుగా నిర్దేశించిన ప్రదేశంలో ల్యాండర్ దిగుతుందని, అందులో నుంచి రోవర్ బయటకు వచ్చి చంద్రుడి ఉపరితలంపై ముందుకు సాగుతూ ప్రయోగాలు చేపడుతుందని పేర్కొంది. ఆర్బిటార్‌లోని పరికరాలు చంద్రుడి ఉపరితలం, అక్కడ లభించే ఖనిజాలు, నీటి కణాల కోసం అన్వేషిస్తాయని ఇస్రో తెలిపింది. ఆర్బిటార్, ల్యాండర్ మాడ్యూల్స్‌ను యాంత్రికంగా ఒకదానికొకటి ఎదురెదురుగా ఉంచి ఇంటిగ్రేటెడ్ మాడ్యూల్‌గా రూపొందించామని, దాన్ని జీఎస్ఎల్‌వీ-మాక్ 3 ప్రయోగ వాహనంలో అమర్చామని వివరించింది. జీఎస్ఎల్‌వీ మార్క్-3 ద్వారా భూకక్ష్యలోకి ప్రయోగించిన అనంతరం ముందుగా ఇంటిగ్రేటెడ్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ విడిపోయి చంద్రుడి కక్ష్యలోకి చేరుతుంది. అనంతరం ఆర్బిటార్ నుంచి ల్యాండర్ విడిపోయి చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో ముందుగా నిర్దేశించిన ప్రదేశంలో దిగుతుంది. పదేండ్ల క్రితం ప్రయోగించిన చంద్రయాన్-1 కన్నా చంద్రయాన్-2 అధునాతనమైనదని ఇస్రో తెలిపింది. చంద్రయాన్-1 ద్వారా చంద్రుడిపై నీటి అవశేషాలను కనుగొన్న సంగతి తెలిసిందే.

ఇక 'ఆధార్' స్వచ్ఛందమే!

ఆధార్ చట్టానికి సవరణ ▪ ట్రిపుల్ తలాక్ కొత్త బిల్లు

7వేల టీచర్ పోస్టుల భర్తీ ▪ కేంద్ర మంత్రివర్గం ఆమోదం

వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో పలు బిల్లుల ప్రతిపాదనకు నిర్ణయం

(ఫైల్)

న్యూఢిల్లీ: బ్యాంక్ ఖాతా తెరిచేందుకు, మొబైల్ ఫోన్ కనెక్షన్లు తీసుకునేందుకు ఆధార్‌ను స్వచ్ఛందంగా వినియోగించే అవకాశం పౌరులకు కల్పించే ఆధార్ చట్ట సవరణ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేంద్రంలో వరుసగా రెండోసారి అధికారం చేపట్టిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో మొదటిసారిగా మంత్రివర్గం బుధవారం సమావేశమైంది. ఈ సమావేశంలో ఆధార్ చట్ట సవరణతోపాటు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. ఆధార్ చట్టం 2016, ఇతర చట్టాలను సవరిస్తూ గత మార్చిలో జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో రూపొందించిన తాజా బిల్లును ఈ నెల 17నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. ప్రజలు తమ గుర్తింపునకు ఆధారంగా ఆధార్‌ను స్వచ్ఛందంగా సమర్పిస్తే తప్ప దాని కోసం ఎవరూ ఒత్తిడి చేయరాదని చట్టంలో సవరణలు చేశారు. అలాగే 18 ఏండ్లు దాటిన వ్యక్తి ఆధార్ నుంచి నిష్క్రమించే అవకాశాన్ని కూడా బిల్లులో కల్పించారు. ఇక ఆధార్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై రూ.కోటి వరకు జరిమానా విధించే విధంగా నిబంధనలను సవరించారు. ట్రిపుల్ తలాక్ ఆచారాన్ని నిషేధించే తాజా బిల్లుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ బిల్లును వచ్చే సమావేశాల్లో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ట్రిపుల్ తలాక్‌ను నిషేధిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నారు.

టీచర్ల నియామకాల బిల్లుకు ఆమోదం

ఖాళీగా ఉన్న ఏడువేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీకి అనుమతినిచ్చే కేంద్ర విద్యా సంస్థల (టీచర్స్ క్యాడర్‌లో రిజర్వేషన్) బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరోవైపు జమ్ముకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆర్నెల్లు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. గత ఏడాది జూన్ 20 నుంచి ఆ రాష్ట్రంలో కేంద్ర పాలన కొనసాగుతున్నది. జమ్ముకశ్మీర్‌లోని భారత్-పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు వెంట నివసిస్తున్న ప్రజలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కూడా మంత్రివర్గం నిర్ణయించింది. ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లో ట్రస్ట్‌లు కూడా పారిశ్రామిక యూనిట్లను నెలకొల్పేందుకు అనుమతించే బిల్లుకు, ప్రభుత్వ నివాస భవనాలను అనధికారికంగా ఆక్రమించిన వారిని ఖాళీ చేయించే బిల్లుకు, హోమియోపతి కేంద్ర మండలి (సవరణ) ముసాయిదా బిల్లుకు, దంతవైద్యుల చట్టం, 1948 సవరణకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రవర్గ సమావేశంలో ప్రధాని మాట్లాడుతూ తన మంత్రివర్గ సహచరులకు పలు సూచనలు చేశారు. ఆఫీసుకు నిర్దేశిత సమయంలోగా రావాలని చెప్పారు. సహాయ మంత్రులకు ఎక్కువ అవకాశాలు కల్పించాలని, ముఖ్యమైన ఫైళ్లను వారితో పంచుకోవాలని సీనియర్లకు సూచించారు.

బెంగాల్ హింసపై నేడు అఖిలపక్షం!

నిర్వహించనున్న గవర్నర్ త్రిపాఠి

నాలుగు ప్రధాన పార్టీలకు లేఖలు

బుధవారం కోల్‌కతాలో బీజేపీ కార్యకర్తలపై వాటర్ క్యానన్లు ప్రయోగిస్తున్న పోలీసులు

కోల్‌కతా, జూన్ 12: లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో హింస కొనసాగుతున్న నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేఎన్ త్రిపాఠి గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి హాజరు కావాలని రాష్ట్రంలోని నాలుగు ప్రధాన పార్టీలు తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్‌లకు గవర్నర్ లేఖలు పంపారు. అధికార తృణమూల్ కాంగ్రెస్‌తోపాటు బీజేపీ సమావేశానికి హాజరవుతామని ధ్రువీకరించాయి. తమకు లేఖలు అందాయని అంగీకరించిన కాంగ్రెస్, సీపీఎం మాత్రం.. అఖిలపక్ష భేటీకి హాజరు కావాలా? వద్దా? అన్న విషయాన్ని వెల్లడించలేదు. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షాలతో గవర్నర్ త్రిపాఠి సమావేశమై రాష్ట్రంలో తాజా పరిస్థితిపై చర్చించారు. ఈ భేటీలో రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించే అంశం చర్చకు రాలేదని త్రిపాఠి తెలిపారు. ఇదిలా ఉండగా, తమ కార్యకర్తల హత్యలను నిరసిస్తూ బీజేపీ బుధవారం నిర్వహించిన ప్రదర్శన కూడా హింసాత్మకమైంది. బీజేపీ నేతలు ముకుల్ రాయ్, రాజు బెనర్జీలకు గాయాలయ్యాయి. కోల్‌కతాలోని బౌబజార్‌లో జరిగిన ఈ ప్రదర్శనలో కొత్తగా ఎన్నికైన 18 మంది బీజేపీ ఎంపీలు కూడా పాల్గొన్నారు. బీజేపీ కార్యకర్తలు రాళ్లు, బాటిళ్లు విసిరారని పోలీసులు ఆరోపించారు. దీంతో టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లు ప్రయోగించామన్నారు. అయితే తాము రాళ్లు, బాటిళ్లు విసరలేదని బీజేపీ శ్రేణులు పేర్కొన్నాయి. రాష్ట్రంలో హింసను నిరసిస్తూ బౌ బజార్ సెంట్రల్ ఎవెన్యూ పరిధిలోని విల్లింగ్‌టన్ ఏర్పియా ప్రాంతంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాశ్ విజయవర్గీయ, బెంగాల్ శాఖ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ ధర్నా చేశారు.

దూసుకొస్తున్న 'వాయు'



నేటి మధ్యాహ్నం తీరాన్ని దాటే అవకాశం

ముంపు ప్రాంతాల నుంచి 3 లక్షల మందిని తరలించిన గుజరాత్ సర్కార్

కోస్తా జిల్లాల్లో రైళ్లు, విమానాలు, బస్సులు రద్దు

సహాయ చర్యల్లో పాల్గొనేందుకు సైన్యం, నౌకాదళం, కోస్ట్‌గార్డులు సిద్ధం

తుఫాన్ నేపథ్యంలో గుజరాత్‌లోని వెరావల్ తీరంలో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అలలు

ముంబై/అహ్మదాబాద్: అరేబియా సముద్రంలో ఏర్పడిన 'వాయు' తుఫాన్ క్రమంగా బలపడుతూ గుజరాత్ తీరం దిశగా కదులుతున్నది. ఇప్పటికే పెనుతుఫాన్‌గా మారిన 'వాయు' వెరావల్ తీరానికి 280 కి.మీ. దూరంలో ఉన్నదని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. 'వాయు' కొద్దిగా తన దిశను మార్చుకున్నదని, దీంతో అది గురువారం మధ్యాహ్నం దక్షిణాన ఉన్న వెరావల్ నుంచి పశ్చిమాన ఉన్న ద్వారక మధ్య ఎక్కడైనా తీరాన్ని దాటవచ్చని పేర్కొంది. తీరాన్ని తాకే సమయానికి వాయు మరింత ఉద్ధృత రూపం దాల్చవచ్చని భావిస్తున్నారు. ఆ సమయంలో గంటకు 155 కి.మీ నుంచి 165 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని ఐఎండీ తెలిపింది. అంతేకాకుండా కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడవచ్చని, కొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురియవచ్చని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కోస్తాలోని పది జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించిన గుజరాత్ ప్రభుత్వం, నష్టాన్ని గరిష్ఠంగా తగ్గించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ముంపు ప్రమాదం పొంచి ఉన్న సౌరాష్ట్ర, కచ్‌లోని లోతట్టు ప్రాంతాలకు చెందిన సుమారు 3 లక్షల మందిని తరలించడం ప్రారంభించింది. ప్రజలకు లౌడ్‌స్పీకర్లు, ఎస్ఎంఎస్‌ల ద్వారా తుఫాన్ హెచ్చరికలను జారీ చేస్తున్నది. ఈ పది జిల్లాల్లోని స్కూళ్లు, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ నెల 12, 13 తేదీల్లో సెలవు ప్రకటించారు. తుఫాన్ కారణంగా కనీసం 400 గ్రామాలు ముంపునకు గురికాచ్చని భావిస్తున్నారు. సహాయక చర్యల నిమిత్తం జాతీయ విపత్తు సహాయ దళం (ఎన్డీఆర్ఎఫ్)కు చెందిన 52 బృందాలను (ఒక్కో బృందంలో 45మంది) రాష్ట్రానికి తరలించారు.

నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు బంద్

తుఫాన్ కారణంగా ప్రభావితమయ్యే జిల్లాల మీదుగా వెళ్లే రైళ్లను రద్దు చేయాలని పశ్చిమ రైల్వే నిర్ణయించింది. 70 రైళ్లను రద్దు చేయగా, మరో 28 రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. అలాగే ముందు జాగ్రత్త చర్యగా గుజరాత్ తీరంలోని అన్ని నౌకాశ్రయాలు, విమానాశ్రయాల్లో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో అహ్మదాబాద్ నుంచి పోర్‌బందర్, డయ్యూ, కాండ్లా, ముంద్రా, భావ్‌నగర్ వెళ్లే అన్ని విమానాలను రద్దు చేశారు. ఆ ప్రాంతంలోని యాత్రా స్థలాలకు వెళ్లే బస్సులను కూడా నిలిపివేస్తున్నట్టు సీఎం తెలిపారు. సహాయ, పునరావాస చర్యల్లో పాల్గొనేందుకు పశ్చిమ నావల్ కమాండ్ తన నౌకలను, విమానాలను, హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచిందని భారత నౌకా దళం తెలిపింది.

మహారాష్ట్రలోనూ ఈదురుగాలులు

'వాయు' తుఫాన్ ప్రభావంతో ఇప్పటికే ముంబైతోపాటు మహారాష్ట్రలోని తీర ప్రాంతాలలో బుధవారం ఉదయం చల్లటి ఈదురుగాలులు వీచాయి. గురువారం ఉదయానికి ఈదురుగాలుల వేగం గంటకు 145 కి.మీ. నుంచి 170 కి.మీ. వరకు పెరుగవచ్చని ఐఎండీ తెలిపింది. తుఫాన్ కారణంగా అరేబియా సముద్రం అల్లకల్లోలంగా మారగా, పెద్ద పెద్ద అలలు తీరాన్ని తాకుతున్నాయి. దీంతో సింధుర్గ్ జిల్లాలోని దేవ్‌బాగ్ గ్రామం నీట మునిగింది.

అధికారులకు ప్రజలు సహకరించాలి: ప్రధాని

వాయు తుఫాన్ ముప్పు ముంచుకొస్తున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రజలు స్థానిక అధికారులకు సహకరిస్తూ, వారు ఇచ్చే సూచనలను పాటించాలని ప్రధాని నరేంద్రమోదీ విజ్ఞప్తి చేశారు. తుఫాన్ వల్ల ప్రభావితమయ్యే ప్రజలందరూ సురక్షితంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్టు ఆయన ట్వీట్ చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో జరిగే చర్యల్లో పాల్గొనాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఒడిశా సాయం కోరిన గుజరాత్

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో తాము సాయమందించగలమని ఒడిశా ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. తుఫాన్ ప్రభావాన్ని యుద్ధ ప్రాతిపదికన ఎదుర్కొనడానికి సలహాలివ్వాలని గుజరాత్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జేఎన్ సింగ్ తన ఒడిశా సహచరుడు ఏపీ పాడీకి ఫోన్ చేసి కోరారు. ఫొని తుఫాన్‌ను విజయవంతంగా ఎదుర్కొన్న ఒడిశా సర్కార్ భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. దాదాపు 15 లక్షల మందిని ఖాళీ చేయించడం ద్వారా ఒడిశా ప్రభుత్వం రికార్డు సృష్టించింది. రాష్ట్రంలో అవసరమైతే సహాయ చర్యల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉండాలని సైన్యం, నౌకాదళం, వాయుసేన, కోస్ట్‌గార్డులను అధికారులు ఆదేశించారు.

ఐఎస్ తమిళనాడు శాఖ నాయకుడు

అజారుద్దీన్ అరెస్ట్

శ్రీలంక ఈస్టర్ దాడుల సూత్రధారి జహ్రాన్ హషీంకు స్నేహితుడు

న్యూఢిల్లీ: శ్రీలంక ఈస్టర్ దాడులకు, ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) అనుబంధ సంస్థలకు సంబంధం ఉన్న కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తమిళనాడులోని కోయంబత్తూర్‌తోపాటు ఏడుచోట్ల తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఐఎస్ తమిళనాడు శాఖ నాయకుడు మహమ్మద్ అజారుద్దీన్‌ను ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు. శ్రీలంక ఈస్టర్ పేలుళ్ల సూత్రధారి జహ్రాన్ హషీంకు ఇతడు ఫేస్‌బుక్ ద్వారా పరిచయమయ్యాడు. కోయంబత్తూర్‌లోని అన్నునగర్, పొడనూర్, కునియా ముథూర్‌లతోపాటు మిగతా ప్రదేశాల్లో జరిగిన తనిఖీల సందర్భంగ

పాయింట్ల పట్టిక

స్థానం	జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే.	ర.రే	పా
1.	న్యూజిలాండ్	3	3	0	0	+2.16	6
2.	ఆస్ట్రేలియా	4	3	1	0	+0.57	6
3.	ఇంగ్లండ్	3	2	1	0	+1.30	4
4.	భారత్	2	2	0	0	+0.53	4
5.	శ్రీలంక	4	1	1	2	-1.51	4
6.	వెస్టిండీస్	3	1	1	1	+2.05	3
7.	బంగ్లాదేశ్	4	1	2	1	-0.71	3
8.	పాకిస్థాన్	4	1	2	1	-1.79	3
9.	దక్షిణాఫ్రికా	4	0	3	1	-0.95	1
10.	ఆఫ్ఘనిస్థాన్	3	0	3	0	-1.49	0

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ ర.రేరేట్, పా-పాయింట్లు,

వరల్డ్‌కప్‌లో నేడు | భారత్ X న్యూజిలాండ్ - 3 గం. | స్టార్ స్పోర్ట్స్‌లో

అత్యధిక పరుగులు: 260 షకీబ్ (బంగ్లాదేశ్)

అత్యధిక వికెట్లు: 10 ఆమిర్ (పాకిస్థాన్)

వార్నర్ (107)

ఆసీస్ సమిష్టిగా

డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా గెలుపు బాట పట్టింది. భారత్ చేతిలో ఓటమితో కంగుతిన్న కంగారూలు.. పాకిస్థాన్‌పై తమ గెలుపు పరంపరను దిగ్విజయంగా కొనసాగించారు. వరుణుడు అంతరాయం కల్గిస్తాడన్న అంచనాలను పటాపంచలు చేస్తూ సాఫీగా సాగిన మ్యాచ్‌లో ఆసీస్ సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. వార్నర్ సూపర్ సెంచరీకి తోడు ఫించ్ కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో గౌరవప్రదమైన స్కోరును అందుకున్న ఆసీస్..పాక్‌ను పక్కా ప్రణాళికతో పడగొట్టింది. పేస్ త్రయం కమ్మిన్స్, స్టార్క్, రిచర్డ్‌సన్ ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన పాక్ కడదాకా పోరాడినా విజయతీరాలను చేరుకోలేకపోయింది. ఈ గెలుపుతో ఆరు పాయింట్లతో ఆసీస్ రెండో స్థానానికి ఎగబాకింది.

వార్నర్ సూపర్ సెంచరీ

కమ్మిన్స్, స్టార్క్, రిచర్డ్‌సన్ విజృంభణ

పాకిస్థాన్‌పై విజయం

టాంటన్: వర్షం కారణంగా వరుసగా రెండు మ్యాచ్‌లు పూర్తిగా రద్దయిన ప్రపంచకప్‌లో ఎట్టకేలకు ఆస్ట్రేలియా, పాకిస్థాన్ మ్యాచ్ అభిమానులను అలరించింది. బుధవారం ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన పాక్‌తో మ్యాచ్‌లో ఆసీస్ 41 పరుగుల తేడాతో విజయం సాధించింది. కంగారూలు నిర్దేశించిన 308 పరుగుల లక్ష్యఛేదనలో పాక్ 45.4 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. కమ్మిన్స్(3/33), స్టార్క్(2/43), రిచర్డ్‌సన్ (2/62) ధాటికి ఇమాముల్ హక్(53), హఫీజ్(46), వహబ్ రియాజ్(45), సర్ఫరాజ్ అహ్మద్(40) మినహా మిగతావారు తేలిపోయారు. తొలుత డేవిడ్ వార్నర్(111 బంతుల్లో 107, 11 ఫోర్లు, సిక్స్) సూపర్ సెంచరీకి తోడు ఫించ్(84 బంతుల్లో 82, 6 ఫోర్లు, 4సిక్స్‌లు) రాణించడంతో ఆసీస్ 49 ఓవర్లలో 307 పరుగులు చేసింది. మహ్మద్ ఆమిర్ (5/30) ఐదు వికెట్లతో అదరగొట్టాడు. సెంచరీతో జట్టుకు భారీ స్కోరు అందించిన వార్నర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ఆమిర్ (5/30)

వార్నర్ సూపర్:
తొలుత టాస్ గెలిచిన పాక్..ఆస్ట్రేలియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. విధ్వంసక ఓపెనింగ్ ద్వయం వార్నర్, ఫించ్ ఆది నుంచే పాక్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేశారు. దీంతో తొలి పవర్ ప్లే ముగిసే సరికి ఆసీస్ వికెట్ కోల్పోకుండా 56 పరుగులు చేసింది. 26 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఆసిఫ్ అలీ క్యాచ్ జారవిడువడంతో బయటపడ్డ ఫించ్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. వార్నర్‌ను అండగా చేసుకుంటూ పాక్ బౌలర్లను ఉతికి ఆరేశాడు. హఫీజ్ ఇన్నింగ్స్ 17వ ఓవర్లో రెండు ఫోర్లు, ఓ భారీ సిక్స్‌తో విరుచుకుపడ్డ ఫించ్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. సాఫీగా సాగుతున్న ఇన్నింగ్స్‌లో ఫించ్‌ను ఔట్ చేయడం ద్వారా ఆమిర్ పాక్‌ను పోటీలోకి తీసుకొచ్చాడు. దీంతో తొలి వికెట్‌కు 146 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత స్మిత్(10), మ్యాక్స్‌వెల్(20), మార్ష్(23), ఖవాజ(18), క్యారీ(20) స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరుచలేకపోయారు. ఇదే అదునుగా పాక్ బౌలర్లు రెచ్చిపోవడంతో ఆసీస్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. సహచరులు నిష్క్రమిస్తున్నా..వెనుకకు తగ్గని వార్నర్ సూపర్ సెంచరీతో మైదానంలో అభివాదంతో అలరించాడు. వార్నర్ దూకుడు చూస్తే ఓ దశలో 350 స్కోరు అందుకుందనుకున్న ఆసీస్.. వికెట్లు కోల్పోవడంతో అనుకున్న స్కోరు చేరుకోలేకపోయింది.

పాక్ పడుతూ లేస్తూ:
నిర్దేశిత లక్ష్యఛేదనకు దిగిన పాక్‌కు ఆదిలోనే ఫఖర్ జమాన్(0) రూపంలో ఎదురు దెబ్బ తగిలింది. ఇమాముల్ హక్, బాబర్ ఆజమ్(30) నిలదొక్కుకునేందుకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. 24 పరుగుల తేడాతో నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సర్ఫరాజ్(40) ఆఖరి వరుస బ్యాట్స్‌మెన్ హసన్ అలీ(32), వహబ్ రియాజ్(45)తో జట్టును గెలిపించేందుకు చేసిన ప్రయత్నం నెరవేరలేదు.

స్కోరు బోర్డు

ఆస్ట్రేలియా: ఫించ్(సి)హఫీజ్(బి)ఆమిర్ 82, వార్నర్(సి)ఇమాముల్(బి)అఫ్రిదీ 107, స్మిత్(సి)అలీ(బి)హఫీజ్ 10, మ్యాక్స్‌వెల్(బి)అఫ్రిదీ 20, మార్ష్(సి) షోయబ్(బి)ఆమిర్ 23, ఖవాజ(సి)రియాజ్(బి)ఆమిర్ 18, క్యారీ(ఎల్బీ)ఆమిర్ 20, కౌల్టర్‌నైల్(సి)సర్ఫరాజ్(బి)రియాజ్ 2, కమ్మిన్స్(సి)సర్ఫరాజ్(బి)హసన్ అలీ 2, స్టార్క్(సి)షోయబ్ మాలిక్(బి)ఆమిర్ 3, రిచర్డ్‌సన్ 1 నాటౌట్;
ఎక్స్‌ట్రాలు: 19; **మొత్తం:** 49 ఓవర్లలో 307 ఆలౌట్; **వికెట్ల పతనం:** 1-146, 2-189, 3-223, 4-242, 5-277, 6-288, 7-299, 8-302, 9-304, 10-307;
బౌలింగ్: ఆమిర్ 10-2-30-5, ఆఫ్రిదీ 10-0-70-2, హసన్ అలీ 10-0-67-1, రియాజ్ 8-0-44-1, హఫీజ్ 7-0-60-1, మాలిక్ 4-0-26-0.
పాకిస్థాన్: ఇమాముల్(సి)క్యారీ(బి)కమ్మిన్స్ 53, ఫఖర్ జమాన్(సి)రిచర్డ్‌సన్(బి)కమ్మిన్స్ 0, ఆజమ్(సి)రిచర్డ్‌సన్(బి)కౌల్టర్‌నైల్ 30, హఫీజ్(సి)స్టార్క్(బి)ఫించ్ 46, సర్ఫరాజ్ రనౌట్ 40, షోయబ్ మాలిక్(సి)క్యారీ(బి)కమ్మిన్స్ 0, ఆసిఫ్ అలీ(సి)క్యారీ(బి)రిచర్డ్‌సన్ 5, హసన్ అలీ(సి)ఖవాజ(బి)రిచర్డ్‌సన్ 32, రియాజ్(సి)క్యారీ(బి)స్టార్క్ 45, ఆమిర్(బి)స్టార్క్ 0, అఫ్రిదీ 1 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 14; **మొత్తం:** 45.4 ఓవర్లలో 266 ఆలౌట్; **వికెట్ల పతనం:** 1-2, 2-56, 3-136, 4-146, 5-147, 6-160, 7-200, 8-264, 9-265, 10-266; **బౌలింగ్:** కమ్మిన్స్ 10-0-33-3, స్టార్క్ 9-1-43-2, రిచర్డ్‌సన్ 8.4-0-62-2, కౌల్టర్‌నైల్ 9-0-53-1, మ్యాక్స్‌వెల్ 7-0-58-0, ఫించ్ 2-0-13-1.

జోరు సాగనీ..

హ్యాట్రిక్‌పై భారత్ గురి.. నేడు న్యూజిలాండ్‌తో ఢీ

ఓపెనర్‌గా రాహుల్.. నాలుగో స్థానంపై ఉత్కంఠ

ప్రపంచకప్‌లో బిగ్‌ఫైట్‌కు బ్యాటింగ్‌కు స్వర్గధామమైన ట్రెంట్‌బ్రిడ్జ్ మైదానం సిద్ధమైంది. బౌలింగ్‌ను చీల్చిచెండాడగల బ్యాట్స్‌మెన్‌తో కూడిన భారత్... భీకరమైన పేస్ బౌలర్లు ఉన్న కివీస్ నేడు తలపడనున్నాయి. వన్డేల్లో అత్యధిక పరుగుల రికార్డు నమోదైన పిచ్‌పై తాడోపేడో తేల్చుకోనున్నాయి. భారత్ ఓవైపు బ్యాటింగ్ మెరుపులతో జైత్రయాత్ర కొనసాగిస్తుంటే.. పేస్ బౌలింగ్ బలంతో ఎదురైన జట్లను చిత్తు చేస్తూ కివీస్ విజయాల పరంపర సాగిస్తున్నది. బ్యాటింగ్, బౌలింగ్ అన్ని విభాగాల్లో పటిష్ఠంగా ఉన్న టీమ్‌ఇండియా ఇప్పటికే దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా లాంటి పెద్ద జట్లను ఓడించి కొండంత విశ్వాసంతో ఉంటే.. శ్రీలంక, ఆఫ్ఘన్, బంగ్లా లాంటి జట్లపై కివీస్ గెలిచింది. గాయం కారణంగా జట్టుకు ధవన్ దూరం కావడం ఎదురుదెబ్బే అయినా రోహిత్ ఫామ్‌లో ఉండటం భారత్‌కు సానుకూలాంశం. అలాగే స్వింగ్‌కు అనుకూలించే పిచ్‌పై భువనేశ్వర్, బుమ్రా చెలరేగితే ఇక టీమ్‌ఇండియాకు తిరుగుండదు. వరుణుడు అంతరాయం కల్గించే అవకాశమున్న మ్యాచ్‌లో పైచేయి ఎవరిదవుతుందన్నది నేడు తేలనుంది.

నాటింగ్‌హామ్:

ప్రపంచకప్‌లో రెండు అజేయ జట్ల మధ్య పోరు జరగనుంది. మూడు మ్యాచ్‌లు గెలిచి అగ్రస్థానంలో ఉన్న న్యూజిలాండ్‌ను రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన టీమ్‌ఇండియా గురువారం ఢీకొననుంది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాలపై విజయాలతో సత్తా చాటిన భారత్.. కివీస్‌ను ఎదుర్కొనేందుకు అన్ని విధాల సన్నద్ధమైంది. వామప్ మ్యాచ్ లో ఓటమికి కసి తీర్చుకోవాలని పట్టుదలగా ఉంది. ముఖ్యంగా బ్యాటింగ్‌లో మెరిపిస్తున్న టీమ్‌ఇండియా... ఆసీస్‌తో మ్యాచ్‌లో ఏకంగా 352 పరుగులు చేసింది. ఓపెనర్లు రాణించడంతో రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్‌కు ఎదురే లేకుండా పోయింది. మొదటి మ్యాచ్‌లో రోహిత్ శర్మ బ్యాట్ ఝుళిపించగా.. రెండో మ్యాచ్‌లో శిఖర్ ధవన్ విశ్వరూపం చూపడంతో సునాయాస విజయాలను ఖాతాలో వేసుకుంది. అయితే గాయం కారణంగా శిఖర్ ఈ మ్యాచ్‌కు దూరమవడం జట్టుకు అసలైన సవాల్‌గా మారింది. మరోవైపు పేసర్ల విజృంభణతో మూడు మ్యాచ్‌ల్లో గెలిచి న్యూజిలాండ్ ఊపు మీద ఉంది. ఇంత వరకు తమ కంటే తక్కువ ర్యాంక్ జట్లపైనే సత్తా చాటిన కివీస్.. భారత్‌తో సమరానికి సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది.

హ్యాట్రిక్‌పై గురి
తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత బ్యాట్స్‌మెన్.. ముఖ్యంగా ఓపెనర్లు సత్తా చాటారు. దక్షిణాఫ్రికాపై బాధ్యతాయుతంగా రోహిత్ శతకం బాదగా... ఆస్ట్రేలియాపై ధవన్ వీరవిహారం చేసి సెంచరీ చేశాడు. తొలి మ్యాచ్‌లో తొందరగానే ఔటైన కెప్టెన్ కోహ్లీ రెండో పోరులో ఆసీస్‌పై 82 పరుగులతో కదంతొక్కాడు. ఇక బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో ధోనీ, మెరుపులతో పాండ్య జోరుమీదున్నారు. ఇక ఈ మ్యాచ్‌కు ధవన్ దూరం కావడంతో కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా రానున్నాడు. హెన్రీ, బౌల్ట్, ఫెర్గూసన్, నీషమ్‌లతో కూడిన పటిష్ఠమైన పేస్ అటాక్ కలిగిన కివీస్‌ను ఎదుర్కోవాలంటే ఓపెనర్లు సత్తా చాటడం ఎంతో కీలకం. తొలి పది ఓవర్లు పిచ్ స్వింగ్‌కు సహకరించే అవకాశం ఉండడంతో ఆచితూచి ఆడాల్సిన అవసరం ఉంది. అలాగే కింగ్ కోహ్లీ రాణించడంతో పాటు నాలుగో స్థానంలో వచ్చే ఆటగాడు సత్తా చాటితేనే.. చివర్లో దూకుడుగా ఆడేందుకు ధోనీ, పాండ్యాలకు అవకాశం ఉంటుంది. అలాగే పేసర్లు బుమ్రా, భువనేశ్వర్ ఆసీస్‌తో మ్యాచ్‌లో ఫాంలోకి వచ్చారు. చెరో మూడు వికెట్లు తీసి ఆస్ట్రేలియాపై విజయంలో కీలక పాత్ర పోషించారు. అలాగే తొలి మ్యాచ్‌లో 4వికెట్లతో దక్షిణాఫ్రికాను లెగ్‌స్పిన్నర్ చాహల్ చావు దెబ్బ తీశాడు. భీకరమైన హిట్టర్లతో కూడిన కివీస్‌కు కళ్లెం వేయాలంటే భారత బౌలర్లు సమిష్టిగా రాణించాలి.

ధవన్‌కు గాయం.. '4'పై మళ్లీ సందిగ్ధం
గాయం వల్ల శిఖర్ ధవన్ మూడు మ్యాచ్‌లకు దూరం కావడంతో మొత్తం జట్టు కూర్పుపైనే ప్రభావం పడింది. నాలుగో స్థానంలో కుదురుకున్న కేఎల్ రాహుల్... ధవన్‌కు బదులుగా ఓపెనర్‌గా రానున్నాడు. దీంతో ఎంతో కాలంగా టీమ్‌ఇండియాను వేధిస్తున్న నాలుగు సమస్య మళ్లీ తలెత్తింది. ఆ స్థానంలో ఎవరిని తీసుకోవాలనే దానిపై తీవ్ర సమాలోచనలు నడుస్తున్నాయి. దినేష్ కార్తీక్...విజయ్ శంకర్‌లలో ఎవరిని తీసుకుంటారనేది అనేది ఆసక్తికరంగా మారింది. పిచ్ పరిస్థితులకు అనుగుణంగా బౌలింగ్ కూడా చేయగలిగే శంకర్‌ను తీసుకుంటారా.. స్పెషలిస్టు బ్యాట్స్‌మన్ ఖాతాలో దినేశ్ కార్తీక్‌కు అవకాశం కల్పిస్తారో చూడాలి.

ప్రపంచ కప్‌లో..

ఆడిన మ్యాచ్‌లు	7
భారత్ గెలిచినవి	3
న్యూజిలాండ్ గెలిచినవి	4

పిచ్

గాలులతో వాతావరణం చల్లగా ఉండడం వల్ల పిచ్ పేస్ బౌలర్లకు సహకరించే అవకాశం ఎక్కువ. బౌండరీల దూరం తక్కువగా ఉండడంతో భారీ స్కోరు నమోదు కావొచ్చు. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశాలే ఎక్కువగా ఉంటాయి. మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశం ఉంది. ఇప్పటికే టోర్నీలో మూడు మ్యాచ్‌లు వర్షార్పణం కాగా.. ఈ మ్యాచ్‌పైనా వరుణుడు ఓ కన్నేసి ఉంచాడు.

కివీస్‌కు అసలైన సవాల్

టోర్నీలో ఇప్పటి వరకు శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌తో ఆడి అన్నింట్లో విజయం సాధించిన న్యూజిలాండ్.. భారత్ రూపంలో అసలైన సవాల్‌ను ఎదుర్కొనుంది. మూడు మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టిన బౌలర్లు బలమైన జట్టు ఎదురైతే ఎంత ప్రభావం చూపగలుగుతారో ఈ మ్యాచ్‌తో తేలిపోనుంది. అలాగే నాణ్యమైన స్పిన్, పేస్ బౌలింగ్‌ను కివీస్ బ్యాట్స్‌మెన్ ఏ విధంగా ఎదుర్కొంటారో చూడాలి. గప్టిల్, మున్రోలతో కివీస్ ఓపెనింగ్ పటిష్ఠంగా ఉంది. శ్రీలంకపై స్వల్ప లక్ష్యాన్ని వారిద్దరే ఛేదించేశారు. మరోవైపు కెప్టెన్ విలియమ్సన్ ఆఫ్ఘనిస్థాన్‌పై మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడడం... బంగ్లాపై సీనియర్ ఆటగాడు రాస్ టేలర్ బాధ్యతాయుతంగా పరుగులు చేయడం కివీస్‌కు కలిసొచ్చే అంశం. లోయర్ ఆర్డర్‌లో వికెట్ కీపర్ లాథమ్, నీషమ్, ఆల్‌రౌండర్ గ్రాండ్‌హోమ్ లాంటి హిట్టర్లు ఉండడం కివీస్‌కు అదనపు బలం. అయితే, చాహల్, కుల్‌దీప్ రూపంలో న్యూజిలాండ్‌కు పెద్ద ప్రమాదం ఉంది. కివీస్ బ్యాట్స్‌మెన్ మరి ఈ స్పిన్ ద్వయాన్ని ఎలా ఎదుర్కొంటుందన్నది ఆసక్తికరం. అలాగే బుమ్రా నుంచి పరుగులు రాబట్టడం కివీస్‌కు పెద్దపరీక్షే.

షమీ వస్తాడా..
పిచ్, వాతావరణ పరిస్థితుల కారణంగా పేసర్ మహ్మద్ షమీని తుది జట్టులోకి తీసుకోవాలనే యోచనలో టీమ్‌ఇండియా యాజమాన్యం ఉన్నట్టు సమాచారం. చాహల్, కుల్‌దీప్‌లో ఎవరో ఒకరి స్థానంలో ఈ స్పీడ్‌స్టర్‌ను తీసుకొచ్చే అవకాశం ఉంది. అలాగే పరిస్థితుల కారణంగా విజయ్ శంకర్, కార్తీక్ ఇద్దరినీ జట్టులోకి తీసుకోవాల్సి వస్తే.. కేదార్ జాదవ్‌ను కూడా పక్కనపెట్టే అవకాశం ఉంది.

జట్లు(అంచనా)

భారత్ : రోహిత్, రాహుల్, కోహ్లీ(కెప్టెన్), కార్తీక్/ శంకర్, ధోనీ(వికెట్ కీపర్), జాదవ్, హార్దిక్ , భువనేశ్వర్, కుల్దీప్ యాదవ్, చాహల్/ షమీ, బుమ్రా

న్యూజిలాండ్: గప్టిల్, మున్రో/నికోలస్, విలియమ్సన్(కెప్టెన్), రాస్ టేలర్, టామ్ లాథమ్(వికెట్ కీపర్), జేమ్స్ నీషమ్, మిచెల్ సాంట్నర్, గ్రాండ్‌హోమ్, టిమ్ సౌథీ/హెన్రీ, ఫెర్గూసన్, ట్రెంట్ బౌల్ట్

57

వన్డేల్లో 11 వేల పరుగుల మైలురాయిను చేరుకునేందుకు విరాట్ కోహ్లీ మరో 57 పరుగుల దూరంలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో ఆ ఫీట్ సాధిస్తే.. అతి తక్కువ మ్యాచ్‌ల్లో ఈ మార్క్ చేరుకున్న ఆటగాడిగా సచిన్ (276)ను అధిగమిస్తాడు.

ఒలింపిక్స్‌కు భారత ఆర్చరీ జట్టు

డెన్ బాష్ (నెదర్లాండ్స్): ప్రపంచ చాంపియన్‌షిప్ క్వార్టర్ ఫైనల్‌లోకి దూసుకెళ్లడం ద్వారా భారత పురుషుల ఆర్చరీ జట్టు.. 2020లో టోక్యోలో జరిగే ఒలింపిక్స్‌లో చోటు దక్కించుకుంది. చాంపియన్‌షిప్‌లో భాగంగా బుధవారమిక్కడ జరిగిన మ్యాచ్‌లో తనూదీప్ రాయ్, అతనూ దాస్, ప్రవీణ్ జాదవ్‌లతో కూడిన జట్టు 5-3తో కెనడాపై విజయం సాధించి విశ్వక్రీడలకు అర్హత సాధించింది. 2012 లండన్ ఒలింపిక్స్ తర్వాత ఆర్చరీ పురుషుల జట్టుకు విశ్వక్రీడల్లో చోటుదక్కడం ఇదే తొలిసారి. బొంబేలా, కోమాలిక, దీపికా కుమారిలతో కూడిన మహిళల ఆర్చరీ జట్టుకు నిరాశ ఎదురైంది.

శాస్త్రి అండ్‌కో కాంట్రాక్టు గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ రవిశాస్త్రితో సహా బ్యాటింగ్ కోచ్ బంగర్, బౌలింగ్ కోచ్ అరుణ్‌లతో కూడిన సహాయ సిబ్బంది కాంట్రాక్టు గడువు ప్రపంచకప్‌తో ముగియనుండగా.. మరో 45 రోజుల పాటు పొడిగిస్తూ వినోద్ రాయ్ నేతృత్వంలోని బీసీసీఐ పరిపాలనా కమిటీ(సీవోఏ) నిర్ణయం తీసుకున్నది. కొన్ని చర్చల తర్వాత కాంట్రాక్టులను అడ్‌హక్ ఆధారంగా పొడిగించాలని సీవోఏ నిర్ణయం తీసుకుందని బీసీసీఐ పేర్కొన్నది.

టీవీ ప్రకటనలపై సానియా ఆగ్రహం

న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో భాగంగా భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ జరుగనున్న నేపథ్యంలో టీవీల్లో వస్తున్న ప్రకటనలపై టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మండిపడింది. ఇరు దేశాల మధ్య జరిగే మ్యాచ్‌ను.. మ్యాచ్‌లానే చూడాలంటూ సూచించింది. 'సరిహద్దులకు ఇరువైపులా చిరాకు తెప్పించే ప్రకటనలు వస్తున్నాయి. సీరియస్‌గా చెబుతున్నా... చెత్త పనులతో మ్యాచ్‌కు మరింత ప్రచారం చేయాల్సిన అవసరమే లేదు. ప్రజలు ఇప్పటికే ఈ మ్యాచ్ కోసం ఆసక్తిగా, శ్రద్ధతో ఎదురుచూస్తున్నారు. ఇది క్రికెట్ మాత్రమే. అంతకన్నా ఎక్కువని అనుకుంటే.. మీకు స్వీయ నియంత్రణ అవసరమని గ్రహించండి. అవసరమైన విషయాలపైనే దృష్టి పెట్టండి' అని సానియా మీర్జా ట్వీట్ చేసింది. ఈనెల 16న భారత్-పాక్ మ్యాచ్ జరుగనున్న నేపథ్యంలో పాకిస్థాన్‌కు చెందిన జాజ్ అనే టీవీ చానెల్... భారత వాయుసేన వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ పరాక్రమాన్ని తక్కువ చేసేలా ఓ అభ్యంతకర ప్రకటనను ప్రసారం చేసింది. మరోవైపు ప్రపంచకప్ టోర్నీల్లో పాక్‌పై టీమ్‌ఇండియా ఆధిపత్యాన్ని గుర్తు చేస్తూ స్టార్ టీవీ ఓ యాడ్‌ను రూపొందించింది.

ధవన్‌కు స్టాండ్‌బైగా పంత్

నాటింగ్‌హామ్: గాయపడ్డ శిఖర్ ధవన్‌కు స్టాండ్‌బైగా యువ వికెట్‌కీపర్, బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. దీంతో మెగాటోర్నీకి వేదికైన ఇంగ్లండ్‌కు ఉన్నఫళంగా పంత్ బయల్దేరి వెళ్లనున్నాడు. అయితే ధవన్ గాయంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేనందున..ప్రధాన జట్టుతో కలిసి డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకునే అవకాశం రిషబ్‌కు లేదు. 'టీమ్ మేనేజ్‌మెంట్ సూచన మేరకు ధవన్‌కు స్టాండ్‌బైగా రిషబ్ పంత్..భారత్ నుంచి ఇంగ్లండ్‌కు రాబోతున్నాడు. ఆదివారం పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్ నాటికి జట్టుతో అతను కలువనున్నాడు. ధవన్‌పై తుది నిర్ణయం తీసుకునే వరకు పంత్‌ను ప్రత్యామ్నాయ ఆటగానిగా ఎంపిక చేయలేం. జట్టులో సభ్యుడు కానందువల్ల సహచరులతో కాకుండా ఖలీల్ అహ్మద్‌తో కలిసి వేరుగా ప్రయాణం చేస్తాడు. దీనికి తోడు మ్యాచ్ ఉన్న రోజు డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లే అవకాశం పంత్‌కు ఉండదు. ఐసీసీ అవినీతి నిరోధక నిబంధనల ప్రకారం ఎంపికైన ఆటగాళ్లు మాత్రమే జట్టు బస్సులో ప్రయాణించడంతో పాటు డ్రెస్సింగ్ రూమ్‌లోకి ప్రవేశానికి అర్హత ఉంటుంది. ధవన్ గాయాన్ని బీసీసీఐ వైద్య బృందం ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నది' అని బీసీసీఐ అధికారి అన్నాడు.

10-12 రోజుల్లో ధవన్‌పై తుది నిర్ణయం

బంగర్

నాటింగ్‌హామ్: భారత ఓపెనర్ శిఖర్ ధవన్ గాయంపై పది, పన్నెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకుంటామని బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ అన్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన గత మ్యాచ్‌లో కమ్మిన్స్ విసిరిన బంతి బలంగా తాకడంతో ధవన్ బొటన వేలికి గాయమైన సంగతి తెలిసిందే. వైద్య పరీక్షలో చిన్న చీలిక వచ్చినట్లు తేలడంతో ధవన్‌కు స్టాండ్‌బైగా వికెట్‌కీపర్, బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్‌కు అవకాశమొచ్చింది. అయితే న్యూజిలాండ్‌తో మ్యాచ్ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బంగర్..ధవన్ గాయంపై స్పందించాడు. 'శిఖర్ గాయాన్ని జాగ్రతగా పరిశీలిస్తున్నాం. మూడు నుంచి నాలుగు మ్యాచ్‌లకు అతను దూరమయ్యే అవకాశముంది. పది, పన్నెండు రోజుల్లో ధవన్ గాయంపై తుది నిర్ణయం తీసుకుంటాం. జట్టులో అత్యంత విలువైన ఆటగాడైన శిఖర్‌ను విడిచిపెట్టుకునేందుకు మేము సిద్ధంగా లేము. గాయంపై ఓ అంచనాకు వచ్చిన తర్వాత ప్రత్యామ్నాయం గురించి ఆలోచిస్తాం. ధవన్‌కు స్టాండ్‌బైగా రాబోతున్న రిషబ్ పంత్ జట్టుతో కలిసి ప్రాక్టీస్‌లో పాల్గొంటాడు' అని బంగర్ అన్నాడు.

సెన్సెక్స్	నిఫ్టీ
39,757	11,906
↘194	↘59

ముడి చమురు (బ్రెంట్) ↘60.42 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ (రూ.లలో)

24 క్యారెట్లు	33,570
22 క్యారెట్లు	33,400
వెండి (కిలో)	37,890

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	66.60	72.10
యూరో	75.50	83.50
బహ్రెయిన్ దినార్	175.00	189.00
కువైట్ దినార్	220.00	235.00
సౌదీ రియాల్	17.40	19.20
యూఏఈ దిర్హామ్	17.90	19.50

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	132.00
రిటైల్ లైవ్	154.00
డ్రెస్డ్	223.00
స్కిన్‌లెస్	254.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	370-00
రంగారెడ్డి	370-00
మెదక్	370-00
కరీంనగర్	373-00
వరంగల్	373-00
రిటైల్ ప్రైస్	4-30

రూ.2 లక్షల కోట్లపైనే

గత 11 ఏండ్లలో బ్యాంకులు మోసపోయిన మొత్తం..

ఐసీఐసీఐ, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీల్లోనే కేసులు ఎక్కువ

న్యూఢిల్లీ, జూన్ 12: గడిచిన 11 ఏండ్లలో దేశీయ బ్యాంకుల్లో చోటుచేసుకున్న 50 వేలకుపైగా మోసాల వల్ల కలిగిన నష్టం రూ.2 లక్షల కోట్లపైనేనని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తెలిపింది. 2008-09 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు మొత్తం 53,334 కేసులు నమోదయ్యాయని వెల్లడించింది. వీటి విలువ రూ.2 లక్షల 5,735.31 కోట్లని స్పష్టం చేసింది. మోసపోయిన బ్యాంకుల్లో ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ ఐసీఐసీఐ ముందుండగా, దీనికి చెందినవే 6,811 కేసులున్నాయన్న ఆర్బీఐ.. ఈ మోసాల విలువ రూ.5,033.81 కోట్లని ప్రకటించింది. అయితే కేసులపరంగా ఐసీఐసీఐ బ్యాంక్ ముందున్నా.. నష్టాలపరంగా మాత్రం పంజాబ్ నేషనల్ బ్యాంక్‌దే అగ్రస్థానం. 2,047 కేసుల్లో ఏకంగా రూ.28,700.74 కోట్లను చేజార్చుకున్నది. ఇక ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ గత 11 ఏండ్లలో 6,793 కేసుల్లో రూ.23,734.74 కోట్లను కోల్పోయింది. కేసులపరంగా రెండో స్థానంలో ఉండగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2,497 కేసులతో రూ.1,200.79 కోట్లతో మూడో స్థానంలో ఉన్నది. ఈ మేరకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద పీటీఐ ప్రతినిధి దాఖలు చేసిన పిటిషన్‌కు ఆర్బీఐ సమాధానమిచ్చింది. పలు విదేశీ బ్యాంకులు సైతం మోసపోవడం గమనార్హం. కాగా, ఈ నెల 3న పీటీఐకి ఈ సమాచారం అందగా, ఆ మరుసటి రోజే ఈ వ్యవహారంపై బీజేపీ సర్కారు 'శ్వేత పత్రం' విడుదల చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

ఆ ఐదింటి వాటా రూ.90 వేల కోట్లపైనే

మోసాల కారణంగా నష్టపోయిన బ్యాంకుల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులే ఎక్కువగా ఉన్నాయి. వీటిలో ఐదు బ్యాంకుల వాటా రూ.90 వేల కోట్లపైనే. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ), ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐవోబీ), బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ)ల వాటా రూ.90,401.34 కోట్లుగా ఉండటం గమనార్హం. అలాగే ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (రూ.5,598.23 కోట్లు), కెనరా బ్యాంక్ (రూ.5553.38 కోట్లు), యాక్సిస్ బ్యాంక్ (రూ. 5,301.69 కోట్లు)లూ చెప్పుకోదగ్గ స్థాయిలోనే మోసపోయాయి. మొత్తంగా చూసినట్లైతే ప్రైవేట్ రంగ బ్యాంకుల కంటే ప్రభుత్వ రంగ బ్యాంకులే ఎక్కువగా మోసపోయాయి. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2018-19)లోనే బ్యాంకుల ద్వారా అత్యధిక మోసాలు ప్రకటించబడ్డాయన్న ఆర్బీఐ.. మోసాల విలువ కూడా ఇదే ఏడాది ఎక్కువగా ఉందన్నది. రూ.71,542.93 కోట్ల నష్టం బ్యాంకులకు వాటిల్లిందని వివరించింది.

ప్రధాన బ్యాంకుల నష్టాలు (రూ.కోట్లలో)

క్ర.సం.	బ్యాంక్	కేసులు	నష్టం
1	పీఎన్‌బీ	2,047	28,700.74
2	ఎస్బీఐ	6,793	23,734.74
3	బీవోబీ	2,160	12,962.96
4	ఐవోబీ	1,115	12,644.70
5	బీవోఐ	1,872	12,358.20
6	యూనియన్	1,244	11,830.74
7	సెంట్రల్	1,613	9,041.98
8	యూకో	1,081	7,104.77
9	ఐడీబీఐ	1,264	5,978.96
10	సిండికేట్	1,783	5,830.85



ఆకాశమార్గాన 'ఆహార' డెలివరీ

డ్రోన్ల ద్వారా పరిశీలించిన జొమాటో

న్యూఢిల్లీ, జూన్ 12: ఆన్‌లైన్‌లో ఆహార పదార్థాలు అందించే జొమాటో..డ్రోన్ టెక్నాలజీ ద్వారా ఆహార పదార్థాలను సరఫరా చేయడానికి సిద్ధమైంది. ఇందుకోసం తొలిసారిగా నిర్వహించిన పరీక్ష విజయవంతమైనట్లు కంపెనీ పేర్కొంది. ఈ సేవలు అందించడానికి గత డిసెంబర్‌లో లక్నోకు చెందిన ప్రముఖ స్టార్టప్ టెక్‌ఈగల్ ఇన్నోవేషన్‌ను కొనుగోలు చేసింది. ఆర్థిక వివరాలు మాత్రం సంస్థ వెల్లడించలేదు. హైబ్రిడ్ డ్రోన్ల సహాయంతో ఐదు కిలోమీటర్ల మేర దూరంలో ఉన్న వినియోగదారుడికి 10 నిమిషాల్లో ఆహార పదార్థాలను అందించనున్నట్లు కంపెనీ వర్గాలు బుధవారం వెల్లడించాయి. గంటకు 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ డ్రోన్ ఐదు కిలోల బరువును అవలీలగా తీసుకుపోనున్నది. పౌర విమానయాన నియంత్రణ మండలి డీజీసీఏ పరిధిలోని ఒక నియంత్రణ ప్రాంతంలో ఈ పరీక్షను నిర్వహించింది. రోడ్డు మార్గం కన్నా ఆకాశ మార్గాన ఆహార పదార్థాలను మరింత వేగవంతంగా డెలివరీ చేయాలనే ఉద్దేశంతో ఈ నూతన సర్వీసులకు శ్రీకారం చుట్టినట్లు కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో దీపిందర్ గోయల్ తెలిపారు. దీనికి టెక్నాలజీ అంత సిద్ధంగా ఉన్నప్పటికీ నియంత్రణ మండళ్లు అనుమతించాల్సి ఉంటుందన్నారు. డ్రోన్లలో నిక్షిప్తం చేసిన సెన్సార్‌కు కంప్యూటర్ సెన్సార్‌తో అనుసంధానం చేయడం ద్వారా డెలివరీ చేసే ప్రాంతాన్ని ముందుగా గుర్తించి అందించడం జరుగుతుందన్నారు.

మాపై వచ్చిన పిటిషన్‌ను వెంటనే విచారించండి

సుప్రీంకు ఇండియాబుల్స్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూన్ 12: తమకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలంటూ ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఐహెచ్ఎఫ్ఎల్) బుధవారం సుప్రీం కోర్టును కోరింది. రూ.98,000 కోట్ల ప్రజాధనాన్ని సంస్థ దుర్వినియోగం చేసిందంటూ దాఖలైన ఈ పిటిషన్ సమాచారం.. మీడియాకు పొక్కడంతో మదుపరుల్లో ఆందోళన చెలరేగిందని, దీంతో గత రెండు రోజుల్లో సంస్థ మార్కెట్ విలువ ఏకంగా రూ.7,000 కోట్లు కరిగిపోయిందని అత్యున్నత న్యాయస్థానానికి ఇండియాబుల్స్ మొర పెట్టుకున్నది. వెంటనే సదరు పిటిషన్‌ను విచారించాలని సంస్థ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వీ జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ అజయ్ రస్తోగీల వెకేషన్ బెంచ్‌ను అభ్యర్థించారు. నిజానికి బ్లాక్‌మెయిల్ ఎత్తుగడలతో ఈ పిటిషన్‌ను దాఖలు చేశారని, ఇదం తా ఓ కుట్రగా పేర్కొన్న ఆయన అందులో ఉన్నవన్నీ పనికిమాలిన ఆరోపణలేనని వాదించారు. కాగా, పిటిషనర్ ఓ పాల వ్యాపారి అని, గత నెల 9న సంస్థకు చెందిన నాలుగు షేర్లను రూ.3 వేలతో కొనుగోలు చేశాడని సింఘ్వీ కోర్టుకు తెలిపారు. కాగా, ఐహెచ్ఎఫ్ఎల్ చైర్మన్ సమీర్ గెహ్లాట్, సంస్థ డైరెక్టర్లు తమ వ్యక్తిగత అవసరాల కోసం ప్రజాధనాన్ని మళ్లించారని, హరీశ్ ఫబియానీ అనే ఓ ఎన్నారై సాయంతో షెల్ కంపెనీలను సృష్టించి ఐహెచ్ఎఫ్ఎల్ నుంచి పెద్ద మొత్తంలో రుణాలను మంజూరు చేయించారని పిటిషనర్ తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ పిటిషన్‌ను జూలైలో విచారిస్తామని బెంచ్ తెలిపింది.

డైరెక్టర్లకు పరీక్షలు!

పాస్ కాకపోతే హోదాలుండవ్

న్యూఢిల్లీ, జూన్ 12: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. కార్పొరేట్ పాలనపై దృష్టి సారించారు. కార్పొరేట్ సంస్థల్లో వెలుగుచూస్తున్న వరుస మోసాల నడుమ.. కంపెనీ బోర్డుల్లోని స్వతంత్ర డైరెక్టర్లకు నియామకానికి ముందు పరీక్షలు పెట్టాలని యోచిస్తున్నారు. ఈ పరీక్షలు భారతీయ కంపెనీ చట్టం, విలువలు, క్యాపిటల్ మార్కెట్ల నియమ, నిబంధనలు ఇతరత్రా వాటిపై నిర్వహించే వీలుందని కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ తెలిపారు. స్వతంత్ర డైరెక్టర్లకు వారి విధులు, సంస్థ బోర్డులో తమ పాత్ర, బాధ్యతల గురించి అవగాహన తక్కువగా ఉంటున్నదని, అందుకే వారి ప్రాధాన్యతను తెలియజేయాల్సిన అవసరం ఉందని ఇటీవలి ఓ ఇంటర్వ్యూలో శ్రీనివాస్ అన్నారు. ఇక చాలా కార్పొరేట్ సంస్థల్లో స్వతంత్ర డైరెక్టర్లు నామమాత్రంగానే ఉంటుండటంతో అక్రమాలపై నిలదీసేవారే కరువయ్యారని ప్రభుత్వం అంటున్నది. ఈ క్రమంలోనే వీరికి పరీక్షలు నిర్వహించాలని చూస్తున్న కేంద్రం.. అవి పాసయ్యేంత వరకు డైరెక్టర్ హోదాల్లోకి వెళ్లకుండా చర్యలు చేపడుతున్నది. ఎన్నిసార్లైనా ఈ పరీక్షకు హాజరు కావచ్చని, ఉత్తీర్ణత మాత్రం తప్పనిసరి అని శ్రీనివాస్ తెలిపారు. కాగా, అనుభవం ఉన్న డైరెక్టర్లకు మినహాయింపు ఉందని, చాలా ఏండ్లుగా వివిధ బోర్డుల్లో పనిచేసినవారు ఈ పరీక్షలకు రావాల్సిన అవసరం లేదని చెప్పారు.

ఐడీబీఐ బ్యాంక్ వడ్డీరేట్ల తగ్గింపు

ముంబై, జూన్ 12: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీకి చెందిన ఐడీబీఐ బ్యాంక్ వడ్డీరేట్లను స్వల్పంగా తగ్గించింది. బుధవారం నుంచి అమలులోకి వచ్చేలా మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ను 5 నుంచి 10 బేసిస్ పాయింట్ల వరకు కోత విధించింది. దీంతో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ లేదా కనీస రుణ రేటు 8.95 శాతానికి తగ్గింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఆటో, వ్యక్తిగత, గృహ రుణాలు తీసుకున్న అత్యధిక మందికి ఊరట లభించినట్లు అయింది. వీటితోపాటు ఒక్కరోజు, నెల, ఆరు నెలల రుణాలపై వడ్డీరేటు వరుసగా 7.90 శాతం, 8.15 శాతం, 8.60 శాతానికి దిగొచ్చాయి.

నీరవ్ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన బ్రిటన్ హైకోర్టు

లండన్, జూన్ 12: నీరవ్ మోదీ బెయిల్ పిటిషన్ మరోసారి తిరస్కరణకు గురైంది. ఈసారి బ్రిటన్ హైకోర్టు నో చెప్పింది. వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్స్ కోర్టు అభిప్రాయంతో ఏకీభవించిన ఉన్నత న్యాయస్థానం.. బెయిల్ ఇవ్వలేమని బుధవారం నీరవ్ తరపు న్యాయవాదులకు స్పష్టం చేసింది. దీంతో నాలుగోసారీ నీరవ్‌కు నిరాశే ఎదురైంది. మూడుసార్లు వెస్ట్‌మినిస్టర్ కోర్టులో దరఖాస్తు చేసుకోగా, బెయిల్ దొరికితే పారిపోయే వీలుందన్న కోణంలో కోర్టు నిరాకరించింది. దీంతో హైకోర్టును ఆశ్రయించగా, అక్కడా ఇదే కారణంతో బెయిల్ పిటిషన్ ఫెయిలైంది. పీఎన్‌బీని రూ.14,000 కోట్లు ముంచిన కేసులో నీరవ్ ప్రధాన నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే.

పారిశ్రామికం అదుర్స్

ఏప్రిల్‌లో 3.4 శాతంగా నమోదు ■ ఆరు నెలల గరిష్ఠ స్థాయికి సూచీ

న్యూఢిల్లీ, జూన్ 12: గడిచిన కొన్ని నెలలుగా స్థబ్దుగా కొనసాగిన పారిశ్రామిక రంగం మళ్లీ పరుగుపెట్టింది. గనులు, ఇంధన రంగాలు మెరుగైన పనితీరు కనబర్చడంతో ఏప్రిల్ నెలకుగాను పారిశ్రామికం 3.4 శాతం వృద్ధిని సాధించింది. గడిచిన ఆరు నెలల్లో ఇదే గరిష్ఠ స్థాయి వృద్ధని కేంద్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 4.5 శాతం వృద్ధితో పోలిస్తే మాత్రం భారీగా పడిపోయింది. అక్టోబర్ 2018లో నమోదైన 8.4 శాతం వృద్ధి ఇప్పటి వరకు ఇదే గరిష్ఠం. గనుల రంగం అంచనాలకుమించి వృద్ధిని 5.1 శాతానికి చేరుకోవడం మొత్తం పారిశ్రామిక రంగం పరుగులు పెట్టడానికి దోహదపడింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో మైనింగ్ 3.8 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నాయి. ఇదే సమయంలో ఇంధన రంగం 6 శాతం వృద్ధి సాధించింది. అయినప్పటికీ తయారీ రంగంలో ఇంకా మందకొడి పరిస్థితుల్లోనే కొనసాగుతున్నది. ఏప్రిల్ నెలలో తయారీ రంగం 4.9 శాతం నుంచి 2.8 శాతానికి పడిపోయినట్లు కేంద్ర గణాంకాల శాఖ వెల్లడించింది. పెట్టుబడులకు గిటురాయి అయిన క్యాపిటల్ గూడ్స్ విభాగం నిరాశాజనక పనితీరు కనబరిచింది. ఏప్రిల్ 2018లో ఈ రంగం 9.8 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా..ప్రస్తుతం ఇది 2.5 శాతానికి పరిమితమైంది. వీటితోపాటు మౌలిక/నిర్మాణ వస్తువులు, కన్జ్యూమర్ డ్యూరబుల్, కన్జ్యూమర్ నాన్-డ్యూరబుల్ వార్షిక ప్రాతిపదికన తగ్గాయి. ఇదే సమయంలో ప్రాథమిక వస్తువుల రంగం మాత్రం 2.7 శాతం వృద్ధి నుంచి 5.2 శాతానికి ఎగబాకింది. రంగాలవారీగా చూస్తే 23 ఇండస్ట్రీ గ్రూపుల్లో 14 గ్రూపులు సానుకూల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. దుస్తుల రంగం అత్యధిక వృద్ధి 33.6 శాతంగా నమోదవగా, పేపర్ అండ్ పేపర్ ఉత్పత్తుల విభాగం -12.3 శాతానికి పడిపోగా, ఫ్యాబ్రిక్ మెటల్ ఉత్పత్తులు కూడా గత నెలలో -9.6 శాతానికి పడిపోయాయి.



ద్రవ్యోల్బణం బెదుర్స్

భగ్గుమన్న ఆహార పదార్థాల ధర ■ మేలో 3.05 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం

ఏడు నెలల గరిష్ఠ స్థాయికి చేరిన ధరల సూచీ

న్యూఢిల్లీ, జూన్ 12: ఆహార పదార్థాలు మళ్లీ భగ్గుమన్నాయి. కూరగాయలు, మాంసం, చేపలు మరింత ప్రియమవడంతో గడిచిన నెలకుగాను రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు ఏడు నెలల గరిష్ఠ స్థాయి 3.05 శాతానికి ఎగబాకాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 4.87 శాతంతో పోలిస్తే భారీగా తగ్గినప్పటికీ..ఇటీవల నమోదైన గణాంకాలతో పోలిస్తే మాత్రం భారీగా పెరిగిందని బుధవారం కేంద్ర గణాంకాల శాఖ(సీఎస్వో) విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. అయినప్పటికీ రిజర్వు బ్యాంక్ నిర్దేశించుకున్న నాలుగు శాతం కంటే తక్కువగా నమోదవడం విశేషం. అక్టోబర్ 2018లో 3.38 శాతంగా నమోదైంది. గడిచిన ఏడు నెలల్లో ఇదే గరిష్ఠ స్థాయి. కూరగాయల ధరల సూచీ 2.87 శాతం నుంచి 5.46 శాతానికి ఎగబాకగా, మాంసం-చేపల సూచీ 7.55 శాతం నుంచి 8.12 శాతానికి పెరిగినట్లు ఈ నివేదిక వెల్లడించింది. వీటితోపాటు తృణధాన్యాలు, ఇతర ఉత్పత్తుల ధరల సూచీ స్వల్పంగా పెరిగి 1.24 శాతానికి చేరుకున్నది. వరుసగా గడిచిన కొన్ని నెలలుగా తగ్గుతూ వచ్చిన పండ్ల ధరల సూచీ గత నెలలోనూ మరింత తగ్గింది. అంతకుముందు నెలలో -4.89 శాతంగా ఉన్న పండ్ల ధరల సూచీ గత నెలలో మరింత తగ్గి -5.17 శాతానికి చేరుకున్నది. చమురు, లైట్ విభాగ సూచీ 2.56 శాతం నుంచి 2.48 శాతానికి తగ్గింది. మొత్తంమీద ఆహార పదార్థాల సూచీ 1.10 శాతం నుంచి 1.83 శాతానికి పెరిగింది. అలాగే ఏప్రిల్ నెలకుగాను విడుదలైన రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలను 2.92 శాతానికి బదులుగా 2.99 శాతానికి పెంచింది. రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల ఆధారంగా రిజర్వు బ్యాంక్ తన తదుపరి సమీక్షపై నిర్ణయం తీసుకోబోతున్నది.



మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

194 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై, జూన్ 12: స్టాక్ మార్కెట్ల మూడు రోజుల ర్యాలీకి బ్రేక్‌పడింది. బ్యాంకింగ్, ఆటో మొబైల్ రంగాలకు చెందిన షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో ప్రారంభంలో మోస్తారుగా పెరిగిన సెన్సెక్స్ చివరకు నష్టాలను మూటగట్టుకున్నది. ద్రవ్యోల్బణం, పారిశ్రామిక వృద్ధి గణాంకాలు విడుదలకానుండటంతో మదుపరుల ముందస్తుగా జాగ్రత్తపడ్డారు. 300 పాయింట్ల శ్రేణిలో కదలాడిన బీఎస్ఈ సెన్సెక్స్ చివరకు 193.65 పాయింట్లు పతనం చెంది 39,756.81 వద్ద ముగిసింది. ఒక దశలో 39,982 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన సూచీ 39,623.53 పాయింట్ల కనిష్ఠానికి పడిపోయింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 59.40 పాయింట్లు పడిపోయి 11,906.20 వద్దకు చేరుకున్నది. నేటి మార్కెట్లో యెస్ బ్యాంక్ అత్యంత అదమ స్థాయి పనితీరు కనబరిచింది. బ్యాంక్ బోర్డుకు రోజుకొకరు రాజీనామా చేస్తుండటంతో సంస్థ షేరు ధర 3.34 శాతం పడిపోయింది. వీటితోపాటు మారుతి సుజుకీ, కొటాక్ మహీంద్రా బ్యాంక్, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, ఇండస్ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్‌ల షేర్లు రెండు శాతం వరకు తగ్గాయి. మరోవైపు టాటా స్టీల్, ఓఎన్‌జీసీ, వేదాంతా, సన్‌ఫార్మా, టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌యూఎల్, ఐటీసీలు మాత్రం 2.60 శాతం వరకు మార్కెట్ వాటాను పెంచుకున్నాయి. చైనాతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునే ఆసక్తి లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మదుపరుల్లో ఆందోళనను పెంచింది. దీంతో ఒక్కసారిగా అమ్మకాలకు పాల్పడటంతో మార్కెట్లు తీవ్ర ఊగిసలాట నెలకొన్నది. రంగాలవారీగా చూస్తే రియల్టీ, టెలికం, క్యాపిటల్ గూడ్స్, ఆటో, బ్యాంకెక్స్, ఆర్థికం, ఇంధన రంగ సూచీలు మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి. కానీ, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగ సూచీలు మాత్రం లాభాల్లో ముగిశాయి.

కోలుకున్న రూపాయి

దేశీయ కరెన్సీ విలువ వరుసగా రెండో రోజు పెరిగింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 10 పైసలు పెరిగి రూ.69.34 వద్ద ముగిసింది. క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం రూపాయి పెరుగడానికి ప్రధాన కారణమని ఫారెక్స్ డీలర్ పేర్కొన్నారు. 69.38 వద్ద ప్రారంభమైన ఎక్స్ఛేంజ్ రేటు ఒక దశలో 69.28 గరిష్ఠ స్థాయిని తాకి చివరకు 69.34 వద్ద ముగిసింది. గడిచిన రెండు సెషన్లలో మారకం విలువ 31 పైసలు లాభపడినట్లు అయింది.

బీఎస్-6తో యాక్టివా 125

రెండో త్రైమాసికం నుంచి అందుబాటులోకి

న్యూఢిల్లీ, జూన్ 12: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా(హెచ్ఎంఎస్ఐ) దేశీయ మార్కెట్లోకి బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేసిన యాక్టివా 125 స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. బుధవారం విడుదల చేసినప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నుంచి ఈ స్కూటర్లను విక్రయించనున్నట్లు హెచ్ఎంఎస్ఐ ప్రెసిడెంట్, సీఈవో మినోరు కటో తెలిపారు. పరిశోధన, టెక్నాలజీ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో ఎప్పుడు ముందుండే సంస్థ..భావితరాలను దృష్టిలో పెట్టుకొని ఈ స్కూటర్‌ను రూపొందించినట్లు ఆయన చెప్పారు. ఈ నూతన స్కూటర్‌ను ఆవిష్కరించడంతో ఇకనుంచి విడుదల చేసే ప్రతివాహనం బీఎస్-6 ప్రమాణాలకు తగ్గట్టుగా తయారు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. బీఎస్-4 వెర్షన్ స్కూటర్‌తో పోలిస్తే ఈ నూతన స్కూటర్ ధర 10 శాతం నుంచి 15 శాతం వరకు అధికంగా ఉండనున్నదన్నారు. ఎంత ధర మాత్రం ఆయన వెల్లడించలేదు. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న స్కూటర్ రూ.64,733 లోపు లభిస్తున్నది.

పెట్టుబడులు, విస్తరణపై వెనక్కి తగ్గనున్న సంస్థ

జపాన్‌కు చెందిన ద్విచక్ర వాహన తయారీ సంస్థయైన హోండా..భవిష్యత్తు పెట్టుబడులు, ప్లాంట్ల విస్తరణ ప్రణాళికపై వెనక్కి తగ్గేయోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. 2025 నాటికి దేశీయంగా 150 సీసీ లోపు సామర్థ్యం కలిగిన అన్ని రకాల బైకులను విద్యుత్‌తో నడిచేవాటికి అనుమతినివ్వనున్నట్లు కేంద్ర ప్రభుత్వ ప్రణాళికతో ఆటోమొబైల్ రంగంలో అనిశ్చిత పరిస్థితి నెలకొననున్నదని, దీంతో ప్రస్తుతం జరుగుతున్న ప్లాంట్ల విస్తరణ, నూతన మోడళ్ల కొనసాగనున్నప్పటికీ ఉత్పత్తి సామర్థ్యంపై పునరాలోచనలో పడినట్లు కటో తెలిపారు.

యాక్టివా 125ని ఆవిష్కరిస్తున్న బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్, నటి తాప్సీ

డుకాటీ 'హైపర్‌మోటార్డ్950'

ధర రూ.11.99 లక్షలు

న్యూఢిల్లీ, జూన్ 12: ఇటలీకి చెందిన సూపర్ బైకుల తయారీ సంస్థ డుకాటీ.. దేశీయ మార్కెట్లోకి సరికొత్త హైపర్‌మోటార్డ్ 950 మోడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఢిల్లీ షోరూంలో ఈ బైకు రూ.11.99 లక్షలకు లభించనున్నది. 937 సీసీ ఇంజిన్ కలిగిన ఈ బైకులో రెండు ఇంజిన్లు ఉన్నాయి. హైపర్‌మోటార్డ్ పరిధిని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ బైకును ఆవిష్కరించినట్లు, దీంతో నూతన డ్రైవింగ్ అనుభవం కావాలనుకునే యువతీయువకులకు ఈ బైకు సరైన ఎంపిక అని డ్యుకాటీ ఇండియా ఎండీ శెర్గి కెనోవాస్ తెలిపారు. రైడర్లను దృష్టిలో పెట్టుకొని ఈ బైకును ఆధునీకరించినట్లు ఆయన చెప్పారు. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, ముంబై, పుణె, బెంగళూరు, అహ్మదాబాద్, కోల్‌కతా, చెన్నైలలో ఉన్న షోరూంలలో ఈ బైకుకోసం ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చునని ఆయన సూచించారు

భారత్ నంబర్-2

ఇంటర్నెట్ వినియోగదారుల్లో అమెరికాను వెనుకకు నెట్టిన ఇండియా

న్యూఢిల్లీ, జూన్ 12: ఇంటర్నెట్ వినియోగదారులపరంగా ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా భారత్ నిలిచింది. 12 శాతంతో భారత్ రెండో స్థానంలో ఉందని ఇంటర్నెట్ ట్రెండ్స్‌పై ఈ ఏడాదికిగాను మ్యారీ మీకర్ రిపోర్టు తెలియజేసింది. 21 శాతంతో చైనా ముందున్నదని, 8 శాతంతో అమెరికా మూడో స్థానంలో ఉందని స్పష్టం చేసింది. అంతేగాక అత్యంత నవ్యత కలిగిన అమెరికా యేతర ఇంటర్నెట్ సంస్థల్లో రిలయన్స్ జియో ఒకటిగా ఉందని చెప్పింది. ప్రపంచ వ్యాప్తంగా 380 కోట్ల ఇంటర్నెట్ వినియోగదారులున్నారని, ప్రపంచ జనాభాలో సగానికంటే ఇది ఎక్కువని పేర్కొన్నది. భారత్‌లో ఇంటర్నెట్ వినియోగదారులు పెరుగడానికి జియోనే కారణమన్నది. జియో రాకతో దేశీయ టెలికం రంగం, ఇంటర్నెట్ వినియోగ రంగాల ముఖచిత్రం మారిపోయిన విషయం తెలిసిందే. ఆ ప్రభావం ఇప్పుడు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. ఇదిలావుంటే ప్రపంచ ఇంటర్నెట్ వినియోగదారుల వృద

మంచిర్యాల జిల్లా బుగ్గగుట్టలో లభ్యమైన షెల్ శిలాజాలు

జైపూర్ మండల కేంద్రంలో బయటపడిన డైనోసార్ పాదముద్ర

శిలాజ సిరుల ఖిల్లా

తెలంగాణ ప్రాక్చరిత్ర సంరక్షణకు అందరూ నడుంబిగించాలంటున్న నిపుణులు

వేమనపల్లిలో శిలాజ ప్రదర్శనశాల ఏర్పాటుకు వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో అపారమైన ప్రాచీన శిలాజ సంపద ఉన్నదన్న విషయం మరోసారి రుజువైంది. తెలంగాణ జాగృతి చరిత్ర బృందం సభ్యులు శ్రీరామోజు హరగోపాల్, కట్టా శ్రీనివాస్, అరవింద్ ఆర్య, అహోబిలం కరుణాకర్, వేముగంటి మురళీకృష్ణ, క్షేత్రస్థాయిలో పరిశీలకుడుగా సముద్రాల సునీల్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ మొదటి వారాంతం వరకు వేమనపల్లి, రాజారం, చెన్నూరు, జైపూర్, బుగ్గ, కాటారం తదితర ప్రాంతాల్లో జరిపిన ఉపరితల అన్వేషణలో అనేక శిలాజ శకలాలు లభించాయి. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని బుగ్గగుట్ల ప్రాంతంలో శిలాజాల పెంకులు, వేమనపల్లి మండలంలోని రాజారం పరిసరాల్లో డైనోసార్ల ఎముకల శిలాజాలు, జైపూర్ మండల కేంద్రంలో (డైనోసార్) పాదం అచ్చు శిలాజం, చెన్నూరు మండల కేంద్ర సమీపంలోని అడివిలో పత్రశిలాజాలు, పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని గుంజపడుగు గ్రామంలో మరో శిథిల శిలాజం లభించాయి. వీటిలో డైనోసార్ ఎముకలు, ఆకులు, షెల్ శిలాజాలను శాస్త్రవేత్తలు, చరిత్రకారుల సాయంతో గుర్తించగలిగారు. మిగిలినవాటిని గుర్తించే ప్రయత్నాలు ఇంకా కొనసాగుతున్నాయి. గతంలో (1990లో) ఇక్కడ లభించిన మానవశిశు శిలాజాన్ని హైద్రాబాద్ జీఎస్ఐ (జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) వారు తీసుకెళ్లగా.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం వద్ద లభ్యమైన డైనోసార్ పూర్తి శిలాజాన్ని హైద్రాబాద్ జీఎస్ఐ కార్యాలయ ప్రాంగణంలో భద్రపరిచారు. సుంపుటం వద్ద నీల్వాయి వాగు బ్రిడ్జి రివిట్మెంట్ వాల్‌పై పరిచిన రాళ్లలో శిలాజాల్లాంటివి కనిపించడంతో అవేమిటో నిర్ధారించేందుకు కసరత్తు జరుగుతున్నది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిలాల బెజ్జూరు మండలంలోని కొండపల్లి అడివిలో 15 ఎకరాల్లో విస్తరించిన వృక్షశిలాజాలను 2014లో తెలంగాణ జాగృతి చరిత్ర బృందం గుర్తించింది. కాబ్గేట్, మొహబీ అనే శాస్త్రవేత్తల నివేదికల ప్రకారం వీటి వయస్సు 6.5 కోట్ల నుంచి15 కోట్ల సంవత్సరాలు ఉంటుంది. అలాగే ప్రాణహిత-గోదావరి లోయల్లో సూక్ష్మ సకశేరుకాల శిలాజాలు, ఇదే ప్రాంతంలోని ఇన్నా కామ్తి, ఎర్రవల్లి, మలేరి, ధర్మారం, కోట అడవుల్లో సరీసృపాల శిలాజాలు లభించాయి. వేమనపల్లి ప్రాంతంలో జరిపిన తవ్వకాల్లో 12 నుంచి 20 కోట్ల ఏండ్లనాటి 840 డైనోసార్ల అవశేషాలు లభించాయి.ఈ అవశేషాలతో పునర్నిర్మించిన డైనోసార్ అస్థిపంజరాన్ని హైద్రాబాద్‌లోని బిర్లా ప్లానెటోరియంలో భద్రపరిచారు. డైనోసార్లు, చేపలు, మానవ శిలాజాలు సమృద్ధిగా ఉన్న వేమనపల్లి లాంటి ప్రదేశాలను గుర్తించి, అక్కడ లభించిన శిలాజ సంపదతో వేమనపల్లిలో ప్రదర్శనశాలను ఏర్పాటుచేస్తే బాగుంటుందని, తెలంగాణ ప్రాక్చరిత్రను కాపాడుకునేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని చారిత్రక నిపుణులు భావిస్తున్నారు.

'సృష్టికర్త ఆత్మచింతన' పుస్తకం

సీఎం కేసీఆర్‌కు అందజేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు రాసిన 'ఒక సృష్టికర్త ఆత్మ చింతన' పుస్తకం తొలికాపీని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కుఅందజేశారు. బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి ఈ పుస్తకాన్ని అందజేసినట్లు రాములు తెలిపారు. గత ఎనిమిది దశాబ్దాలుగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన సామాజిక, రాజకీయ పరిణామాలపై అవగాహన ఉన్న బీఎస్ రాములు సామాజిక దృక్పథంతో వెలువరించిన ఈ పుస్తకం రేపటితరానికి అవసరమని సీఎం కేసీఆర్ పేర్కొంటూ.. పుస్తక రచయితను అభినందించారు.

సినారెకు ఘన నివాళి

మహాకవి డాక్టర్ సీ నారాయణరెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా 'కవన భూమి'లో ఆయనకు నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు, కవులు, రచయితలు

- సిరిసిల్ల జిల్లా సొంతూరిలోని 'కవన భూమి'లో రెండో వర్ధంతి
- సినారె సేవలను స్మరించుకున్న కేటీఆర్

తెలుగు యూనివర్సిటీ: జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత, పద్మభూషణ్, మహాకవి డాక్టర్ సీ నారాయణరెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఆయన కుటుంబసభ్యులు, కవులు, రచయితలు, ఆత్మీయులు ఘనంగా నివాళులు అర్పించారు. సినారె నిర్యాణం అనంతరం ఆయన జన్మస్థలం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం హనుమాజీపేటలోని నివాస ప్రాంగణంలో 'కవన భూమి' పేరుతో స్మారక కేంద్రం ఏర్పాటు చేశారు. ఆయన కుమార్తెలు గంగ, యమున, సరస్వతి, కృష్ణవేణి, అల్లుళ్లు భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి వారి పిల్లలతోపాటు తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య, నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా తెలుగు సంపాదకుడు డాక్టర్ పత్తిపాక మోహన్, పరిశోధకురాలు వడ్డేపల్లి సంధ్య, సినారె స్నేహితుడు ఆదిరెడ్డి తదితరులు స్మారక కేంద్రం వద్ద పుష్పాంజలి సమర్పించారు.

సినారెకు కేటీఆర్ నివాళి

ప్రముఖ రచయిత, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, డాక్టర్ సీ నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయనకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు నివాళులర్పించారు. 'సాహిత్యంతో తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తంచేసిన కవి సినారె' అంటూ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. సినారె సాహిత్యరంగానికి చేసిన సేవలను కేటీఆర్ స్మరించుకున్నారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

ఆర్థిక చేయూత

- రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా రాష్ట్రంలోని పేద బ్రాహ్మణులకు ఆర్థిక చేయూత అందించే కార్యక్రమాలను చేపట్టినట్టు పరిషత్ చైర్మన్ కేవీ రమణాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణ ఔత్సాహిక వ్యాపారవేత్తల ప్రోత్సాహక పథకం (బెస్ట్) కింద లబ్ధిదారులకు రూ.లక్షలోపు 80 శాతం, రూ.లక్ష నుంచి 2 లక్షల లోపు 70 శాతం, రూ.2 లక్షల నుంచి 12 లక్షల లోపు 60 శాతం రాయితీతో బెస్ట్ పథకం కింద ప్రోత్సాహకాన్ని అందిస్తారని తెలిపారు. ఈ నెల 14 నుంచి ఆగస్టు 31 వరకు www.brahminparishad.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొలువుదీరిన ఏపీ శాసనసభ

సభ్యులతో ప్రమాణం చేయించిన ప్రొటెం స్పీకర్

బుధవారం ఏపీ అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ 15వ శాసనసభ బుధవారం కొలువుదీరింది. ఐదురోజులపాటు జరుగనున్న సమావేశాల్లో మొదటిరోజు ప్రొటెం స్పీకర్‌గా శంబంగి చినవెంకట అప్పలనాయుడు బాధ్యతలు స్వీకరించిన అనంతరం సభ్యులతో ప్రమాణం చేయించారు. మొదట ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ప్రతిపక్షనేత చంద్రబాబు ప్రమాణం స్వీకరించారు. తర్వాత మంత్రులు, అక్షరక్రమంలో ఎమ్మెల్యేలు చేశారు. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మినహా మిగిలిన 173మంది సభ్యులు ప్రమాణ స్వీకరించాక సభ గురువారానికి వాయిదా పడింది.

ఏపీ స్పీకర్‌గా తమ్మినేని!

ఏపీ నూతన అసెంబ్లీ స్పీకర్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇప్పటికే సీఎం జగన్.. తమ్మినేని సీతారాం పేరును ప్రతిపాదించడంతో బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. 30 మంది సభ్యులు బలపరిచారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో తమ్మినేని సీతారాం ఎన్నిక లాంఛనం కానుంది. గురువారం ఆయన స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఏపీ చీఫ్‌విప్‌గా శ్రీకాంత్‌రెడ్డి

ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, విప్‌లను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. చీఫ్ విప్‌గా రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, విప్‌లుగా బుడి ముత్యాలనాయుడు, దాడిశెట్టి రామలింగేశ్వరరావు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి , సామినేని ఉదయభాను, కాపు రామచంద్రారెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజాను ఏపీఐఐసీ చైర్‌పర్సన్‌గా నియమించినట్టు ప్రచారం జరుగుతున్నా అధికారికంగా ఖరారు కాలేదు.

అధికారులకు శాఖల కేటాయింపు

ఏపీ సీఎం కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు అందరికీ ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజయ్‌కల్లాం బుధవారం శాఖలు కేటాయించారు.అజయ్‌కల్లాం.. సీఎం ముఖ్య సలహాదారుతోపాటు సాధారణ పరిపాలన, హోంశాఖ, ఆర్థిక, ప్రణాళిక, రెవెన్యూ, శాంతి భద్రతల అంశాలు, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యకలాపాలు పర్యవేక్షించనున్నారు. పీవీ రమేశ్‌కు సీఎం స్పెషల్ చీఫ్ సెక్రటరీ బాధ్యతలతోపాటుగా వైద్య, విద్యా, పరిశ్రమలు, వాణిజ్యం, సాల్మన్ ఆరోక్యరాజ్ సీఎం కార్యదర్శిగా ట్రాన్స్‌పోర్ట్ రహదారులు, ఏపీఎస్ఆర్టీసీ, గృహనిర్మాణం, పౌరసరఫరాలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, కే ధనుంజయరెడ్డి సీఎం అదనపు కార్యదర్శిగా నీటివనరులు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, సీఆర్డీఏ, వ్యవసాయం, పర్యాటకం. జే మురళి సీఎం అదనపు కార్యదర్శిగా పశుసంవర్ధక, సహకారం, డాక్టర్ ముక్తాపురం హరికృష్ణ సీఎం ప్రత్యేక అధికారిగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి, పీ కృష్ణమోహన్‌రెడ్డి ఆఫీసర్ ఆన్ స్పెషల్‌డ్యూటీ (ఓఎస్డీ)గా ముఖ్యమంత్రికి సంబంధించిన మినిట్ టు మినిట్ ప్రోగ్రాం పర్యవేక్షించనున్నారు.

సీఎంకు సహకరిస్తా: జనసేన ఎమ్మెల్యే వరప్రసాద్

ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి జనసేన పార్టీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణంలో అభినందనలు తెలిపిన ఆయనతో జగన్ కొద్దిసేపు మాట్లాడి సభలోకి వెళ్లిపోగా, ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటే పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

నేనెవరికీ భయపడను: కేశినేని నాని

తెలుగుదేశం పార్టీలో తనకు తగిన ప్రాధాన్యం దక్కలేదని తిరుగుబావుటా ఎగురవేసిన విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) కొన్నిరోజులుగా సోషల్‌మీడియా వేదికగా వరుసపోస్టులతో సొంత పార్టీనేతలపై పరోక్ష వ్యాఖ్యలు చేస్తున్నారు. బుధవారం తన అధికారిక ఫేస్‌బుక్ పేజీలో తాను ఎవరికీ భయపడను అనే రీతిలో 'నేను స్వయంశక్తిని నమ్ముకున్న వ్యక్తిని. ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే వాడినికాదు' అంటూ.. సుదీర్ఘపోస్టును షేర్ చేశారు. ఇటీవల చంద్రబాబు ఇచ్చిన లోక్‌సభ విప్ పదవినీ తిరస్కరించి తన అసంతృప్తిని బహిరంగంగా ఆయన వెల్లడించారు.

రాజకీయ కక్షతోనే కేసులు: కోడెల

తన కుమారుడు, కుమార్తెపై కేసులు నమోదయిన నేపథ్యంలో ఏపీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు మీడియాతో మాట్లాడారు. తన కుటుంబ సభ్యులపై కేసులు పెట్టాలని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ట్వీట్‌చేసిన నేపథ్యంలోనే తాజా పరిణామాలు సంభవిస్తున్నాయని అన్నారు. గుంటూరులో కోడెల మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ కక్షలతో కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కొత్త ప్రభుత్వం వచ్చిన కొన్నిరోజుల్లోనే టీడీపీ కార్యకర్తలపై దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. ప్రస్తుత పరిణామాలు ప్రజాస్వామ్యానికి మంచివికావని అధికారాన్ని కక్షసాధింపునకు వాడవద్దని కోరారు.

ఆర్టీసీ కార్మికులు ఇక ప్రభుత్వ ఉద్యోగులే: జగన్

సమ్మె యోచన విరమించిన ఏపీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాలు

ఏపీఎస్ఆర్టీసీ కార్మికులు ఇక ప్రభుత్వ ఉద్యోగులేనంటూ సీఎం వైఎస్ జగన్ సంబోధించడంతో కార్మిక సంఘాల నేతల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. సమ్మె యోచనలో ఉన్న ఆర్టీసీ జేఏసీ నేతలు పలు దఫాలుగా ఆర్టీసీ ఎండీతో చర్చలు జరిపారు. తాజాగా సీఎం జగన్‌ను ఆయన చాంబర్‌లో బుధవారం కలిసి మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. డిమాండ్లపై సీఎం సానుకూలంగా స్పందించడంతో సమ్మె యోచన విరమించుకున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులకు వస్తున్న అన్నిసౌకర్యాలు కల్పిస్తామని, కార్మికులకు సమస్యలు లేకుండా చూస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు.

బీజేపీ కుట్రలు ఇక్కడ సాగవు

- రాష్ట్రాన్ని అస్థిరపర్చాలని చూస్తే ప్రజలు సహించరు
- హైదరాబాద్ బ్రాండ్ దెబ్బతీసేలా బీజేపీ నేతల వ్యాఖ్యలు
- టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ధ్వజం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీజేపీ నేతల కుట్రలు తెలంగాణలో సాగవని, ఇక్కడి ప్రజలు శాంతిని కోరుకుంటున్నారని, స్థానికంగా ఎలాంటి అల్లర్లకు అవకాశమివ్వరని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ బ్రాండ్‌ను దెబ్బతీసే విధంగా బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బుధవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారంలోకి రావాలనే లక్ష్యంతో బీజేపీ నేతలు రాష్ట్రాన్ని ఏదోచేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాలను అడిగితే తీవ్రవాదుల మూలాలు ఎక్కడా ఉన్నాయో తెలుస్తాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఉద్దేశించి ప్రభాకర్ వ్యాఖ్యానించారు. గుజరాత్ తీవ్రవాదులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలోనే మనుషులు మిస్ అవుతున్నారంటూ భ్రమ కల్పించేలా ఓ పత్రికలో వార్తాకథనం రావడం దురదృష్టకరమని, ఆ వార్తను ఆధారంగా చేసుకుని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడటం హాస్యాస్పదమని తెలిపారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావల్సిన నిధులు తీసుకొచ్చేందుకు బీజేపీ నేతలు ప్రయత్నించాలని హితవుపలికారు.

ఏం సాధించావని సిల్వర్ జూబ్లీవేడుకలు?

- మందకృష్ణపై పిడమర్తి రవి ఫైర్

రౌండ్‌టేబుల్‌లో మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఖైరతాబాద్: ఎస్సీల వర్గీకరణ ఉద్యమాన్ని 25 ఏండ్ల పాటు స్వలాభానికి వాడుకున్నావ్.. ఏం సాధించావని సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకుంటున్నావ్? అంటూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగపై ఎస్సీ కార్పొరేషన్ మాజీచైర్మన్ పిడమర్తి రవి మండిపడ్డారు. '25 సంవత్సరాల ఉద్యమం- దశాదిశ' అంశంపై బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1994లో ప్రారంభమైన ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో మందకృష్ణ మాదిగ వెంటఉన్న 20 మందిలో అందరూ అదృశ్యమయ్యారని తెలిపారు. ఎలాంటి విజయం సాధించకుండా సిల్వర్ జూబ్లీ వేడుకలంటూ పండుగ చేసుకోవడం ఆయన విజ్ఞతకే వదలేస్తున్నామన్నారు. మాదిగలకు ఒక్క విజయాన్ని కూడా అందించకుండా సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం ఉద్యమం చేయకుండా.. స్వరాష్ట్రం వచ్చాక విమలక్క, చెరుకు సుధాకర్ కోసం ఉద్యమించడం సిగ్గుచేటన్నారు.

స్వల్పకాలిక విత్తన పరిశోధనలపై దృష్టి

- వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు

వ్యవసాయ వర్శిటీ వీసీ ప్రవీణ్‌రావును కలిసిన ఆస్ట్రేలియా వర్సిటీ డీన్ కారోలిన్ గ్రాస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విత్తనోత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నదని, అనేక దేశాలకు విత్తనాల్ని సరఫరా చేస్తున్నదని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు తెలిపారు. వాతావరణ మార్పులను తట్టుకొనే స్వల్పకాలిక విత్తన పరిశోధనలపై ప్రత్యేక దృష్టిసారించినట్టు తెలిపారు. బుధవారం వర్సిటీ పరిపాలనా భవనంలో ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ న్యూఇంగ్లండ్ డిప్యూటీ డీన్ ప్రొఫెసర్ కారోలిన్‌గ్రాస్‌తో వీసీ ప్రవీణ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ప్రగతిని వీడియో ప్రజంటేషన్ ద్వారా వీసీ వివరించారు. సీఎం కేసీఆర్ చేపట్టిన వివిధ భారీ నీటిపారుదల ప్రాజెక్టుల వల్ల వ్యవసాయానికి సంబంధించిన కొత్త అంశాలు, ఎదురయ్యే సవాళ్లను వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిష్కరించవలసిన అవసరం ఉన్నదన్నారు. సహజవనరుల యాజమాన్యం, ఫుడ్ టెక్నాలజీ, టెక్నాలజీ బదలాయింపు, అగ్రిబిజినెస్, విద్యార్థులు, బోధన సిబ్బంది పరస్పర మార్పిడి అంశాల్లో కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా తీర్మానించారు.

సినీహీరో వరుణ్‌తేజ్‌కు తప్పిన ప్రమాదం

కొత్తకోట: షూటింగ్ నిమిత్తం హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న సినీహీరో వరుణ్‌తేజ్ కారుకు ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని రాయినిపేట స్టేజీ దగ్గర ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరుణ్‌తేజ్‌తోపాటు మరోముగ్గురు కలిసి బుధవారం ఆడీ కారులో షూటింగ్ కోసం బయల్దేరారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని రాయినిపేట వద్దకు రాగానే ముందువెళ్తున్న ఇండికా కారును ఢీకొట్టింది. ఇండికా కారులోని ముగ్గురికి స్వల్పగాయాలు కాగా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆడీ కారులోనివారికి ఎలాంటి గాయాలు కాలేదు.

26న హైదరాబాద్‌లో బాలస్వామి పరిచయ వేదిక

- ఏర్పాటుచేయించిన సీఎం కేసీఆర్
- విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ వెల్లడి

బాలస్వామి సన్యాస స్వీకారోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి, పక్కనే రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు దంపతులు

వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ: విశాఖ శ్రీశారదాపీఠ ఉత్తరాధికారిగా శిష్యసన్యాసదీక్ష చేపట్టనున్న బాలస్వామి పరిచయ కార్యక్రమాన్ని ఈనెల 26న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేశారని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి వెల్లడించారు. విశాఖ శ్రీ శారదాపీఠ ఉత్తరాధికారిగా బాలస్వామి (కిరణ్‌కుమారశర్మ) ఈ నెల 15, 16, 17వ తేదీల్లో విజయవాడలోని శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో సన్యాశ్రమ స్వీకార మహోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జలవిహార్‌లో జరిగే బాలస్వామి పరిచయవేదిక కార్యక్రమానికి సర్వజనులు రావాలని పిలుపునిచ్చారు. విజయవాడలో జరిగే కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్, తెలంగాణ, ఏపీ సీఎంలు కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డి వివిధరంగాలకు చెందిన ప్రముఖులు వస్తున్నారని చెప్పారు. బుధవారం హన్మకొండలోని కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఇంట్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విశాఖ శారదాపీఠం సర్వజనోద్ధరణ కోసం పాటుపడుతున్నదని పేర్కొన్నారు. వరంగల్ శివారు ఆరెపల్లిలోని అయ్యప్పస్వామి ఆలయంలో స్వరూపానందేంద్ర సరస్వతీ చేతుల మీదుగా బుధవారం మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామికి మహాకుంభాభిషేకం కొనసాగించారు.

స్త్రీనిధి బ్యాంకును సెర్ప్‌లో భాగంగా కొనసాగించాలి

ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన సెర్ప్ ఉద్యోగుల జేఏసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్త్రీనిధి మహిళా కోఆపరేటివ్ బ్యాంకును సెర్ప్‌లో భాగంగా కొనసాగించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్‌కు సెర్ప్ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు ఏపూరి సోమయ్య, గంగాధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సుభాష్ బుధవారం వినతిపత్రం సమర్పించారు. సెర్ప్‌కు సమాంతరంగా స్త్రీనిధి బ్యాంకులో ఉద్యోగుల నియామకం చేపట్టడంతో సెర్ప్ ఉద్యోగులకు భవిష్యత్తుపై అభద్రతభావం నెలకొందని ఆందోళన వ్యక్తంచేశారు. 20 ఏండ్లుగా సెర్ప్‌లో విధులు నిర్వహిస్తూ, స్త్రీనిధి బలోపేతానికి సేవలందించిన తమకు సమాంతరంగా కొత్త నియామకాలు చేపట్టడం సమంజసం కాదని సెర్ప్ జేఏసీ ప్రతినిధులు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శికి వివరించారు.

ప్రగతి నిలయాలు.. ఎస్సీ హాస్టళ్లు

- ప్రవేశాల పెంపుపై ప్రత్యేక దృష్టి
- కరపత్రాలతో ఎస్సీ సంక్షేమశాఖ ప్రచారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'నాణ్యమైన విద్య.. మంచిభోజనం.. వసతి.. సకల సదుపాయాలు.. నిత్యం పర్యవేక్షణ.. గతంలో సాధించిన ఫలితాలు.. సంక్షేమ వసతిగృహాలు బాలబాలికల అభివృద్ధికి నిలయాలు. మీ పిల్లలను మా ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో చేర్పించండి' అంటూ ఎస్సీ సంక్షేమ శాఖ వినూత్నప్రచారం చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ హాస్టళ్లలో ప్రవేశాలను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నది. బుధవారం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ఎస్సీ హాస్టళ్లలో చేరే విద్యార్థుల గుర్తింపుపై సంక్షేమశాఖ అధికారులు 'మీ ప్రగతికి ఎస్సీ హాస్టళ్లు' పేరుతో ప్రత్యేకకార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిని ఈనెల 22 వరకు నిర్వహించనున్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉంటూ పాఠశాలలకు వెళ్లి చదువుకోలేని విద్యార్థులను గుర్తించి వసతిగృహాల్లో ప్రవేశాలు కల్పించడం ముఖ్య ఉద్దేశం. దీనిపై అన్ని సంక్షేమశాఖలకు ప్రభుత్వం సర్కులర్ జారీచేసింది. వసతిగృహ సంక్షేమాధికారులు వసతిగృహాల్లో ప్రవేశాలు కల్పించేందుకు బృందాలుగా ఏర్పడ్డారు. ప్రభుత్వ, జెడ్పీ ఉన్నతపాఠశాలలు, గ్రామాల్లోని ఇంటింటికీ తిరుగుతున్నారు.

అధిక సంఖ్యలో ప్రవేశాలే లక్ష్యం

ఎస్సీ నిరుపేద విద్యార్థులకు హాస్టళ్లలో గతంలో కన్నా అధిక సంఖ్యలో ప్రవేశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఈ మేరకు అన్ని జిల్లాల పరిధిలోని డీఎస్‌డీవోలకు సూచనలు చేశాం. ఎస్సీ హాస్టళ్లలో ప్రవేశాల కోసం సంక్షేమాధికారులు అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు.

- పీ కరుణాకర్, ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్

మున్సిపల్ ఎన్నికలపై కౌంటర్ వేయండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మున్సిపల్ ఎన్నికల్లో వార్డుల విభజనతోపాటు బీసీ రిజర్వేషన్లు ఖరారు చేయాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ వేయాలని హైకోర్టు బుధవారం ప్రభుత్వాన్ని ఆదేశించింది. పలు గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనంచేసి కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేసినందున ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు కొంత సమయం కావాలని కోరారు. దీంతో తదుపరి విచారణ

నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 13 జూన్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

రుచుల డబ్బా!

స్కూళ్లు మొదలయ్యాయి.. అమ్మలంతా బిజీబిజీ అయిపోయారనుకుంటా! పొద్దున లేవగానే.. పిల్లలకు ఏం చేయాలనే ఆలోచనతో సతమతమవుతున్నారా? ఇక పిల్లలేమో డబ్బా ఖాళీ చేయకుండా.. సగం తిని.. సగం ఖాళీ కడుపుతో ఇంటికొచ్చేస్తున్నారా? పిల్లలకు కాస్త టేస్టీగా.. యమ్మీగా ఉన్నప్పుడే.. లొట్టలేస్తారు.. అందుకే అన్నాన్నే.. తీరొక్క రకంగా రోజూ వండి వడ్డించండి.. అప్పుడు మెతుకు మిగలకుండా తినేస్తారు..

కొబ్బరి రైస్

కావాల్సినవి :

కొబ్బరి చిప్ప : 1, **అన్నం :** 2 కప్పులు, **పచ్చిమిర్చి :** 4, **ఎండుమిర్చి :** 2, **కొత్తిమీర :** ఒక కట్ట, **నిమ్మరసం :** ఒక టేబుల్‌స్పూన్, **జీలకర్ర :** అర టీస్పూన్, **ఆవాలు :** అర టీస్పూన్, **పల్లీలు :** ఒక టేబుల్‌స్పూన్, **శనగపప్పు :** అర టీస్పూన్, **మినుపపప్పు :** అర టీస్పూన్, **కరివేపాకు :** 2 రెమ్మలు, **నూనె :** 3 టీస్పూన్స్, **ఉప్పు :** తగినంత

తయారీ :

స్టెప్ 1: కొబ్బరి తురుము చేసి పెట్టుకోవాలి. ముందుగానే అన్నాన్ని మరీ మెత్తగా కాకుండా పొడిపొడిగా ఉండేట్లు వండుకోవాలి.

స్టెప్ 2 : కడాయిలో నూనె పోసి ఆవాలు, జీలకర్ర, పల్లీలు, మినుపపప్పు, ఎండుమిర్చి, పచ్చిమిర్చి వేసి బాగా వేయించాలి.

స్టెప్ 3 : ఇవి వేగాక.. కరివేపాకు, కొబ్బరి తురుము, ఉప్పు వేసి కలుపాలి. కొబ్బరి పచ్చి వాసన పోయే వరకు కలుపుతుండాలి.

స్టెప్ 4 : ఇప్పుడు నిమ్మరసం వేసి ఒక నిమిషం సన్నని మంట మీద ఉంచి అన్నం వేయాలి. మరో నిమిషం కలిపి కొత్తిమీర వేసి దించేయాలి. అంతే.. టేస్టీ కొబ్బరి రైస్ రెడీ!

పుదీనా కొత్తిమీర రైస్

కావాల్సినవి :

కొత్తిమీర : అర కప్పు, **పుదీనా ఆకులు :** అర కప్పు, **అన్నం :** ఒక కప్పు, **అల్లం ముక్కలు :** ఒక టీస్పూన్, **పచ్చిమిర్చి :** 2, **ఉల్లిపాయ ముక్కలు :** అర కప్పు, **కాకరకాయ పొడి :** ఒక టీస్పూన్ , **నెయ్యి :** ఒక టీస్పూన్, **ఉప్పు :** తగినంత

తయారీ :

స్టెప్ 1: కడాయిలో నెయ్యి వేసి అల్లం ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. ఇందులో కొత్తిమీర, పుదీనా వేసి కలుపుతుండాలి.

స్టెప్ 2: ఇవి బాగా దగ్గరకు అయ్యాక ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించాలి. ఆ తర్వాత అన్నం, ఉప్పు వేసి కలుపాలి.

స్టెప్ 3: రెండు నిమిషాలు సన్నని మంట మీద ఉంచి.. చివరగా కాకరకాయ పొడి వేసి దించేయాలి.

టోఫు ఫ్రైడ్ రైస్

కావాల్సినవి :

అన్నం : 2 కప్పులు, **ఉల్లిగడ్డ :** 1, **క్యాప్సికం ముక్కలు :** ఒక కప్పు, **ఆలుగడ్డ ముక్కలు :** ఒక కప్పు, **క్యారెట్ ముక్కలు :** ఒక కప్పు, **పసుపు :** అర టీస్పూన్, **ధనియాల పొడి :** ఒక టీస్పూన్, **జీలకర్ర పొడి :** అర టీస్పూన్

తయారీ :

స్టెప్ 1: కడాయిలో నూనె పోసి ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేసి బాగా వేయించాలి. ఇందులో క్యాప్సికం ముక్కలు, ఆలు ముక్కలు వేయాలి.

స్టెప్ 2: రెండు నిమిషాలు వేగనిచ్చాక.. క్యారెట్ ముక్కలు వేసి మరో రెండు నిమిషాలు కలుపాలి. ఇప్పుడు పసుపు వేసి దాదాపు ముక్కలు 80శాతం వేగనివ్వాలి.

స్టెప్ 3: ఇందులో ధనియాల పొడి, జీలకర్ర పొడి, కారం, టోఫు వేసి రెండు నిమిషాలు సన్నని మంట మీద కలుపుతుండాలి.

స్టెప్ 4: దీంట్లో అన్నం వేసి కలిపి దించేయాలి. ఈ ఫ్రైడ్ రైస్‌ని పిల్లలు ఇష్టంగా తింటారు.

ఎగ్ రైస్

కావాల్సినవి :

అన్నం : ఒక కప్పు, **కోడిగుడ్లు :** 2, **ఆవాలు :** అర టీస్పూన్, **కరివేపాకు :** ఒక రెమ్మ, **పచ్చిమిర్చి :** 2, **అల్లం,** **వెల్లుల్లి పేస్ట్ :** అర టీస్పూన్, **పసుపు :** పావు టీస్పూన్, **క్యారెట్ :** 1, **నూనె :** 3 టేబుల్‌స్పూన్స్, **ఉప్పు :** తగినంత

తయారీ :

స్టెప్ 1: కడాయిలో నూనె పోసి ఆవాలు, కరివేపాకు, పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి పేస్ట్, పసుపు, ఉప్పు వేసి కలుపాలి.

స్టెప్ 2: ఇవి కాస్త వేగిన తర్వాత.. కోడిగుడ్లు కొట్టి పోయాలి. వీటిని రెండు నిమిషాల పాటు కలుపుతుండాలి.

స్టెప్ 3: ఇందులో క్యారెట్ ముక్కలు వేసి మరి కాసేపు కలుపాలి. చివరగా అన్నం వేసి రెండు నిమిషాల పాటు సన్నని మంట మీద అలాగే ఉంచి దించేయాలి. నోరూరించే ఎగ్ రైస్ మీ ముందుంటుంది.

సంజయ్ తుమ్మ
సెలబ్రిటీ చెఫ్

ఆమె ఒక హీరో!

సామాన్య మానవుడి హక్కు అంటూ వచ్చిన ఆధార్ అన్ని రంగాల్లో కీలకమైంది. ఈ నేపథ్యంలో ఆధార్‌లోని లోపాలను ఎత్తి చూపుతూ దశాబ్దం పాటు ఉద్యమించిందో సామాజిక కార్యకర్త. చివరకు ఆధార్‌లోని కొన్ని లోపాలను సవరించేందుకు ఆమె కారణమయ్యారు. అందుకే ఆమెకు ఓ సంస్థ 'హ్యూమన్ రైట్స్ హీరో' అవార్డును అందజేసి సత్కరించేందుకు సిద్ధమైంది.

లీగల్ రీసెర్చ్, సామాజిక కార్యకర్త ఉషా రామనాథన్ 2009 నుంచి ఆధార్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. అందుకే 'ఇంటర్నేషనల్ రైట్స్ గ్రూప్ యాక్సెస్ నౌ' సంస్థ ఆమెను 'హ్యూమన్ రైట్స్ హీరో' బిరుదుతో సత్కరించనుంది. ఈ నెల 11 నుంచి 14 వరకు ట్యూనీషియాలో జరిగే మానవ హక్కుల సమావేశం, సాంకేతికత సమావేశంలో ఐక్యరాజ్య సమితి హై కమిషనర్ ఫర్ హ్యూమన్ రైట్స్ మైఖేల్ బచెలెట్ చేతుల మీదుగా ఉషా రామనాథన్‌కు ఈ అవార్డును అందజేయనున్నారు. 2009లో ఆధార్ ప్రవేశపెట్టినప్పుడు నాణ్యత, గోప్యత తదితర విషయాల్లో ఆధార్ సరైంది కాదని విమర్శించిన వారిలో ఉషా రామనాథన్ ఒకరు. అప్పటి నుంచి ఆధార్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తూనే ఉన్నారు. అందులోని లోపాలను ఎత్తి చూపుతూనే ఉన్నారు. 2018 సెప్టెంబర్‌లో సుప్రీం కోర్టు ఆధార్ అన్నింటికీ తప్పనిసరి అని తీర్పునిచ్చింది. ఈ క్రమంలో ప్రైవేటు కంపెనీలకు ఆధార్ అవసరం లేదని ఉషా రామనాథన్ ఆధార్ లొసుగులను ఎత్తిచూపారు. అనంతరం సుప్రీం కోర్టు తీర్పులకు అనుగుణంగా కొన్ని సవరణలతో ఈ బిల్లును రెండు వారాల క్రితం క్యాబినెట్ ఆమోదించింది. సమాచార సాంకేతిక శాఖామంత్రి రవిశంకర్ ప్రసాద్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ అవార్డు తన ఆధార్ కోసం ఉద్యమించిన ప్రతి ఒక్కరికీ అంకితం అని ఉషారామనాథన్ అన్నారు.

కీటకాలను తరిమికొట్టండి

- ఒక గిన్నెలో వేడి నీరు తీసుకుని, అందులో మూడు నుంచి నాలుగు టీ బ్యాగులను వేసి మరిగించాలి. ఈ వాసనకు సాలీడులు, ఎలుకలు దూరంగా పారిపోతాయి. ఎంత ఘాటైన వాసన కలిగిన టీ బ్యాగుల్ని వేస్తే అంత మంచిది. అస్సాం టీ నీలగిరి తేయాకు, పిప్పరమెంట్ టీ ఈ పనికి బాగా ఉపయోగపడుతాయి.
- భారతీయ మసాలా వంటకాల్లో విరివిగా వాడే బిర్యానీ ఆకులు వాసన, రుచిలో ఘాటుగా ఉంటాయి. బిర్యానీ ఆకులను చిన్న చిన్న ముక్కలుగా చేసి వంటింట్లో కీటకాలు తిరిగే చోట పెడితే చాలు ఈ ఆకుల ఘాటుకు కీటకాలు బయటకు పరుగులు పెడతాయి.
- ఎలుకలు ఇంట్లోకి ప్రవేశిస్తున్న మార్గాన్ని గుర్తించి మింట్ టూత్ పేస్టు కొద్దిగా పూస్తే చాలు ఎలుకలు లోపలికి రావు. బీరువాలు, ఆల్మారాల దిగువన కొంచెం టూత్ పేస్టు రుద్దితే ఎలుకలు అందులోకి వెళ్లడానికి సాహసించవు.
- ఎలుకలు, సాలెపురుగులను వదిలించుకోవడానికి వాడే సురక్షితమైన మార్గాలలో వంట సోడా ఒకటి. ఎలుకలు, క్రిమి కీటకాలు ఉండే చోట వంట సోడా చల్లితే ఆ వాసనకు కీటకాలు దూరంగా పారిపోతాయి.
- మస్కిటో కాయిల్స్, మస్కిటో రిఫిల్స్ వాడితే కొన్నాళ్లకు ఆస్తమా, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉన్నది. ముఖ్యంగా పిల్లలకు వీటి ద్వారా ఎఫెక్ట్ పడుతుంది. వేప ఆకులను మండించి గది అంతా పొగతో చూపాలి. ఆ తర్వాత డోర్లు తెరవాలి. ఇలా చేస్తే మూలల్లో దాగున్న దోమలు పరారవుతాయి.

'సాహో' చిత్రంలో ప్రభాస్

కల్యాణ్‌రామ్

సతీష్ వేగేశ్న దర్శకత్వంలో

మెహరీన్

'118' చిత్రంతో మంచి విజయాన్ని దక్కించుకున్నారు హీరో కల్యాణ్‌రామ్. వినూత్న ఇతివృత్తంతో తెరకెక్కిన ఈ చిత్రంలో ఆయన నటనకు ప్రశంసలు లభించాయి. తాజాగా కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా సతీష్ వేగేశ్న దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్నది. ఆదిత్య మ్యూజిక్ సంస్థ ఈసినిమాతో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టనున్నది. ఉమేష్ గుప్తా నిర్మించనున్న ఈ చిత్రానికి శివలెంక కృష్ణప్రసాద్ సమర్పకుడిగా వ్యవహరించనున్నారు. కల్యాణ్‌రామ్‌కు జోడీగా మోహరీన్ కథానాయికగా నటిస్తున్నది. నిర్మాత మాట్లాడుతూ 'భావోద్వేగాలు మిళితమైన ఫీల్‌గుడ్ యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. దర్శకుడు సతీష్ వేగేశ్న అన్ని వర్గాలను అలరించేలా చక్కటి కథను సిద్ధం చేశారు' అని తెలిపారు. ఈ చిత్రానికి గోపీసుందర్ సంగీతాన్ని అందించనున్నారు.

గోపీచంద్

చాణక్య అన్వేషణ

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'చాణక్య'. తిరు దర్శకుడు.రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మెహరీన్ కథానాయిక. గోపీచంద్ పుట్టినరోజు పురస్కరించుకొని బుధవారం ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో పొడవైన గడ్డంతో మెడలో స్కార్ఫ్ ధరించి గోపీచంద్ వినూత్నంగా కనిపిస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ 'స్పై థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రమిది. చాణక్య అనే గూఢచారికి వృత్తిలో ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? అతడి అన్వేషణ ఎవరి కోసం అన్నది ఆసక్తిని రేకెత్తిస్తుంది. గూఢచారిగా గోపీచంద్ పాత్ర సరికొత్త పంథాలో ఉంటుంది. ఊహకందని మలుపులతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. కథ, కథనాలు నవ్యరీతిలో సాగుతాయి. బాలీవుడ్ నటి జరీనా ఖాన్ కీలక పాత్రను పోషిస్తున్నది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రధాన తారాగణంపై కీలక ఘట్టాలను చిత్రీకరిస్తున్నాం. తెలుగు ప్రేక్షకులకు నవ్యానుభూతిని పంచుతుంది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, సినిమాటోగ్రఫీ: వెట్రీ పళనిస్వామి.

థ్రిల్లర్ యురేక

డింపుల్ హయతి, కార్తిక్ ఆనంద్

కార్తిక్ ఆనంద్ కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యురేక'. షాలిని, మున్నా, డింపుల్ హయతి ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. ప్రశాంత్ తాతా నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. కార్తిక్ ఆనంద్ మాట్లాడుతూ 'రొటీన్‌కు భిన్నమైన థ్రిల్లర్ చిత్రమిది. తెలుగు తెరపై ఇప్పటి వరకు ఎవరూ స్పృశించని కథాంశంతో తెరకెక్కిస్తున్నాం. విపత్కర పరిస్థితుల నుంచి ఓ ప్రేమజంట ఎలా బయటపడింద న్నది ఉత్కంఠను పంచుతుంది. ఇటీవల విడుదలచేసిన ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. త్వరలో ఆడియో, సినిమా విడుదల తేదీని వెల్లడిస్తాం' అని చెప్పారు. అపూర్వ, బ్రహ్మాజీ, రఘుబాబు, శివన్నారాయణ, వాసు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: నరేష్ కుమరన్, సినిమాటోగ్రఫీ: ఎన్.బి. విశ్వకాంత్.

అలా అనకుంటే పేరు మార్చుకుంటా!

వైభవీ జోషి, సప్తగిరి

'సప్తగిరి సినిమా అంటే ప్రేక్షకులు వినోదాన్ని ఆశిస్తారు. అయితే ఇందులో ప్రేక్షకులు ఆశించే వినోదంతో పాటు కట్టిపడేసే భావోద్వేగ సన్నివేశాలు. ఆకట్టుకునే పోరాట ఘట్టాలు, క్లైమాక్స్ వున్నాయి. సినిమా చూసిన ప్రేక్షకుడు అదిరింది అని అనకుంటే నా పేరు మార్చుకుంటాను' అన్నారు అరుణ్ పవార్. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'వజ్రకవచధర గోవింద'. సప్తగిరి హీరోగా నటించారు. నరేంద్ర యెండల, జీవీఎన్ రెడ్డి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సప్తగిరి మాట్లాడుతూ 'సినిమా విషయంలో నూటికి నూరు శాతం నమ్మకంతో వున్నాం. టీమ్ అంతా చాలా ఇష్టపడి కష్టపడి చేసిన సినిమా ఇది. ' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'ఫైనల్ కాపీ చూసుకున్నాక ఇంత మంచి చిత్రాన్ని నిర్మించినందుకు గర్వంగా అనిపించింది. సప్తగిరి, అరుణ్ పవార్ ఇచ్చిన నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాను' అన్నారు.

ఆనందభైరవి సాహసం

రాయ్‌లక్ష్మి

అంజలి, రాయ్‌లక్ష్మి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆనందభైరవి'. కర్రీ బాలాజీ దర్శకత్వం వహిస్తున్నారు. హరివేన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఇటికేల రమేష్‌రెడ్డి నిర్మిస్తున్నారు. అరుణ్ ఆదిత్ కీలక పాత్రధారి. తొలి షెడ్యూల్ వైజాగ్‌లో పూర్తయింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'విభిన్నమైన ఇతివృత్తంతో తెరకెక్కుతున్న మహిళా ప్రధాన చిత్రమిది. వైజాగ్‌లో జరిగిన తాజా షెడ్యూల్‌లో అంజలి, అరుణ్ ఆదిత్‌ల లవ్‌ట్రాక్‌తో పాటు పృథ్వీ, బ్రహ్మాజీ, గుండు సుదర్శన్, జయవాణిలపై హాస్య సన్నివేశాల్ని తెరకెక్కించాం. హైదరాబాద్‌లో జరిగే తదుపరి షెడ్యూల్‌లో రాయ్‌లక్ష్మిపై పోరాట ఘట్టాలను చిత్రీకరించనున్నాం' అని తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఆనందిని అనే మధ్య తరగతి యువతిగా అంజలి హావభావాలు, పాత్ర చిత్రణ ఆకట్టుకుంటాయి. ఈ పాత్రను ఎంతో ప్రేమించి చేస్తున్నారు. చిత్రీకరణలో అంజలికి గాయాలైనా లెక్కచేయకుండా షూటింగ్‌లో పాల్గొని వృత్తి పట్ల తన అంకితభావాన్ని చాటుకున్నారు' అని తెలిపారు. సుమన్, బ్రహ్మాజీ, మురళీ శర్మ, జయప్రకాష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: పీజీ విందా.

ట్వీట్

నిషా అగర్వాల్
@AggNisha

మనం నిజంగా సంతోషంగా ఉన్నప్పుడు ప్రకాశవంతంగా కనిపిస్తాం.

నిషా అగర్వాల్‌ని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

422,784

కామన్‌మ్యాన్ వాయిస్

ఈ మధ్య మనిషి స్టేటస్ సింబల్ కోసం మొక్కలు పెంచడం మర్చిపోయి కుక్కలు పెంచుతున్నాడు. ఆ కుక్కలను పట్టుకొని మళ్లీ ఎవరో నాటిన మొక్కల మధ్యన తిరుగుతున్నాడు.
-Sai Siri

బాబుగారి హయాంలో మిషన్ 2020 అనే పదాలు బాగా వినే టోళ్లం. 2020 నాటికి టీడీపీ పార్టీని భూస్థాపితం చేయడమే కావొచ్చు ఆ మిషన్.
-Bharath Kumar

నీ చుట్టూ ఉన్న మనుషులనే నీకు అనుకూలంగా మార్చుకోలేవు.. మార్పు గురించి మాట్లాడే అర్హత నీకుందంటావా? నువ్వు మారు నీకు మంచిది. అది చాలు!
-Uday Kiran Dasharadhi

వైరల్ వీడియో

ఫలితాలు వచ్చినప్పుడు ఒకటి, రెండూ, మూడు అని ర్యాంకుల గురించి చెప్పేయాడ్‌లు, వాటి వెనుక ఉండే కష్టాలను ఫన్నీగా చూపించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు వీడియో ట్రెండింగ్ అవుతున్నది.

Results 2.0 | VIVA
Total views : 420,495+
Published on Jun 11, 2019

సుడోకు

డైలీ సుడోకు 61 సమాధానం

1	7	5	3	8	6	4	9	2
9	2	6	1	5	4	8	7	3
8	3	4	7	2	9	6	5	1
3	5	9	6	1	7	2	4	8
6	1	7	2	4	8	5	3	9
2	4	8	9	3	5	7	1	6
5	6	1	8	7	3	9	2	4
4	8	2	5	9	1	3	6	7
7	9	3	4	6	2	1	8	5

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -62

	4		8	3		7		9
						2	4	
9		5						
5				8				6
		4	9		6	3		
3				4				5
						5		2
	5	3						
8		9		2	1		3	

నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

యూనివర్సిటీ ఎంట్రీ స్కీమ్-2019

భారత నావికాదళంలో యూనివర్సిటీ ఎంట్రీ స్కీమ్ కింద ఎస్ఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ (ఐటీ), టెక్నికల్ బ్రాంచీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.



- **పోస్టు:** షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ఆఫీసర్
- **బ్రాంచీ:** ఐటీ
- **అర్హతలు:** బీఈ/బీటెక్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లేదా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ లేదా కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులు.
- **బ్రాంచీ:** ఇంజినీరింగ్
- **అర్హతలు:** బీఈ/బీటెక్‌లో మెకానికల్, మెరైన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ప్రొడక్షన్, ఏరోనాటికల్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ & మేనేజ్‌మెంట్, కంట్రోల్ ఇంజినీరింగ్, ఏరోస్పేస్, ఆటోమొబైల్స్, మెటలర్జి, మెకట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్ బ్రాంచీలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులు.
- **బ్రాంచీ:** ఎలక్ట్రికల్
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్‌లో కింది బ్రాంచీలో ఉత్తీర్ణత. బ్రాంచీలు-ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, టెలీకమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, పవర్ ఇంజినీరింగ్, కంట్రోల్ సిస్టమ్ ఇంజినీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఏవియానిక్స్, ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్, ఇన్‌స్ట్రుమెంటేషన్.
- **నోట్:** ఈ అన్ని పోస్టులకు అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- **వయస్సు:** 1996, జూలై 2 నుంచి 1999, జూలై 1 మధ్య జన్మించి ఉండాలి.
- **శారీరక ప్రమాణాలు:** కనీసం 157 సెం.మీ ఎత్తు ఉండాలి.

ఎంపిక విధానం:

- దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలను నిర్వహిస్తుంది.
- ఇంటర్వ్యూలను బెంగళూరు, భోపాల్, కోయంబత్తూర్, విశాఖపట్నం, కోల్‌కతాలో డిసెంబర్-2019 నుంచి ఏప్రిల్-2020 మధ్య నిర్వహిస్తారు.
- **ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు:** రెండు దశల్లో నిర్వహిస్తారు.
- **స్టేజ్-1:** మొదటి రోజు ఆఫీసర్ ఇంటెలిజెన్సీ రేటింగ్ టెస్ట్, పీపీడీ టీలను నిర్వహిస్తారు. వీటిలో అర్హత సాధించిన వారిని రెండో దశకు ఎంపిక చేస్తారు.
- **స్టేజ్-2:** సైకాలజికల్ టెస్టింగ్, గ్రూప్‌టాస్క్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు. ఈ పరీక్షలను ఐదురోజులపాటు నిర్వహిస్తారు.
- **నోట్:** స్టేజ్ -2, వైద్యపరీక్షల్లో అర్హత సాధించినవారిని ఖాళీల సంఖ్యను బట్టి ఆల్ ఇండియా మెరిట్ ప్రాతిపదికన తుది ఎంపిక చేస్తారు.
- **శిక్షణ:** కేరళ ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీలో జూన్ 2020 నుంచి ప్రారంభమవుతుంది.
- 22 వారాల శిక్షణను పూర్తిచేసుకున్నవారికి నావికాదళంలో ఆఫీసర్‌గా ఉద్యోగావకాశాన్ని కల్పిస్తారు. ఐటీ బ్రాంచీకి నాలుగు వారాల శిక్షణ మాత్రమే ఉంటుంది.
- **పేస్కేల్:** సబ్ లెఫ్టినెంట్ హోదాలో నెలకు రూ.56,100-1,10,700 (లెవల్ 10) జీతాన్ని ఇస్తారు. దీనికి అదనంగా ఇతర అలవెన్సులు, సౌకర్యాలను నేవీ కల్పిస్తుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూన్ 27
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ప్రొఫెసర్ పోస్టులు

అసోంలోని నేషనల్ లా యూనివర్సిటీ అండ్ జ్యుడీషియల్ అకాడమీ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- **పోస్టులు:** ప్రొఫెసర్-3, అసోసియేట్ ప్రొఫెసర్-3, అసిస్టెంట్ ప్రొఫెసర్-1
- **విభాగం:** లా
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** జూలై 2
- **వెబ్‌సైట్:** www.nluas.ac.in

మిధానిలో ఆపరేటర్లు

మిశ్రధాతు నిగం లిమిటెడ్ (మిధాని)లో ఆపరేటర్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.



- చార్జర్ ఆపరేటర్- 3 ఖాళీలు
- **అర్హతలు:** ఏడో తరగతి ఉత్తీర్ణతతో పాటు సంబంధిత రంగంలో నాలుగేండ్ల అనుభవం ఉండాలి.
- క్రేన్ ఆపరేటర్ - 2 పోస్టులు
- **అర్హతలు:** పదోతరగతి ఉత్తీర్ణతతో పాటు సంబంధిత రంగంలో ఐదేండ్ల అనుభవం ఉండాలి.
- జేవోటీ-టర్నర్ -10 ఖాళీలు
- **అర్హతలు:** పదోతరగతి, ఐటీఐ (టర్నర్)తోపాటు రెండేండ్ల అనుభవం ఉండాలి.
- ఫోర్గ్ ప్రెస్ ఆపరేటర్ - 3 ఖాళీలు
- **అర్హతలు:** డిప్లొమాలో మెటలర్జి/మెకానికల్ లేదా బీఎస్సీతోపాటు అల్లాసోనిక్ టెస్టింగ్‌లో లెవల్-2 ఎన్‌డీటీ సర్టిఫికేషన్, ఏడేండ్ల అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** అకడమిక్ మార్కులకు 15, అనుభవానికి 15 మార్కులు, రాతపరీక్ష 100 మార్కులకు నిర్వహించి 70 మార్కులకు లెక్కిస్తారు, ట్రేడ్‌టెస్ట్ పాస్/ఫెయిల్.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 13
- **వెబ్‌సైట్:** http://www.midhani-india.in

ఈసీఐఎల్‌లో ఎగ్జిక్యూటివ్‌లు

ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్)లో ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టు:** ఎగ్జిక్యూటివ్
- **గ్రేడుల వారీగా:** గ్రేడ్-1: 23
- **పేస్కేల్:** రూ. 72,000-80,000/-
- **గ్రేడ్-3:** 7 పోస్టులు
- **పేస్కేల్:** రూ. 1,00,800-1,12,000/-
- **గ్రేడ్-7:** 4 ఖాళీలు
- **పేస్కేల్:** రూ.1,15,200-1,28,000/-
- **నోట్:** ఈ పోస్టులను ఫిక్స్‌డ్ టర్మ్ బేసిస్‌లో భర్తీ చేస్తున్నారు.
- అర్హతలు, ఎంపిక, రిజర్వేషన్లు తదితర వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో జూన్ 14 నుంచి
- **చివరితేదీ:** జూలై 4
- **వెబ్‌సైట్:** www.engineersindia.com

ఈసీఐఎల్‌లో ట్రేడ్‌మెన్లు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లో ట్రేడ్‌మెన్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టు:** ట్రేడ్‌మెన్-సీ
- **విభాగాల వారీగా ఖాళీలు:** ఎలక్ట్రానిక్ మెకానిక్/ఆర్&టీవీ-25, ఫిట్టర్-9, ఎలక్ట్రీషియన్-5, మెషినిస్ట్-3, వెల్డర్-4, మిల్‌రైట్ మెకానిక్-2, ఎలక్ట్రోప్లేటర్-1, టర్నర్-1 ఖాళీలు ఉన్నాయి.
- **జీతభత్యాలు:** నెలకు రూ.30,790/- (అన్ని కలుపుకొని).
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో జూన్ 14 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** జూన్ 29
- పూర్తి వివరాల కోసం
- **వెబ్‌సైట్:** www.ecil.co.in

III.
నమస్తే తెలంగాణ
రైతుబడి
[కరీంనగర్]
గురువారం 13 జూన్ 2019
raithubadi@ntnews.com

బత్తాయిలో తెగుళ్ల నివారణ

బత్తాయి తోటల్లో వివిధరకాల తెగుళ్లు సోకి చెట్లు చనిపోతున్నాయి. ఈ తెగుళ్లు వ్యాపించకుండా ఉండడానికి రైతులు ఏడాది పొడవునా సమగ్రమైన పోషకాలు, నీరు అందించాలి.

వేరుకుళ్లు తెగులు: వేరుకుళ్లు తెగులు వేర్లను ఆశించిన శీలింధ్రాలు ముందుగా పీచు వేర్లను నాశనం చేస్తాయి. దీనివల్ల చెట్లకు నీరు, పోషక విలువలు అందక చెట్లకు పల్లాకు తెగులు ఆశిస్తుంది. తరువాత ఎన్ని మందులు పిచికారీ చేసినా చెట్లు కోలుకోవు. చెట్లకు పూత, పిందె విపరీతంగా వచ్చి రాలిపోతాయి. దీంతో చెట్లు పూర్తిగా ఎండిపోయి చనిపోతాయి.

తెగులు సోకడానికి కారణాలు: నేలలో తేమ తక్కువగా ఉండటం. నీటి తడుల్లో ఎక్కువగా వ్యత్యాసం ఉండటం. అధిక తేమ నీరు నేరుగా చెట్టు కాండానికి తగలడం. వేర్లకు సరిగా గాలి సోకకపోవడం. ఎక్కువ మొతాదులో ఎరువులను ఒకేసారి చల్లుకోవడం. నత్రజని ఎరువులు సరైన మోతాదులో అందించకపోవడం. వేర్లకు తరచూ గాయాలు అవుతుండటం వల్ల వేరు కుళ్లు తెగులు వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు: చెట్లు వాడిపోయే లక్షణాలు ప్రాథమిక దశలో కనిపించినప్పుడే చెట్లకు నీరు కట్టి మరుసటి రోజున లీటరు నీటికి 2 గ్రా, కార్బండిజం, 2.5 గ్రా, మాంకోజెబ్, 20 నుంచి 30 లీటర్ల నీటిలో కలిపి చెట్టు పొద అంతా తడిచే లాగా పోయాలి. నెల రోజుల వ్యవధిలో రెండు లేదా మూడుసార్లు ఈ పద్ధతిని అనుసరించాలి. ట్రైకోడెర్మా విరిడి 2 కిలోలను 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండితో కలిపి 10 కిలోల చొప్పున పాదుల్లో వేసి కలియగలపాలి. శీలింధ్రాలు వృద్ధి చెందకుండా ఇది దోహదపడుతుంది.

తెగుళ్ల నివారణ పద్ధతులు: క్రమం తప్పకుండా సేంద్రియ ఎరువులను వాడాలి. దీనివల్ల భూమిలో సారం పెరుగుతుంది. చెట్ల మధ్య ఖాళీ స్థలంలో చెట్ల పాదుల్లో పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగ చల్లి మొగ్గదశ వచ్చినపుడు దున్నితే భూ సారం పెరుగుతుంది. నీరు, పోషకాలు ఏడాది పొడవునా సరిపడేలా అందించా లి. ఫర్టిగేషన్ పద్ధతిని అవలంబించాలి. తక్కువ ఖర్చుతో నీటిలో కరిగే రసాయనిక ఎరువులు వాడాలి.

నీటి యాజమాన్య పద్ధతులు : నేల స్వభావం, వాతావరణ పరిస్థితులు, చెట్ల వయస్సును బట్టి చెట్లకు నీటిని అందించాలి. లేత చెట్లకు మొదటి 6 నెలల వరకు ప్రతి 3 రోజులకు ఒకసారి, 6 నెలల తరువాత 4 – 6 రోజులకు ఒకసారి 10 నుంచి 15 లీటర్ల నీటిని అందించాలి. 4 నుంచి 5 ఏండ్ల వయస్సు గల చెట్లకు 6 నుంచి 15 రోజుల వ్యవధిలో సుమారు 50 – 75 లీటర్ల నీటిని అందించాలి. కాపు దశలో ఉన్న చెట్లకు రోజుకు 130 – 150 లీటర్ల నీటిని అందించాలి. పాదుల్లో ఎక్కువగా నీరు నిల్వ ఉండటం వల్ల వేరువ్యవస్థ దెబ్బ తింటుంది. చెట్ల పాదుల్లో వరి ఊక, వేరుశనగ పొట్టు వేసి మల్చింగ్ చేయాలి. దీనివల్ల నీరు వృథా కాదు. అంతేకాకుండా ఇది మంచి సేంద్రియ ఎరువుగానూ ఉపయోగపడుతుంది.

-నగిరి హరీశ్, త్రిపురారం

దేశవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో సాగు చేయబడుతున్న ప్రధాన ఆహారపంట వరి. రాష్ట్రంలో దాదాపు 45 లక్షల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. అయితే సంప్రదాయ పద్ధతిలో కాకుండా నాణ్యమైన విత్తనం, సాంకేతిక పరిజ్ఞానంతో సాగు చేస్తే ఆశించిన దిగుబడులు పొందే అవకాశం ఉన్నది. రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేసి తద్వారా విత్తనోత్పత్తి చేపట్టేందుకు గాను గత కొద్ది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ విశేష కృషి చేస్తున్నది.

వరిలో విత్తనోత్పత్తి

తెలంగాణ ప్రభుత్వం, జాతీయ విత్తన సంస్థ, విత్తన ఉత్పత్తిదారులు ఈ సంస్థకు వాటాదారులుగా ఉంటున్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో విత్తనాలను అందుబాటులో ఉంచుతారు. నాణ్యమైన అధిక దిగుబడి రకాలు, సంకరజాతి రకాల విత్తనాలను మాత్రమే ఉత్పత్తి చేసి అమ్ముతారు. విత్తన క్రమంలో భాగంగా ఈ సంస్థ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిశోధన సంస్థల నుంచి బ్రీడర్ విత్తనాలను ముందుగానే తీసుకుంటారు. అనంతరం మూల(ఫౌండేషన్) విత్తన ఉత్పత్తిచేసి నిపుణుల పర్యవేక్షణలో ధృవీకరణ, లేబుల్ విత్తనాలను ఉత్పత్తి చేస్తారు. ఈవిధంగా ఉత్పత్తి చేసిన విత్తనాలను విత్తన పరీక్షా కేంద్రాలలో పరీక్షించిన అనంతరం రైతులకు విక్రయిస్తారు. విత్తనశుద్ధి(ప్రాసెసింగ్), ప్యాకింగ్ సైతం సంస్థ 14 ప్రాసెసింగ్ యూనిట్లలో నిపుణుల పర్యవేక్షణలో జరుగుతుంది. ఒకవేళ ఫిర్యాదులు ఉన్నట్లు అయితే సత్వర చర్యలు తీసుకుంటారు. కాబట్టి విత్తనోత్పత్తిలో రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఎలాంటి యాజమాన్య పద్ధతులు అవలంబించాలో తెలుసుకోవాలి. ముఖ్యంగా వరి విత్తనోత్పత్తిలో ఎదురయ్యే ఇబ్బందులు, నివారణ చర్యల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు అందించిన వివరాలు..

నారు పోసుకునే సమయం..

పంట సాగు కాలం వానకాలం జూన్ నుంచి డిసెంబర్ వరకు, యాసంగి నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు ఉంటుంది. సారవంతమైన నేల, నీటివసతి కలిగి ముంపునకు గురికాని నేలలు అనుకూలం. గత సంవత్సరం పండించిన మొక్కలను తీసివేయాలి. నీటి వసతి కింద దీర్ఘకాలిక రకాలకు మే చివరి వారం నుంచి జూన్ 20 వరకు నారుపోసుకోవచ్చు. మధ్యకాలిక రకాలకు జూన్ 20 నుంచి జూలై 15 వరకు, స్వల్పకాలిక రకాలకు సంబంధించి జూలై చివరి వరకు కూడా నార్లు పోసుకోవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. యాసంగి విషయానికి వస్తే అన్నిరకాల స్వల్పకాలిక విత్తనాలు సాగు చేసుకోవచ్చు.

విత్తన మోతాదు, శుద్ధి ఇలా...

ఎకరానికి 20–30 కిలోలు అవసరం. చిన్న పరిణామం కలిగిన విత్తనాలు ఎకరానికి 15 కిలోలు సరిపోతాయి. ఒక కిలో విత్తనానికి ఒక లీటర్ నీటికి1 గ్రాము కార్బండిజం కలిపి అట్టి ద్రావణంలో 24 గంటలు నానబెట్టిన అనంతరం మండె కట్టుకోవాలి. అనంతరం మొలకెత్తిన విత్తనాలను నారు మడుల్లో చల్లుకోవాలి. వరి విత్తనాలలో నిద్రావస్థను తొలిగించడానికి 6–10 మిల్లీగ్రాముల నత్రికామ్లం లీటర్ నీటిలో కలిపి 24 గంటలు నానబెట్టాలి. అనంతరం నిద్రావస్థ విత్తనాలను నీటితో కడిగి మండె కట్టుకోవాలి.

నారుమడి పెంపకం..

పొలంలో నీరుపెట్టి రెండు, మూడుసార్లు మొత్తగా దున్ని దమ్ము చేసి, చదును చేసుకోవాలి. 100 చదరపు మీటర్ల నారుమడికి అరకిలో యూరియాను విత్తనం చల్లే మందు మరొక అరకిలో యూరియాను విత్తిన 12–14 రోజులలో నారుమడిలో వేసుకోవాలి. అయితే అరకిలో భాస్వరం, అరకిలో పొటాష్ ఇచ్చే ఎరువులు నారుమడి ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. జింకు లోపం గమనిస్తే 1 లీటర్ నీటికి 2.0 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి నారుమడిపై పిచికారీ చేయాలి. విత్తనం చల్లిన వారంరోజుల వరకు ఆరుతడులు ఇచ్చి తరువాత పలుచగా నీరు పెట్టుకోవాలి. నారు పీకే వారం రోజుల ముందు 2.5 సెంట్లు నారుమడికి 400 గ్రా కార్బోఫ్యూరాన్ 3గ్రా గుళికలను ఇసుకలో కలిపి చల్లి పలుచగా నీరు ఉంచాలి.

ప్రధాన పొలం తయారీ-యాజమాన్య పద్ధతులు

నీరు పెట్టుకొని 2–3 సార్లు దున్ని మరుగబెట్టిన అనంతరం దమ్ము చేసుకోవాలి. మురగ దమ్ము చేసినట్లైతే కలుపు మొక్కలు తగ్గి, మొక్కలకు ఎక్కువ పిలకలు వచ్చే అవకాశం ఉంటుంది. ఒక చదరపు మీటర్‌కు దీర్ఘ, మధ్య కాలిక రకాలకు 33 కుదుళ్లు, స్వల్ప కాలిక రకాలకు 44 కుదుళ్లు ఉండాలి. వానకాలంలో సాళ్ల మధ్య 20 సెం.మీ, యాసంగిలో 15 సె.మీ ఎడం ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. అదే విధంగా ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువుతో పాటు, నత్రజని, భాస్వరం ఎరువులను సైతం వేసుకోవాలి. నత్రజని ఎరువులు రెండు, మూడు ధపాలుగా సమభాగాలుగా చేసుకొని వాడుకోవాలి. భాస్వరం, పొటాష్ ఎరువులను ఆఖరి దమ్ములో వేయాలి. వీటితో పాటు మరో 20 కి, గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కూడా వేసుకోవాలి.

నీటి యాజమాన్యం- చీడపీడల నివారణ..

నాట్లు వేసే సమయంలో పొలంలో నీరు పలుచగా ఉండాలి. తర్వాత దుబ్బు చేయడం పూర్తయ్యేంత వరకు 2 లేదా 3 సెంటీమీటర్లు, చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడేంత వరకు ఐదు సెంటీమీటర్ల నీటి మట్టం ఉండాలి. కోతకు వారం పది రోజుల ముందు నుంచి క్రమంగా నీటి మట్టం తగ్గించి ఆరబెట్టుకోవాలి. నాటిన మూడు నుంచి ఐదు రోజుల్లోపు బ్యూటాక్లోర్ 1 లీటర్ లేదా ప్రిటిలాక్లోర్ 500–600 మిల్లీ లీటర్లు ఎకరానికి 20–25 కిలో గ్రాముల పొడి ఇసుకలో కలిపి చల్లుకుంటే కలుపును నివారించుకోవచ్చు. ఇక వరిలో తరచుగా వచ్చే కాండం తొలుచు పురుగు నివారణకు మొదటి దశలో ఎకరానికి 8–10 కిలో గ్రాముల కార్బోఫ్యూరాన్‌ను ఇసుకలో కలిపి చల్లుకోవాలి. సుడిదోమ నివారణకు ఇతర చీడపీడలు, ఉల్లికోడు, తాటాకు తెగులు, వరి ఈగ, తామర పురుగుల నివారణకు 1.6 మిల్లీ లీటర్ల మోనోక్రోటోఫాస్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. మామిడిపండు, కాండం కుళ్లు తెగుళ్ల నివారణకు హెక్సాకొనజోల్ 2 మిల్లీమీటర్లు, వాలిడామైసిన్ 2 మిల్లీలీటర్లు లేదా ప్రాఫికొనజోల్ 1 మిల్లీలీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అదే విధంగా పొట్టకుళ్లు, ఆకు పచ్చ తెగులు నివారణకు కార్బండిజం ఒక గ్రాము లేదా మాంకోజెబ్ 2 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

విత్తనం ఆరబెట్టే పద్ధతి

పొలం వెన్నుల్లో కనీసం 80–90 శాతం విత్తనాలు పక్వానికి వచ్చి పసుపు రంగుకు మారినప్పుడు పంటకోత కోసుకుని రెండు, మూడురోజుల పాటు పొలంలోనే ఆరనివ్వాలి. బల్లకట్టు పద్ధతిలో కాని, యంత్ర సహాయంతో కాని పగులకుండా నూర్చుకోవాలి. విత్తనం చేతికి వచ్చిన తర్వాత శుభ్రమైన గాలి చొరబడే గదులలో లేదా గోదాములలో నిల్వ చేయాలి. ఎలుకలు కన్నాలు వేయకుండా చూసుకోవాలి. సంచులపై రకంపేరు కనపడే విధంగా ముద్రించుకోవాలి. నిర్ధారించిన పరిణామం గల సంచులలో నింపి మూల విత్తనానికి తెలుపురంగు ట్యాగ్‌లను, ధ్రువీకరణ విత్తనాలకు నీలి రంగు ట్యాగ్‌లను జతపర్చి కుట్టుకోవాలి. విత్తనపు సంచులను గోదాములలో గోడకు తగలకుండా కింది భాగంలో చెక్కతో గాని ఇనుముతో చేసిన ప్లేట్లను ఉంచుకోవాలి.

వరిలో రకాలు.. పంటకాలం..

రకం పేరు	పంట సాగు కాలం	పంటకాలం(రోజుల్లో)	దిగుబడి (క్వింటాలలో)
సాంబమసూరి	వానకాలం	140–150	22–24
సోనా మసూరి	వానకాలం	145	28–32
సిద్ధి	వానకాలం	150	24–30
జగిత్యాల సన్నాలు	వానకాలం/యాసంగి	130–140	20–25
వరంగల్ మసూరి	వానకాలం/యాసంగి	135	20–24
బతుకమ్మ	వానకాలం/యాసంగి	125	28–32
కూనారం సన్నాలు	వానకాలం/యాసంగి	125	28–32
తెలంగాణ సోన	వానకాలం/యాసంగి	125	26–28
కాటన్ దొర సన్నాలు	యాసంగి	120–125	26–27
సుగంధ సాంబ	వానకాలం	130	20–23

మద్దెల లక్ష్మణ్, 9010723131
ఖమ్మం వ్యవసాయం

ముచ్చటైన మిద్దెతోట

**శారీరక వ్యాయామం, మానసిక ఆనందం,
విష రసాయనాల జాడలేని కూరగాయలు,
ఆరోగ్య సమస్యలు రానివ్వని సహజ పంటలు
బయట కొనాల్సిన అవసరం లేకపోవడంతో మిగులు ఆదాయం
కుటుంబసభ్యులతో గడిపే విలువైన సమయం
వేసవిలో ఇంట్లో కావలసినంత చల్లదనం
పట్టణంలోనూ ప్రకృతితో మమేకమయ్యే అవకాశం
అన్నిటికీమించి అసలు మనమేం తింటున్నామనే స్పృహ..
ఇంటిపంట అంటే ఇంతేనా..
ఇంతకు మించి చాలా ఉందంటారు
యశోధర ప్రసాద్ దంపతులు.**

ఇ.సి.ఐ.ఎల్‌లో నివాసం ఉండే వీరి మిద్దెతోటను చూస్తే ఎంతకీ కదలబుద్ధి కాదు. గోడల మీద ఏమూల చూసినా యశోధర చేతిలోంచి జాలువారిన చిత్రాలు ముచ్చట గొలుపుతుంటాయి. తోట మధ్యలో నులక మంచం వేసుకుని కూర్చుంటే, మనమున్నది ఒక పక్కా పల్లెటూరు అన్న భావన కలుగుతుంది. వీళ్లు చేస్తున్న తోట చూస్తే మనకూ నాలుగు మొక్కలు పెంచాలన్న కాంక్ష కలిగించే చేతన గృహం ఇది.

యశోధర ప్రసాద్ దంపతులిద్దరూ ఎల్.ఐ.సిలో ఉద్యోగులు. భర్త ప్రసాద్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్‌గా పని చేస్తుండగా, యశోధర అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉన్నారు.

మొదటి నుంచీ వీరిది వ్యవసాయ నేపథ్యం కావడంతో సహజంగానే వీరికి మొక్కల పెంపకంపై ఆసక్తి,అనురక్తి. 2000 సంవత్సరంలో ఇ.సి.ఐ.ఎల్‌లో సొంత ఇళ్లు కట్టిన తొలిరోజుల్లో కొన్ని పూల మొక్కలు పెంచారు. 2007లో ఇంటిపైన పూర్తిస్థాయిలో ఇంటిపంటను ప్రారంభించారు. 2015లో యశోధర రోడ్డు ప్రమాదానికి గురైనపుడు, కొంత విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. మధ్యలో హార్టికల్చర్ షోకు వెళ్లినపుడు కలిసిన మిద్దె తోట మిత్రులు పంచుకున్న విషయాలు, ఆమెలో మరిన్ని ఆలోచనలను రేకెత్తించాయి. వారి పరిచయంతోనే యశోధర ఇంటిపంట ఫేస్‌బుక్ గ్రూప్‌లో జాయిన్ అయ్యారు. అప్పటి నుంచి గార్డెన్‌లో కొత్త తరహా ప్రయోగాలకు శీకారం చుట్టారు. ఆమె సహజంగానే ఆర్టిస్ట్ కావడంతో, గోడల మీద రకరకాల బొమ్మలతో మిద్దెతోటను అందమైన వర్ణచిత్రంగా మలిచారు. టెర్రకోట బొమ్మలు మీద రంగులు వేసి, వాటిలో చిన్న చిన్న అలంకరణ మొక్కలు పెంచుతున్నారు.

ఈ తోటలో పూలు, పండ్లు, అలంకరణ మొక్కలు, ఔషధ మొక్కలు ఉన్నప్పటికీ ప్రధానంగా కూరగాయల మీద దృష్టి పెట్టారు. మూడు అంతస్థుల్లో పలురకాల ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. వీటిల్లో దొండ, వంకాయ, టమాటా, బెండకాయ, గోరుచిక్కుడు, కాకర సంవత్సరం పొడవునా కాస్తున్నాయి. వేసవిలో దోస, కాకర, వంకాయ, టమాటా, గోరుచిక్కుడు, ఆకుకూరలు విపరీతంగా వచ్చా యి. వంకాయలు ఎంతమందిని ఇచ్చినా రోజూ వస్తుంటాయి. సహజంగా రెండేళ్లు దాటగానే కాపుతగ్గే వంగ ఇక్కడ మాత్రం మూడేండ్లకు పైగా మంచి కాపు కాస్తున్నది. వంగ, దోస, గోరుచిక్కుడు, ఆకుకూర లు ఈ ఐదేళ్లలో అసలు బయట నుంచి కొనలేదంటారు యశోధర ప్రసాద్.

వీరు తమ తోటలో మరింత మెరుగైన ఉత్పత్తి కోసం జీవామృతం వాడుతున్నారు. ఇందుకోసం కావలసిన పశు వ్యర్థాలను దగ్గరలోని గోశాల నుంచి తెచ్చుకుంటున్నారు. కిచెన్ వేస్ట్, తోటలో రాలిన ఎండుటాకుల మీద ఒక పొరగా మట్టివేసి, దానికి కొంచెం మైక్రోబియల్ కోకోపిట్ కలిపి కుండలో వేసి, కంపోస్ట్ చేసి ప్రతివారం మొక్కలకు వేస్తున్నారు. కొన్నిసార్లు తెగుళ్ల సమస్య వచ్చినపు డు, మొక్కల మీద బూడిదను చల్లుతున్నా రు. పేనుబంక కనిపించినపుడు (వంగ, మందార, దొండ) 10లీటర్ల నీటికి 30ఎం.ఎల్ వేపనూనె కలిపి వాడుతున్నారు. పసుపు నీళ్లు, పులిసిన మజ్జిగను నీటిలో కలిపి పిచికారీ చేస్తున్నారు. ఇక మందారకు మిల్లీబగ్ ఎక్కువగా వస్తున్నది. దానికి ఎన్నిరకాల ప్రయత్నాలు చేసినా పెద్దగా ఫలితం రాలేదంటారు. నీటి యాజమాన్యానికి సంబంధించి వర్షాకాలం, చలికాలం మొక్కల కు రోజు విడిచి రోజు,ఎండాకాలంలో రెండు రోజులకు ఒకసారి నీరు పెడుతున్నారు. విత్తనాలను తిరిగి కొనకుండా, ప్రతి రకంలో ఒక మొక్కను విత్తనం కోసం విడిచిపెడుతున్నారు.

ఇక తమ తోటలో యశోధర చేస్తున్న ప్రయోగాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. 20 లీటర్ల వాటర్ క్యాన్ కింది భాగాన్ని రెండుగా కత్తిరించి, కింద భాగాన్ని కూరగాయలు పెంచుకోవడానికి వాడుతున్నారు. పైభాగాలన్నింటిని ఒక పి.వి.సి పైపుతో కలిపి పొడవాటి స్టాండ్‌గా తయారుచేసి వాటిలో టేబుల్ రోజెస్ పెంచుతున్నారు. లీటర్ వాటర్ బాటిల్స్‌ను కింద భాగంలో కొంచెం వదలి పైన చతురస్రాకారంలో కత్తిరించి, అడుగున కొంత మట్టిపోసి వాము మొక్కలు పెంచుతున్నారు. 'ఒకప్పుడు మా ఆఫీసులో చెట్ల గురించి మాట్లాడుతుంటే, నన్ను పిచ్చిదాన్ని చూసినట్టు చూసేవారు, ఇప్పుడు మాత్రం ఇంటి పంటలపై చాలామందిలో అవగాహన పెరిగింది. మా ఇంటికి వచ్చి చూసినవాళ్లు, మా విత్తనాలు తీసుకెళ్లి ఇంటి పంటలు పండిస్తున్నారు. మెట్రోలో ఆఫీసుకు వెళుతున్నపుడు అమీర్‌పేటవైపు చాలా రూఫ్ గార్డెన్స్ కనిపిస్తున్నాయి అంటే, ఇది జనాల్లో ఇంటిపంటపై పెరిగిన చైతన్యం అంటారు' యశోధర.

యశోధరకు మొక్కలంటే పిచ్చి ఉంది కాబట్టే, ఎవరింటికైనా వెళ్లినపుడు అక్కడ నచ్చిన మొక్కను తన తోటలో నాటుకుంటారు. అలా తన తోట ఇవాళ చిన్నపాటి ఉద్యానవనాన్ని తలపిస్తున్నది. అసలు ఈ పూలు, పండ్లు, ఉదయం పూట పక్షుల కువకువల మధ్య గడుపుతుంటే ప్రకృతిలో ఉన్నట్టే ఉంది అంటారు యశోధర ప్రసాద్ దంపతులు.

యశోధర ప్రసాద్ ఇంటితోటలో పెరుగుతున్న మొక్కలు

ఆకుకూరలు కొత్తిమీర, పుదీనా, కరివేపాకు, తోటకూర, సిలోన్ బచ్చలి, పాలకూర, బచ్చలి కూర, గోంగూర, గంగవావిలి,

కూరగాయలు: టమాటా, చెర్రీ టమాటా, హైబ్రిడ్ టమాటా, వంగ (తెలుపు, నలుపు, గుత్తి వంకాయ, పొడవు వంగ), బెండ, గోరుచిక్కుడు

తీగజాతులు దొండ, బీర, నేతి బీర, సొర, కాకర, చిక్కుడు

దుంపజాతులు: చేమ, ఆలుగడ్డ, ఉల్లిపాయ, చిలగడదుంప, పసుపు, అల్లం, మామిడి అల్లం

పండ్ల మొక్కలు: నిమ్మ, సీతాఫలం, దానిమ్మ, అంజీర్

పూల మొక్కలు: మల్లె (బొండు మల్లె, తీగ మల్లె, చిట్టి మల్లె, కాగడా మల్లె, స్టార్ మల్లె), కనకాంబరం (మూడు రంగులు), చామంతి, తామర, టేబుల్ రోజెస్), గులాబీ, కాగితం పూలు, శంఖు పుష్పం

ఔషధ మొక్కలు: తులసి, మింట్ తులసి, సబ్జ, అలోవెరా, నల్లేరు

వీటితో పాటు తమలపాకు, స్టీవియా, ఇన్సులిన్ ప్లాంట్, కాక్టస్‌లో పలురకాలు, స్నేక్‌ప్లాంట్, వెదురు, క్రోటన్ మొక్కలు పెరుగుతున్నాయి.
(ఇతర వివరాలకు సంప్రదించవలసిన నెంబర్..79890 23818)

కె.క్రాంతికుమార్‌రెడ్డి, నేచర్స్‌వాయిస్

పీడీవీ ప్రసాద్, సుధాకర్‌రెడ్డి, రాధాకృష్ణ, రష్మిక మందన్న, వెంకీ కుడుముల, నితిన్

నితిన్ - రష్మిక మందన్నల 'భీష్మ' మొదలైంది

నితిన్, రష్మిక మందన్న జంటగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కుతున్న తాజా చిత్రం 'భీష్మ'. సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకీ కుడుముల దర్శకుడు. బుధవారం హైదరాబాద్‌లో ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. దర్శకుడు వెంకీ కుడుముల చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. ఆద్యంతం వినోదభరితంగా ఉంటుంది. యువతరాన్ని ప్రతిబింబిస్తూ నితిన్, రష్మిక మందన్న పాత్రలు సాగుతాయి. ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతాయి. కథ, కథనాలు అలరిస్తాయి' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'ఈ నెల 20 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. డిసెంబర్‌లో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు. నరేష్, సంపత్, రఘుబాబు, బ్రహ్మాజీ, నర్రా శ్రీనివాస్, కల్యాణి, రాజశ్రీనాయర్ కీలక పాత్రలను పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వరసాగర్, ఛాయాగ్రహణం: సాయిశ్రీరామ్, ఆర్ట్ డైరెక్టర్: సాహి సురేష్, ఎడిటర్: నవీన్ నూలి, సమర్పణ: పి.డి.వి ప్రసాద్.

ఆది పినిశెట్టి 'క్లాప్' షురూ

ఆది, ఆకాంక్షసింగ్, క్రిష కురుప్‌లపై క్లాప్‌నిస్తున్న ఇళయరాజా

ఆది పినిశెట్టి కథానాయకుడిగా నటిస్తున్న ద్విభాషా చిత్రం 'క్లాప్'.'సౌండ్ ఆఫ్ సక్సెస్' ఉపశీర్షిక. పృథ్వీ ఆదిత్య దర్శకత్వం వహిస్తున్నారు. ఆకాంక్ష సింగ్ కథానాయిక. బిగ్ ప్రింట్ పిక్చర్స్ అండ్ సర్వన్ట్ రామ్ క్రియేషన్స్ పతాకంపై ఐబి కార్తికేయన్, యమ్. రాజశేఖర్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూజాకార్యక్రమాల అనంతరం చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి తెలుగు వెర్షన్‌కు ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా క్లాప్ నిచ్చారు. తమిళ వెర్షన్‌కు హీరో నాని క్లాప్ నిచ్చారు. నిర్మాత అల్లు అరవింద్ కెమెరా స్విఛాన్ చేశారు. స్క్రిప్ట్‌ను బోయపాటి శ్రీను, గోపీచంద్ మలినేని, బొమ్మరిల్లు భాస్కర్ అందజేశారు. అనంతరం ఆది పినిశెట్టి మాట్లాడుతూ 'హృదయాన్ని కదిలించే చిత్రమిది. క్రీడా నేపథ్యంలో ఇప్పటి వరకు చాలా సినిమాలు వచ్చాయి. వాటన్నింటికి భిన్నంగా సాగుతుంది. భిన్నమైన రెండు పార్శ్వాలున్న పాత్రలో నటిస్తున్నాను. ప్రతిభ వున్న నటీనటులు, సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పనిచేస్తున్నారు' అన్నారు. అథ్లెటిక్ స్పోర్ట్స్ నేపథ్యంలో సాగే సినిమా ఇదని, ఏడాది కాలంగా ఈ చిత్ర కథని సిద్ధం చేసుకున్నానని దర్శకుడు తెలిపారు. జవ్వాజి రామాంజనేయులు మాట్లాడుతూ 'ఇళయరాజా సంగీతం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ నెల 17 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. హైదరాబాద్, చెన్నై, బెంగళూర్, మధురైలలో జరిపే నాలుగు షెడ్యూళ్లతో చిత్రీకరణ పూర్తి చేస్తాం' అన్నారు. నాజర్, ప్రకాష్‌రాజ్, క్రిష కురుప్, బ్రహ్మాజీ, ముండాసు పట్టి రాందాసుమిమే గోపి, సూర్య, మీనా, వాసు తదితరులు నటిస్తున్నారు.

ఓటు విలువతో..

ప్రశాంత్ గౌడ్

మంచు విష్ణు, సురభి జంటగా నటిస్తున్న చిత్రం 'ఓటర్'. రామా రీల్స్ పతాకంపై జాన్ సుధీర్ పూదోట నిర్మిస్తున్నారు. జి.ఎస్ కార్తీక్ దర్శకుడు. ఈ నెల 21న ఈ చిత్రం విడుదల కానుంది. నిర్మాతగా, పంపిణీదారుడిగా ఎన్నో విజయవంతమైన సినిమాలను తెలుగు ప్రేక్షకులకు అందించిన ప్రశాంత్ గౌడ్ సార్థక్ మూవీస్ పతాకంపై ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదలచేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌గౌడ్ మాట్లాడుతూ 'ఓటు హక్కును, ఓటర్ విలువను చాటిచెప్పే చిత్రమిది. పదవిలో ఉన్న నాయకుడు సరిగా పనిచేయకపోతే అతడితో ఎలా పనులు చేయించుకోవాలో చెబుతుంది. రాజకీయ అంశాలకు నాటకీయతను జోడించి దర్శకుడు కార్తిక్ ఆసక్తికరంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. కథ నచ్చి ఫ్యాన్సీ రేటుకు ఈ చిత్ర విడుదల హక్కులను సొంతం చేసుకున్నాం. తెలుగు ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: రాజేష్ యాదవ్, ఎడిటింగ్: కె.ఎల్ ప్రవీణ్.